మే 01-15, 2021

సంపుటి 01, సంచిక 14

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



## కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు



నిరంతరం నేర్చుకునే ఉపాధ్యాయుడు మాత్రమే
చక్కటి విద్యార్థులను తయారుచేయగలడు.

- రవీంద్రనాథ్ ఠాగూర్

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

విలువైన మాలిక



శ్రీ రామున్ని ఆరాధించిన
**కంచర్ల గోపన్న** నాటి కవిత

04

**తంగేడు**

27

**శాసనాలు జీవనగతిని శాసించే చరిత్రకు మౌలికాంశాలు** అని చెప్పిన డా॥ బూర్ల చంద్రశేఖర్ వ్యాసం...

15

కొత్త పుస్తకమైన **నిజం** ని అవిష్కరించిన **అయినం పూడి శ్రీలక్ష్మి**



09

వాక్పటిమే **జాషువాకు** పేరు తెచ్చిన వైనాన్ని వివరించిన ఏనుగు **నరసింహారెడ్డి** వ్యాసం **పిరదౌసి కావ్యానుశీలనం**




23

**పుస్తకాల ప్రాధాన్యత**ను చెప్పిన **బెకన్‌పై** చిరు విశ్లేషణ...



21

చిన్ననాటి జండావందనాన్ని స్మృతికి తెచ్చిన **వేముగంటి మురళి** కథ... **ప్రభాతభేరి**



37

పై పై నీతులు చెప్పేవాళ్ళ రంగు బయట పెట్టిన **దేవకీ దేవి** కథ... **గురువిందగింజలు**



05

**సిపాయి** తిరిగి వచ్చి తన ప్రేమను నిలిపిన ఆదర్శం చిత్రించిన **డి. రామలింగం** కథ



33

డబ్బు పట్ల నిగ్రహం చూపని వ్యక్తి పతనాన్ని చెప్పిన **పిన్నంశెట్టి** కథ **పొంగు.**



**'కవి ఒంటరి కాదు'** అంటున్న ఈ నాటి సాహితీవేత్త **జింబోతో మామిడాల** ముఖాముఖి.

43


తన అనుశీలనతో నిత్యవసంతాన్ని చిత్రించిన **లక్ష్మణ చక్రవర్తి** వ్యాసం నేను **అంతర్ బహిర్ జగత్తుల వసంతం...** 13 పేజీలో

**కొలవి గోపరాజు తెలిపిన నాటి తెలంగాణ సంస్కృతి** గురించి విశ్లేషించిన **అనుమాండ్ల భూమయ్య...** 35 పేజీలో

నాటి సమాజాన్ని చిత్రించిన **యక్ష గానం** కథను విశ్లేషించిన వెల్లండి **శ్రీధర్...** 39 పేజీలో

ఇంకా **కళ్ళెం నవీన్ రెడ్డి** **"నేనే"...** 09 పేజీలో

**రాజేందర్ రాజు... ఏది మొదలు కాదు, ఏది ఆఖరు కాదు ...** 41 పేజీలో

**విష్ణువర్ధన్ రాజు... అమ్మ యాది...** 12 పేజీలో

**కొమురవెల్లి అంజయ్య... వంటింటి నుదుటి బొట్లు..** 25 పేజీలో

**నూటెంకి రవీంద్ర... అతడు... అతని పని ...** 42 పేజీలో

**మెట్రామశర్మ** **సైనికా** కవనాలు...


మొదలైన కవితలు మరియు సాహితీ శిఖరం కొత్తపుస్తకం పుస్తక సమీక్ష, స్వీకారం మరెన్నో....

# ‘తంగేడు’ పాఠకులకు ముఖ్య గమనిక

తెలంగాణ జాగృతి తెలంగాణ సంస్కృతి పరిరక్షణ కోసం నవ యువతను ప్రోత్సహించడం కోసం వెలువరిస్తున్న ‘తంగేడు’ సాహిత్య పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ కృతజ్ఞతలు. అనూహ్యంగా కోవిడ్ సెకండ్‌వేవ్ విజృంభణ వల్ల పత్రికను నేరుగా ప్రింట్ కాపీను అందించలేక పోతున్నందుకు చింతిస్తున్నాం. ప్రస్తుతానికి పత్రికను వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుంది. పాఠకులు సహకరించగలరు. కోవిడ్ వ్యాప్తి తగ్గేంతవరకు ప్రింట్ కాపీ అందించలేకపోవచ్చు. పరిస్థితి అనుకూలించాక అందించగలం.

మేము అందించినంత కాలం ఎందరో పెద్ద రచయితలు, పాఠకులు ధర నిర్ణయించాల్సిందిగా ఎన్నో విజ్ఞప్తులు చేశారు. మీ కోరికను అనుసరించి కేవలం నామమాత్రమైన వెల రూ. 2/-, వార్షిక చందా రూ. 50/-లుగా నిర్ణయించడం జరిగింది. ప్రింట్ కాపీ మాత్రం చందాదారులకు మాత్రమే పంపడం జరుగుతుంది. పాఠకులు గమనించ ప్రార్థన. చందా దారులుగా, మా పాఠక సభ్యులుగా మన ‘తంగేడు’ కుటుంబంలో చేరండి. చందావివరాలు దిగువున ఇస్తున్నాం.




## ‘తంగేడు’ సంచిక వార్షిక చందా వివరాలు

‘తంగేడు’ పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. తంగేడు పత్రిక ప్రతి సంచికను పొందేందుకు గాను, వార్షిక చందాదారులుగా చేరండి. ఇందుకోసం రూ.50 చెల్లించి, 24 సంచికలను పొందండి. చందాదారులుగా చేరేందుకు **http://www.thangedu.co.in** వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకొని, ఆన్ లైన్ లో నగదు చెల్లించేందుకు వీలు కల్పించడం జరిగింది. డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, UPI ద్వారా నిర్ణీత నగదు చెల్లించగలరు. చెక్కుల ద్వారా కూడా వార్షిక చందాదారులుగా చేరవచ్చు.

**వార్షిక చందా చెక్కులను పంపవలసిన చిరునామా:**

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం.1-2-234/13/46/4,
3వ అంతస్తు, ఎన్.టి.ఆర్ స్టేడియం దగ్గర, అరవింద్ నగర్,
దోమలగూడ, హైదరాబాద్ - 500 029.

సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 మే, 2021

సంపుటి 01 సంచిక 14



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

# మేడే శుభాకాంక్షలు...

ప్రపంచ కార్మికులారా ఏకం కండి, పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్లు తప్ప, మొదలైన నినాదాలు మనం చాలా విని ఉంటాం. ఇవన్నీ సాహిత్యంలో కార్మిక స్పృహ, సమసమాజ స్వప్నాన్ని సాకారం చేసే సమాజ వాద స్పృహ ప్రోది చేసే నినాదాలే. సాహిత్యం కోరుతున్న ప్రజా క్షేమానికి గొప్ప నిదర్శనాలే. శ్రీశ్రీ, దాశరథి లాంటి మహాకవుల రచనలలో కనిపించే సమాజవాద స్పృహను లేక కార్మిక స్పృహను గురించి కొత్తగా చెప్పాలిసిన అవసరం లేదు.

అసలు మేడే పరిణామం ప్రపంచ దేశాల్లో ఒక ఆసక్తికరమైన అంశం. వసంత కాలం (spring) ఆగమనాన్ని మధ్య యూరప్‌లో ఒక ఉత్సవంగా జరుపుకొనేవారు. అట్లాగే ప్రాచీన గ్రీకు దేవత ఫ్లోరాకు ఆరాధనోత్సవంగా కూడా జరిగేది. ఇది 1889లో కార్మికదినంగా పరిణామం చెందింది. చికాగోలోని కార్మికులు రక్త తర్పణం చేసి తమ దేశపు కార్మికులతో పాటు ప్రపంచ కార్మికులలో కూడా ఈ చైతన్యం రగిలించారు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకునే సమయం లో ఎనిమిది గంటల పనిదినం కోసం పోరాడి విజయం సాధించారు. ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటల విశ్రాంతి, ఎనిమిది గంటల రిక్రియేషన్ అని పోరాటం ద్వారా సాధించారు. 1917లో వచ్చిన రష్యా విప్లవం, లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీ శ్రామిక పాలన సామాజిక, సాహిత్య రంగాలను చాల ప్రభావితం చేసింది. హెగెల్ గతి తార్కిక భౌతిక వాదం, మార్క్స్ కమ్యూనిస్ట్ మానిఫ్యాస్టో ఈ ఉద్యమాన్ని ప్రభావితం చేశాయి. 1923లో మొదటి సారి భారత దేశంలో మే డే, జరుపుకున్నారు. 1920లో ట్రేడ్ యునియన్ ఏర్పడడం ద్వారా కార్మిక వర్గ చైతన్యం మొదలయింది. 1985 తర్వాత ప్రయివేటయిజేషన్, లిబరైజేషన్, గ్లోబలైజెషన్, పరిణామాల వల్ల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదు.

తెలుగు సాహిత్యంలో 1935 తరువాత కార్మిక వర్గ స్పృహ మొదలైంది. 1935లో ఏర్పడ్డ అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం తెలుగుతో పాటు అన్ని భారతీయ భాషలపైన తన ప్రభావాన్ని చూపింది.

1930కి కొంచెం అటు ఇటుగా ఆంగ్ల సాహిత్యంలో కూడా కార్మిక స్పృహ, సమాజవాద భావజాలం ప్రవేశించింది. 1932లో వచ్చిన New Signatures అనే కవితా సంకలనం దీన్ని ప్రతిఫలించింది. ఆడెన్ (W.H.Auden) డే లూయిస్ (Day Lewis) స్టీఫెన్ స్పెండర్ (Stepen Spendar) వంటి కవులు ఈ మార్గానికి పాదులు వేశారు. శాస్త్రీయతకు వీరు స్వాగతం పలికారు.

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ చైనాలో రిక్షావాలా, చెక్ దేశపు గనిపనిమనిషి, ఐర్లాండ్ లోని ఓడ కళాసి, హాటెన్ టాట్, జూలూ, నీగ్రోలాంటి ఖండాంతర నానా జాతుల, అణగారిన ఆర్తుల గీతాలు, రచించాడు. శ్రీశ్రీలోని నవ్య కవిత్వం కార్మిక లోకపు కల్యాణానికి సమర్పన గా నిలిచింది. శ్రామిక లోకపు సౌభాగ్యాన్ని ఆర్తిగా ఆకాంక్షించింది. భూరి వృక్షం జారిపడ్డపుడే లేత మొక్క పైకి లేస్తుంది, పసిడి మేడ పక్క కొరిగినపుడే అడుసు గుడిసె నడువ నేరుస్తుంది," (సి.నా.రె.) శ్రామికుని పిల్లలను ఇల్లాలును కిళ్ళీ మాగ్నెట్‌గా నమిలే మిల్లు మాగ్నెట్ అని, అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామం, అనాథుడికి, ఆగర్భ శ్రీమంతుడికి మధ్య (దాశరథి) అని అభ్యుదయ కవులు కార్మికుని పక్షాన గళమెత్తారు. తరువాత సాహిత్యం అనేక పాయలుగా నడచినా ఇప్పుడున్న బహుజన వాదం అన్యాపదేశంగా కార్మిక స్పృహలో భాగమే.

సాహిత్యంలో ప్రతిపాదించే ఆశయాల ప్రభావంతో తెలంగాణ కార్మికులు మరింత చైతన్యం పొందాలని, బంగారు తెలంగాణాలో వాళ్ళ లక్ష్య సాధన జరుగాలని ఆకాంక్షిద్దాం.

జై తెలంగాణ, జై జాగృతి.

**కార్మిక సోదరులందరికి మే డే శుభాకాంక్షలు.**

నాటి కవిత

# దాశరథీ కరుణాపయోనిధీ

**కంచెర్ల గోపన్న**





దాశరథీ శతకము శ్రీరాముని ప్రస్తుతిస్తూ కంచర్ల గోపన్న 17వ శతాబ్దంలో రచించిన భక్తి శతకం. ఈ శతకానికి దాశరథీ కరుణాపయోనిధీ అనే మకుటం అన్ని పద్యాలలో చివరగా వస్తుంది. దాశరథీ అనగా దశరథుని పుత్రుడైన శ్రీరాముడు.

భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి పొందిన ఇతని అసలు పేరు కంచెర్ల గోపన్న. 1620లో, ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో లింగన్నమూర్తి, కామాంబ దంపతులకు జన్మించినాడు. వీరి భార్య కమలమ్మ శ్రీరాముని కొలిచి, కీర్తించి, భక్త రామదాసుగా సుప్రసిద్ధుడైనాడు. భద్రాచల దేవస్థానమునకు, ఇతని జీవిత కథకు అవినాభావ సంబంధం. దాశరథి శతకము, ఎన్నో రామ సంకీర్తనలు, భద్రాచలం దేవస్థానము - ఇవన్నీ రామదాసు నుండి తెలుగు వారికి సంక్రమించిన పెన్నిధులు. ఇతని గురువు శ్రీ రఘునాథ భట్టాచార్యులు.

శ్రీ రఘురామ చారుతులసీ - దళధామ శమక్షమాది శృం
గార గుణాభిరామ త్రిజ-గన్నుత శౌర్య రమాలలామ దు
ర్వార కబంధరాక్షస వి-రామ జగజ్జన కల్మషార్ణవో
త్తారకనామ! భద్రగిరి-దాశరథీ! కరుణాపయోనిధీ!

రంగదరాతిభంగ, ఖగ రాజతురంగ, విపత్పరంపరో
త్తుంగ తమఃపతంగ, పరితోషితరంగ, దయాంతరంగ స
త్సంగ ధరాత్మజా హృదయ సారసభృంగ నిశాచరాబ్ధిమా
తంగ, శుభాంగ, భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

శ్రీ రఘువంశ తోయధికి శీతమయూఖుడవైన నీ పవి
త్రోరుపదాబ్జముల్ వికసితోత్పల చంపక వృత్తమాధురీ
పూరితవాక్ప్రసూనముల బూజలొనర్చెద జిత్తగింపుమీ
తారకనామ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

శ్రీరమ సీతగాగ నిజసేవక బృందము వీరవైష్ణవా
చార జనంబుగాగ విరజానది గౌతమిగా వికుంఠము
న్నారయభద్ర శైలశిఖరాగ్రముగాగ వసించు చేతనో
ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ! కరుణాపయోనిధీ!

భండన భీముడా ర్తజన బాంధవుడుజ్జ్వల బాణతూణకో
దండకళాప్రచండ భుజ తాండవకీర్తికి రామమూర్తికిన్
రెండవ సాటిదైవమిక లేడనుచున్ గడగట్టి భేరికా
దాండడా దాండ దాండా నిన దంబులజాండము నిండమత్తవే
దండము నెక్కి చాటెదను దాశరథీ! కరుణాపయోనిధీ!

నాటి కథ

# సిపాయి రాముడు

వెళ్ళిపోయి తిరిగి వచ్చిన ఒక సిపాయి ప్రేమకథ...



డి. రామలింగం
(రచనా కాలం : 1947)

రామలింగం ఆ సాయంత్రం వేళ రైలు దిగి ఊళ్ళోకి వచ్చేసరికి ఊరు వూరంతా ఎవరీ మనిషి అన్నట్టు బిత్తరపోయి చూచింది. అరుగుల మీద కూర్చున్నవాళ్ళు కంచెల చాటున నిల్చున్నవాళ్ళు, వాకిళ్ళ ముందు పనిపాటలు చూచుకుంటున్న వాళ్ళు అంతా ఆ కొత్త మనిషిని ఆశ్చర్యంగా చూస్తున్నారు. బజార్లలో ఆడుకుంటూవున్న పిల్లలు గుంపుగా వాడి వెంటబడి ఎవరీ బూచాడని చోద్యంగా చూస్తున్నారు. వాడు నేరుగా ముందుకుపోయి 'అమ్మా' అని పిలిచాడు.

లోపల బట్టల మడతలు సర్దుతూవున్న వెంకామ బైటికొచ్చి "ఎవరునువ్వు" అంటూ రాముణ్ణి నిలువెల్లా చూచింది. "నేనమ్మా" అన్నాడు రాముడు తల్లి మొహంలోకి చూస్తూ,

"ఆం! నువ్వురా రాముడూ" అంటూ ఆ తల్లి కొడుకును అమాంతం కావలించుకొని వొళ్ళంతా పట్టి చూస్తూ "ఇన్నాళ్ళకు నేను గ్యాపకమొచ్చానురా" అంది చీరె చెరగుతో కళ్ళు తుడుచుకుంటూ.

"సెలవు పెట్టి వొచ్చానే" అన్నాడు రాముడు. "నా తండ్రే. నాలుగేళ్ళ నుంచీ నీ కోసం చూచి కళ్ళు కాయలు గాశాయి. రా లోపలికి" అంటూ ఇంట్లోకి దారితీసింది.

రాముడు తనవెంట వొచ్చిన కూలీ అబ్బికి డబ్బులిచ్చి పంపేసి లోపలికి వెళ్ళాడు. తల్లి వాడికి దాహానికి మంచి నీళ్ళిచ్చి గుమ్మం ముందున్న కంచె దగ్గరికెళ్ళి సంతోషం పట్టలేక ఎల్లినీ, మల్లినీ కేకేసి "రాముడొచ్చాడు రాండే" అంది. ఎల్లీ, మల్లీ ఆదరా బాదరావచ్చి రాముణ్ణి ఆపాదమస్తకంగా పరిశీలనగా చూచి బుగ్గలు నొక్కుకుంటూ "ఓశక్కా, ఇంతోడు ఎంతోడైనాడో! గుర్తుపట్టకుండా పోయ్యాడు. ఇంకానీకేమే దొంగన్న కొడుకు దొరలా వొచ్చాడు" అన్నారు.

వెంకామ నిలువెల్లా సంతోషంతో ఉప్పొంగి పోయింది. ఎల్లీ, మల్లీ అన్న మాట నిజమే అనిపిస్తూవుంది. రాముడు ఆ వూళ్ళో వున్నంతవరకూ ఎలా వుండేవాడు! ఇప్పుడెలా ఉన్నాడు!! ఆ మాతృమూర్తి కొడుకును చూస్తూ నాలుగేళ్ళు వెనక్కి చూచింది.

రాముడు చిన్నప్పటి నుంచీ ఉత్త గుండగొయ్య. బళ్లో వేస్తే చదువబ్బలేదు. రాలుగాయలా డొంకలంటా, చొప్పవాములంటా తిరిగేవాడు. తోటలో కాయా గడుసూ దక్కనిచ్చేవాడు కాదు. కుక్క నొకదాన్ని వెంటబెట్టుకుని ఊరునానుకొని పారే యేరుదాటి మామిడి తోపులోకి వెళ్ళి పగలంతా ఆ చెట్ల క్రింద తిరిగేవాడు. వానాకాలం వచ్చిందంటే బుర్ర ఒకటేసుకొని ఏట్లో ఈదుతూ వరదకు కొట్టుకొచ్చే కర్రల్నీ, కొయ్యల్ని పట్టుకొని ఒడ్డుకేసి కోమటి వైకుంఠానికి అప్పగించి సెనగపప్పు, బీడీలు తీసుకొనేవాడు. వూర చెరువు కెళ్ళి గాలంతో చేపలు పడుతూ అక్కడే నిద్రపొయ్యేవాడు. చింతలతోపులో డబ్బులు పెట్టి గోళీకాయలాట ఆడేవాడు. దాని మూలకంగా ఇంటి మీదికి రోజుకొక తగవు. ఎవరినో కొట్టేవాడు. ఎవరితోనో తన్నులు తినేవాడు. ఇంటికొచ్చి కుక్కపడుకున్న మూల స్పృహ లేకుండా పడుకొని వుండేవాడు. కుల వృతి చేయరా అంటే "చెహే వుండండి" అని కసురుకునేవాడు. అన్నలు వాడిమీద ఆశ ఎప్పుడో వదులుకున్నారు. పద్దెనిమిదే ళ్ళొచ్చాయి. పెళ్ళన్నాచేస్తే బాగుపడతాడేమోనని కొందరన్నారు. సరేనని తల్లి తండ్రి "పిల్లనియ్యవే" అని మల్లిని దేహి అని అడిగారు. మల్లి ఉగ్రురాలై" గుండకొయ్యకా నా పిల్ల. మళ్ళీ ఆ మాటెత్తారంటే బుద్ధి చెప్తా" అంటూ "దమ్మిడి చెయ్యని యదవ. వాడికొకడికి గతిలేదు. నా పిల్లకేం పెడతాడు" అని వాడి అప్రయోజక త్వాన్నంతా ఏకరు పెట్టి అంతటితో ఊరుకోక "రాగెంటుకల యదవ. రొయ్యలకుమల్లె ఆడి కనురెప్పలు, ఒళ్ళంతా బొచ్చు. ఈడికా నా పిల్ల, దాని కుదురుమట్టానికి వయసొస్తే దొరలొచ్చి

పడిగాపులు గాస్తారు'' అని ఈసడించి కొట్టింది. ఇలాంటి రాముణ్ణి ఏంచెయ్యాల్లో తల్లిదండ్రులకు తోచలేదు. వాణ్ణి అలా వదిలేసి వూరుకున్నారు. వాడు కూడా తానా వూళ్ళోవుండి చేసేదేమిలేదని గ్రహించాడో యేమో ఒకరోజు ఎవరికీ చెప్పకుండా అయిపులేకుండా పొయ్యాడు. ఆ పోయినపోవడం ఇవాళ యిట్లా తేలాడు.

మరి ఈ రాముడెక్కడ! ఖాకీనిక్కరు, మేజోళ్ళు, బూట్లు, పైగా పెద్ద లట్టూబట్టూ వేసుకొచ్చాడు. వాడు తెచ్చిన సామాను మోయడానికి కూలీ కావలసివొచ్చాడు. జేబులో పెన్ను, పెన్సిలు - మనిషే మారాడు చదువు నేర్చుకున్నాడు. సైన్యంలో ఎన్నో పనులు నేర్చుకున్నాడు. ఎన్నో సంగతులు తెలుసుకున్నాడు. చూపు మారింది. మాట్లాడే తీరు మారింది. వాడి తరహాయే కొత్తగా వుంది.

ఇలాంటి రాముణ్ణి చూడడానికి ఊరువూరంతా చాకలిగూడెం వైపు వచ్చింది. ఈ పల్లెల్లో ఇంతే. వూరు విడిచిపోయిన మనిషి మళ్ళీ వొచ్చాడంటే గూటికి చేరుకున్న పిట్ట అన్నట్టు, మందకు చేరుకున్న గొర్రెన్నట్టు విరగబడి చిత్రంగా చూస్తారు. పెద్దకాపు మల్లారెడ్డి వచ్చి "శబాష్ రాముడూ ఇప్పుడు నువ్వు వస్తాదువయ్యావురా'' అని మెచ్చుకున్నాడు. తెలగ రామన్న "ఎవడి అదృష్టం వాడిది' అని తత్వం పలికాడు. వడ్ల బ్రహ్మయ్య పక్కనేవున్న శేషగాల్లి చేచి "ఓరేయ్ మీరంతా వాడి ముందు బలాదూరురా'' ఎత్తిపొడిచాడు. ఇంకా కమ్మరి నరసయ్య, కుమ్మరి గోవిందు మాల పెరుమాళ్ళు, మాదిగెంకడు, ఎరికెల పేరిగాడు అంతా ఎవరికి తోచినట్టు వారు రాముణ్ణి పొగడుతూవుంటే వెనకాల నిల్చొనివున్న కోమటి వైకుంఠం పక్కనున్న పోలయ్యతో "మొత్తానికి వూరిపేరు నిలబెట్టాడు పో'' అన్నాడు.

**తెల్లవారేసరికి సిపాయి రాముడు పెళ్ళికొడకై సీతతో పెళ్ళిపీటలమీద కూర్చున్నాడు. ఊరూవాడా అంతా పెళ్ళి చూడడానికి వచ్చారు. రాముడు ఠీవిగా కూర్చున్నాడు. సీత తలవంచుకొని ముసిముసిగా నవ్వుతూంది. చూచిన పెద్దలంతా 'ఈడుజోడూ' అని ఏకగ్రీవంగా అన్నారు. వెంకామ సంతోషంతో కళ్ళనీళ్లు తుడుచుకుంటూ వుంది. మల్లి కూతురిని పట్టుకొని వెనక కూర్చొని వుంది. సన్నాయి, సాయబు మా రాముడు పెళ్ళికొడుకాయనే'' అని హుషారుగా సన్నాయి పాడుతూవుంటే వూరి పెద్దలు అక్షంతలు చల్లి వధూవరులను ఆశీర్వదించి వెళ్ళారు.**



వూళ్లో వుండగా రాముడి దినచర్య అంతా పకడ్బందీగా వుండేది. పొద్దున్నే లేచి వూర చెరువు దగరకెళ్ళి కవాతు చేసేవాడే, అక్కడే స్నానంచేసి ఇంటికొచ్చి ఇంత తిని కుటుంబం వాళ్ళతో కులాసా కబుర్లు చెప్పేవాడు. మధ్యాహ్నం దాటిన తరువాత తానే టీ కాచి అందరికీ యిచ్చేవాడు.

సాయంత్రం డ్రెస్సు వేసుకొని వూరిబైటికి షికారు కెళ్ళేవాడు. పొద్దుగూకి యింటికొచ్చి అందరితో పాటు ఇంత తిని నలుగురినీ ఇంటి ముందు చేర్చుకొని సైన్యం సంగతులు, తాను తిరిగినచోట్లు, కలిగిన అనుభవాలు అన్నీ చెబుతూవుంటే ఆ గూడెం వాళ్ళెగాక మెరక వీధివాళ్ళు కూడా చోద్యంగా వినేవాళ్ళు.

తన ఇంటికి ఇంత మంది వస్తున్నారు గాని మల్లి కూతురు సీత మాత్రం రావడం లేదు. వొచ్చిందగ్గర్నుంచీ వాళ్ళింటికెళ్ళి అదిప్పుడెట్లా ఉందో చూడాలనుకుంటాడు. కానీ, పడలేదు. అదే ఎదురు పడుతుందేమోనని చూచాడు. అది సామాన్యురాలా "తన దగ్గిరికె వొస్తాడు, ఎవరి కోసమొస్తాడు, నేను రాబట్టనా'' అనుకొని బిగదీసుకు కూర్చుంది.

సరే దీని అంతేదో కనుక్కుందామని రాముడు ఒక రోజు పొద్దుగూకేవేళ గూడెం వెలుపలవున్న వాళ్ల నిట్టాడి దగ్గరి కెళ్ళాడు. ఇంటి చుట్టూ కంచె, కంచెలోపల శుభ్రమైన నేల. అందులో కూరగాయల పాదులు పూలచెట్లు వున్నాయి. వాటిని

చూచి గుమ్మం తడికె దగ్గర క్షణం సేపాగి "సీత యిల్లంటే పర్ణశాలలా ఇట్టాగే వుండాలి" అనుకొని తల ఎగరేసి తడికెతీసి లోపలికెళ్ళి అత్తా అని పిలిచాడు.

మళ్లి బైటికొచ్చి "నువ్వా రాముడూ, రా కూర్చో" అంటూ మంచం వాల్చింది.

"వుండత్తా, రాణిగారిని చూడాలి" అంటూ నిట్టాడి లోపలికి దారితీశాడు.

"అదింకా నీకు గ్యాపకముందిరా" అంది రాముణ్ణి ఆశ్చర్యంగా చూస్తూ, "అది గాకపోతే నువ్వా గ్యాపకముండేది!"



"వెంకితనం ఇంకా పోలేదు" అని లోపల అనుకుంటు మళ్లి ముఖమంతా నవ్వుతో వీధి చివరలో వున్న తడికెల కాఫీ హోటలు కెళ్ళింది.

రాముడు తలుపనెట్టి లోపలికెళ్ళాడు. సీత పొయ్యి దగ్గర మంచం చాటున నిల్చొని సిగ్గుతో నేలకేసి చూస్తూ కాలి బొటన వేలితో నేలమీద రాస్తూ వుంది. రాముడు దానిని నఖశిఖ పర్యంతం చూచాడు. మనిషి గువ్వలా తేలింది. చన్నూ చంకా ఏర్పడ్డాయి. వయస్సొచ్చేసరికి వంకలన్నీ తీరతాయి. అన్నట్టు అది కట్టుకున్న బట్టలు కూడా అందంగా కనిపిస్తున్నాయి. చురుకైన చూపులు, వంపులు తిరిన బుజాలు గుండ్రంగా తేలిన మెడ, సోగకళ్ళు, సన్నటి ముక్కు, చిన్న పెదిమలు, చెక్కిళ్ళ మీద చెంపరాల వల పడుతున్న జుట్టు. అసలే అందమైన పిల్లేమో, వ్యక్తురాలై సిగొచ్చెసరికి మరీ ఆకర్షవంతంగా వుంది. ఈ పిల్ల తనకోసమే వ్యక్తురాలైందనుకున్నారు. రాముడు ఆ అందాన్ని అలాగే చూస్తూ "ఏం పిల్లా ఏమంటావ్" అన్నాడు.

సీత దూరంగా వెళ్ళి "ఫో! కొంటోడా" అంది. రైట్ పిల్లా, నువ్వింకా నాదానివే. బలే, బలేగా వున్నావులే. రెడీగా వుండు, ఇద్దరం జంటవుదాం" అన్నాడు.

మళ్లి ఒక చేతిలో పకోడీల పొట్లం, మరో చేతిలో టీగ్లాసు పట్టుకొని తడిక దగ్గరకొచ్చి "రాముడూ ఇవి తీసుకుందువు గాని రా" అంటూ ఆప్యాయంగా పిలిచింది.

రాముడు నిట్టాడిలోంచి బైటికొచ్చి మంచం మీద కూర్చున్నాడు. ఒక పకోడీ తీసుకొని మిగతావి మళ్లికిచ్చి "ఇవి సీతకివ్వత్తా-నాకు టీ చాలులే" అన్నాడు. మళ్లి అతనిలో కలిగిన మార్పును పరకాయించి చూస్తూ వుంది. రాముడా టీ గ్లాసు క్రింద పెడుతూ "అత్తా, మా సంగతేమంటావు" అని అడిగాడు. "మీ యిద్దరి ఇష్టమైతే నాదేముంది రాముడూ" అంది మళ్లి.

"చూడు వొచ్చేది ఆగస్టు పదిహేను. అది మన ఇండియా వాళ్ళకి గొప్పరోజు. ఆ రోజు ఉదయం మా లగ్గం ఖాయం. నేనన్ని ఏర్పాట్లు చేస్తా అత్తా" అని లేస్తూ సీత కన్పిస్తుందేమోనని తలుపుకేసి చూచాడు. మనిషి కన్పించలేదు గాని తలుపు మాత్రం కదిలింది.

"మరి నే వొస్తానత్తా" అని బైలుదేరాడు రాముడు. "సర్లే, మా అమ్మతో మాట్లాడుతాలే అంది" మళ్లి, రాముడు కంచె తడికదాక వొచ్చి వెనక్కి తిరిగి చూచాడు. పొరుగు నిట్టాడిలో నుంచి సీత చెల్లెళ్ళు గంతులేసుకుంటూ కంచెదాటి వచ్చి "గూట్లో రూపాయి, నీ మొగుడు సిపాయి" అని పాడుతూ పరుగుతీశారు.

భారతదేశీయులందరికీ స్వాతంత్ర్య దినమైన ఆగష్టు పదిహేను ఎప్పటిలాగే ఆ సంవత్సరం కూడా వచ్చింది. ఆ గ్రామస్తులు అంతకుముందు ఆ రోజు ప్రాముఖ్యాన్ని సరిగా ఎరుగరు. కాని ఈసంవత్సరం మాత్రం ఆగష్టు

**రాముణ్ణి చూడడానికి ఊరువూరంతా చాకలిగూడెంవైపు వచ్చింది. ఈ పల్లెల్లో ఇంతే. వూరు విడిచిపోయిన మనిషి మళ్ళీ వొచ్చాడంటే గూటికి చేరుకున్న పిట్ట అన్నట్టు, మందకు చేరుకున్న గొర్రెన్నట్టు విరగబడి చిత్రంగా చూస్తారు. పెద్దకాపు మల్లారెడ్డి వచ్చి "శబాష్ రాముడూ ఇప్పుడు నువ్వు వస్తాదువయ్యావురా" అని మెచ్చుకున్నాడు. తెలగ రామన్న "ఎవడి అదృష్టం వాడిది' అని తత్వం పలికాడు. వడ్ల బ్రహ్మయ్య పక్కనేవున్న శేషగాళ్లి చేచి "ఓరేయ్ మీరంతా వాడిముందు బలాదూరురా" ఎత్తిపొడిచాడు.**

పదిహేనంటే యేమిటో వాళ్ళకు బాగా తెలిసింది.

తెల్లవారేసరికి సిపాయి రాముడు పెళ్ళికొడకై సీతతో పెళ్ళిపీటల మీద కూర్చున్నాడు. ఊరూవాడా అంతా పెళ్ళి చూడడానికి వచ్చారు. రాముడు ఠీవిగా కూర్చున్నాడు. సీత తలవంచుకొని ముసిముసిగా నవ్వుతూంది. చూచిన పెద్దలంతా 'ఈడుజోడూ' అని ఏకగ్రీవంగా అన్నారు. వెంకామ సంతోషంతో కళ్ళనీళ్లు తుడుచుకుంటూ వుంది. మళ్లి కూతురిని పట్టుకొని వెనక కూర్చొని వుంది. సన్నాయి సాయబు మా రాముడు పెళ్ళికొడుకాయనే" అని హుషారుగా సన్నాయి పాడుతూ వుంటే వూరి పెద్దలు అక్షంతలు చల్లి వధూవరులను ఆశీర్వదించి వెళ్ళారు.

పెళ్ళితంతు ముగిసిన తరువాత ఎనిమిది గంటలకు వూళ్ళో రచ్చబండ దగ్గిర కట్టిన చావడి ముందు జెండా వందనం ఏర్పాటు చేశారు. బడిపిల్లలు కొత్త బట్టలు వేసుకొని బారుతీరి నిల్చొని వున్నారు.

గ్రామ పెద్ద యజ్ఞనారాయణ పంతులుగారు కరతాళ ధ్వనుల మధ్య హర్షధ్వానాలు చెలరేగుతూ వుండగా జెండా

ఎగురవేశారు. సిపాయి దుస్తులతో, పక్కన పెళ్ళికూతురు సీతతో నిటారుగా తలయెత్తుకొని నిల్చున్న రాముడు సైనిక వందనం పద్ధతిలో బూటు టకామనికొట్టి హుందాగా జెండాకు సెల్యూట్ చేశాడు. అంతకుముందే అలా చెయ్యమని చెప్పి వుంచాడో యేమో సీత కూడా చక్కగా నిలబడి తలపై కెత్తి జెండాను సెల్యూట్ చేసింది.



జెండా వందనమైన తరువాత వర్ల బ్రహ్మయ్య రాముడి దగ్గరిగా వొచ్చి "రాముడూ ఎందుకట్టా బూటు టకామని కొట్టి హుషారుగా విసురుగా సలాం చేశావు" అని అడిగాడు. సంగతేమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో

"ఇవాళ మన స్వాతంత్ర్య దినోత్సవం కదండీ. ఇది మన జాతీయ జెండా. ప్రాణమైనా వదులుకుంటాముగాని ఈ జెండాకు అగౌరవం జరగనివ్వం అందుకని ఇటాగే సెల్యూట్ చేసి దేశ సేవకు ప్రతిజ్ఞ చేస్తాం" అన్నాడు. ఆ సమాధానానికి బ్రహ్మయ్య దిగాలుపడి చూస్తూ వాడికంత వ్యక్తిత్వం వచ్చినందుకు లోలోపల వాణ్ణి మెచ్చుకున్నాడు. అంతా ఇళ్ళకెళ్ళు తున్నారు.

ఎల్లివచ్చి మల్లితో "ఒయబ్బో రాముడెంత పౌరుషం కలోడయ్యాడో చూశావే. ఎట్టా సలాంకొట్టాడు" అని బుగ్గనొక్కుకుంది. "పౌరుషం కలోడే కాదు పెయోజకమంతుడు కూడా అయ్యాడు" అంది మల్లి సగర్వంగా "మరి అందుకేగా కూతురునిచ్చి చేశావ్" అంది యెల్లి.

రాముడి పక్కనే వున్న సీతకు ఆ మాటలు వినిపించి ముసిముసిగా నవ్వుకుంటూ భర్త ననుసరించింది.

# నేనే...!

**కల్లెం నవీన్ రెడ్డి**



అలై పొంగుతావా......!
కలై కృంగుతావా......!!

కలమై గొంతెత్తి ప్రశ్నిస్తావా .....!
అంటోంది అంటోంది

నా కవితల మేలుకొలుపు....!!

ఎప్పుడు కనుమూయని కవినే నేను....!
అర్ధరాత్రైన వెలిగే రవినే నేను....!!

ఇతరులు చూడని కోణంలో
వెతలను చూస్తాను....!
విషయం ఏదైనా ఎదలకు
హత్తుకునేలా చేస్తాను....!!

పేదవాడి ముఖంలో చిరునవ్వును నేను....!
పేదవాడి ఆకలికి అన్నపు ముద్దను నేను....!!

కీచకులకు నా కలంతో కత్తినవుతాను.....!
సమాజపు అంధకారాన్ని పోగెట్టే చుట్టమవుతాను.....!!

నేనే భరత మాత బిడ్డను....!
భావితరాలకు ఆదర్శాన్ని....!!

వ్యాసం

# పిరదౌసి కావ్యానుశీలనం

చారిత్రక వస్తువుతో కూడిన కథాకావ్యం విశ్లేషణ...



ఏనుగు నరసింహారెడ్డి

ప్రాచీన తెలుగు సాహిత్యంలో మహాకవి పోతన్నతో పోల్చదగ్గ ఆధునిక కవి గుర్రం జాషువా. పోతన ఏ రాజకీయాల ప్రమేయం లేకుండా, మత ఉద్యమాల ప్రభావం లేకుండా స్వతహాగా శైవుడై వైష్ణవ గాథలు రాసాడు.

'చేతులారంగ శివుని పూజించడేని' అన్న సులభ సుందరమైన గీతమూ, 'ఓయమ్మ నీ కుమారుడు మా ఇండ్లను పాలు పెరుగు మననీ'డన్న అచ్చికమూ, 'క్షోణీతలమ్ము నన్నెదురుసోకగ మ్రొక్కి నుతింతు'నన్న సంస్కృత పదభూయిష్టమైన పద్యమూ అలవోకగా చెప్పి ప్రజల నాల్కల మీద చిరకాలం నిలిచిపోయాడు పోతన.




'వాని రెక్కల కష్టంబు లేని నాడు సస్యరమ పండి పులకింప సంశయించు' అన్న సులభ సుందరమైన గీతమూ, 'రాజు మరణించె నొక తార రాలి పోయె, కవియు మరణించె నొక తార గగనమెక్కె' అన్న సంస్కృతాంధ్రాల మేలి కలయిక, 'నా కవితా వధూటి వదనమ్ము నెగాదిగ జూచి' అన్న పద్య గాంభీర్యమూ చూపించి సామాన్యుల మనస్సులో నిలిచిపోయాడు జాషువా.

జాషువా కులం వల్లనో, వంశ ప్రతిష్ట వల్లనో కాక తన వాక్పటిమ వల్ల గుర్తించ బడ్డాడు. ఉద్యమాల వల్లనో, రాజకీయాల వల్లనో కాక కరుణ రస హృదయం వల్ల కవితాపతాక నెగురవేసాడు. 'నాల్గు పడగల హైందవ నాగరాజు' బుసల నడుమ స్వశక్తితో ఎదిగాడు. అయినా తనను చిన్న చూపు చూసిన అవ్యవస్థ పట్ల తాను ప్రేమ దృష్టినే ప్రదర్శించాడు. తనను అనేక ఇబ్బందులకు గురి చేసిన కన్న ఊరిని, 'నను మరచిన నిను మరువను, వినుకొండా నీకు నా పవిత్ర ప్రణతుల్ అని ప్రస్తుతించాడు.

జాషువా బహు గ్రంథకర్త. గబ్బిలము, ముంతాజమహలు, కాందిశీకుడు, స్వప్నకథ, నేతాజీ, నా కథ, కొత్తలోకం, ముసాఫర్లు, స్వయంవరం, బాపూజీ, నాగార్జునసాగర్, తదితర కృతులతో పాటు అనేక ఖండ కావ్యాలు రాసాడు. ఆయన పద్యం రసవద్ఘుళిక, కరుణామాలిక. ఆయన పద్యరసం పొంగులు వారిన గొప్ప కావ్యం పిరదౌసి.

దళితుడిగా, కవిగా జాషువాకు అనేక అవమానాలు, దెబ్బలు తగిలాయి. కవిని గొప్పవాడిగా, రాజును చరిత్రహీనుడిగా చూపించాలన్న బలమైన కాంక్ష ఆయన మదిలో ఉండి ఉంటుంది. అందువల్ల చరిత్రలో ఒక చిన్న కథను ఏరి ఆ కథ మిషతో తాను చెప్పదలచుకున్న భావాలన్నీ చెప్పాడు. కవి ఘనత, కవిత్వం ఘనత, కవి ఔదార్యం, రాజు కాఠిన్యం, అబద్ధాల కోరుతనం పిరదౌసి ద్వారా చెప్పాడు. వేగవంతమైన కథన శిల్పంలో దిట్ట అయిన జాషువా ఈ కావ్యంలో కరుణ ఒలికించగల సన్నివేశాలు అనేకం కల్పించుకున్నాడు.

చారిత్రక వస్తువుతో కూడిన కథాకావ్యం పిరదౌసి. గజనీ మహమ్మదు భారతదేశం మీదికి 18 సార్లు దండయాత్ర చేసి ధనరాశులను కొల్లగొట్టి జగజ్జేతగా స్వదేశం వెళ్ళిపోతాడు. తన జైత్రయాత్రకు స్థిరత్వం కల్పించాలంటే ఒక కావ్యం రాయించాలని సంకల్పించి మహాకవి పిరదౌసిపై ఆ కార్యభారం మోపుతాడు. పారశీకంలో ఉద్దండుడైన పిరదౌసి రాసే ప్రతి పద్యానికి ఒక బంగారు నాణెమిస్తానంటాడు. కావ్యం పూర్తయిన

పిదప మాటతప్పి వెండి నాణేలను బహూకరిస్తాడు గజనీ మహమ్మదు. కవి దాన్ని తిరస్కరిస్తాడు. రాజు దాన్ని అవమానంగా భావిస్తాడు. సభాసదులు ఆజ్యం పోయడంతో కవికి మరణ శిక్షను ప్రకటిస్తాడు రాజు. కవి తప్పించుకొని స్వస్థలానికి పారిపోతాడు. చివరికి తన తప్పు తెలుసుకున్న రాజు తిరిగి బంగారు నాణేలను పంపిస్తాడు. అప్పటికే కవి మరణిస్తాడు. కవి కూతురు బంగారు నాణేలను తిరస్కరిస్తుంది. రాజు ఆ ధనంతో తూసులో ఒక ముసాఫిర్ ఖానా కట్టిస్తాడు. ఇది కావ్య కథ. మూడు ఆశ్వాసాలతో నడిచిన ఈ కావ్య పద్యాలు కొన్ని భారతిలోను కొన్ని ఆంధ్రపత్రికలోను వచ్చాయి. ఆర్థికలేమి వల్ల 1932లో గాని ఇది పుస్తక రూపంలోకి రాలేదు.

ఈ కావ్యంలో ప్రధాన పాత్రలు రెండు పిరదౌసి, గజనీ మహమ్మదు. పిరదౌసి, గజనీ మహమ్మదులిద్దరూ చారిత్రక వ్యక్తులు. పర్షియాలో పేరెన్నికగన్న మహాకవి పిరదౌసి. ఈయన పూర్తిపేరు హాకీ అబుల్ కాసీం పిర్దౌసి తూసీ. క్రీ.శ. 940-1020 మధ్య జీవించాడు. ఈయనకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఈయన రాసిన ప్రసిద్ధ గ్రంథం 'షానామా'. ఇదికాక ఈయన ఇతర రచనలేవీ అందుబాటులో లేవు. 977 నుండి 1010 వరకు రాయబడ్డ షానామా ఇరాన్ మహేతిహాసం. 50 వేల డిస్టిచ్‌లు (ద్విపదల్లాంటివి) ఉన్న పర్షియా జాతి పురాణం. పిరదౌసీ కవి అంతిమ దినాలు ఎలా గడిచాయో చారిత్రక ఆధారాలు లేవు. ఇక షానామాకు ప్రేరకుడైన గజనీ మహమ్మదు జగజ్జేత. క్రీ.శ. 970-1030 మధ్య జీవించిన ఈయన 18 సార్లు భారత్ పై దండయాత్ర చేసాడు. చివరిసారి దండయాత్రలో సోమనాథ్ ఆలయాన్ని కొల్లగొట్టాడు.

చిన్న చరిత్ర శకలాన్ని తీసుకొని కావ్యం అల్లడంలో గుర్రం జాషువా తర్వాత కాలంలో వచ్చిన చాలా మంది కవులకు మార్గదర్శకుడయ్యాడు. పిరదౌసి చారిత్రిక కథకు తనదైన సున్నితమైన చేర్పులతో కరుణ రసం ఒలికించాడు. ఈ కథలో సత్యం పాక్షికంగానే ఉంటుందన్న సంగతి మనం మరవలేం. కవి అట్లా మలుచుకుంటాడు. పిరదౌసి ననుసరించి నార్ల చిరంజీవి భాగ్యనగరం నాటకం, కట్టమంచి రామలింగారెడ్డి ముసలమ్మ మరణం కావ్యం, విద్వాన్ విశ్వం పెన్నేటి పాట, డా. సినారె కర్పూర వసంత రాయలు రాయడం జాషువా విజయాన్ని సూచిస్తుంది.



కవులంతా అటు దేశభక్తి ఇటు ప్రణయాసక్తితో రాస్తున్న కాలంలో నిమ్నజాతి వస్తువును కవిత్వం చేయడం జాషువా చేసిన సాహసం. ఈ కావ్యరచన కూడా గౌరవ ప్రదమైన వస్తువు మీద రాసిందేం కాదు. ఎందుకంటే కథ విదేశీయం, పైగా తురక రాజు కథ, డబ్బుపై మోజుపడి భంగపడ్డ కవి. పారశీక వస్తువు. ఆ రకంగా జాషువాది అప్పటికి ఒక ప్రయోగమే. 'మాతృభూమిక మరవని విశ్వమానవ దృష్టి, సంప్రదాయ సంస్కారం వదలని ఆధునికత, అస్తిత్వాన్ని తిరస్కరించని హేతువాదం, ద్వేషపూరితం కాని ఆగ్రహ ప్రకటన, వెరసి జాషువా' అన్న పాపినేని శివశంకర్ అభిప్రాయం నూటికి నూరు పాళ్ళూ నిజం. రూపంలో ప్రాచీనత, వస్తువులో ఆధునికత, దృష్టిలో నవ్యత జాషువా తత్త్వం.

పద్యం సంప్రదాయమే కాని ఆధునికత జాషువా విశిష్టత అని మనం చెప్పుకున్నాం. దానికి అనేక ఉదాహరణలివ్వవచ్చు. కావ్యారంభంలో శ్రీకారం లేదు. దేవతార్చన లేదు. సుకవిస్తుతి, కుకవి నిందా లేదు. నేరుగా కథలోకి వెళ్ళి

'మును గజనీ మమూదు డభూత
పరాక్రమశాలి, వీరవా
హినుల బలంబుతో పదియునెన్మిది
మారులు కత్తిదూసి, చి
క్కని రుధిరంబులో భరత ఖండంబు
నార్ద్రమొనర్చి సోమనా
థుని బెకలించి, కైకొనియె తొమ్మిది
వన్నెల రత్నరాసులన్'

అంటాడు.

కథాగమన సూచన చేయడం మహాకవి లక్షణం. గజనీ మహమ్మదు పిరదౌసికి కావ్యరచనా బాధ్యత అప్పగించిన పిదప అతనికి ఒక కల పడుతుంది. ఆ కలలో పిరదౌసికి ఒక అందమైన పారశీక రాజవనిత ఎదురవుతుంది. అతనికి సహచరిని అవుతానంటుంది. అతను పులకరించి కౌగిలించుకోబోగానే ఎవరో కత్తితో పొడిచినట్లవుతుంది. కలచెదురుతుంది. ఇది పిరదౌసి కావ్యంలో కథాగమన సూచిక. విశ్వనాథ సత్యనారాయణ తెలుగు భారతారంభాన్ని సూచిస్తూ 'శ్రీవాణీ' శ్లోకం తర్వాత వచ్చే మొదటి తెలుగు మాట 'అని'ని ప్రస్తావిస్తూ దాన్ని కథా గమన సూచికగా చెప్పాడు. 'అని' అంటే వ్యాసుడు చెప్పిన దాన్ని చెప్పడం ఒక అర్థం పరంపరగా ప్రజలు ఒకరికొకరు చెప్పుకోవడం అని ఒక అర్థం యుద్ధం అని ఒక అర్థం అంటాడు విశ్వనాథ. కావ్యగమనంలో ద్వితీయాశ్వాసంలో ఒక సుందరి కలలో వచ్చి నన్ను అత్యున్నత పర్వతాగ్రము నుండి కూలదోసి పోయింది. దాని భావం నాకు ఇప్పుడు అర్థమవుతుంది అంటాడు పిరదౌసి.

కావ్య గమన క్రమంలో సార్వ జనీన, సార్వ కాలీనమైన నీతి వాక్యాలను ఒదిగించడం గొప్ప కావ్యకళ. ఇందులో గజనీ మహమ్మదు వెంట ధనం తరలి

పోయిందని చెబుతూ, బలం వెంట వెళ్ళే తుంటరిది ధనం అని అతికినట్లు చెబుతాడు జాషువా.

'హిందువుల దోర్బలము నాశ్రయించి బ్రదుకు
ద్రవ్య సంపద, తురక భూధవుని జేరి
కాపురంబుండె నతని ఖడ్గమును వలచి
సిరి నిజంబుగ వట్టి టక్కరిది సుమ్మ'

ప్రకృతి చర్యలకు మానవ లక్షణారోపణ చేయడం కవి ప్రతిభ. కవి పిరదౌసి స్వస్థల యాత్రను వర్ణిస్తూ

"జలదంబుల్నలు పెక్కి యాకసమునన్ సంచారముంజేసె, భూ
లలనారత్నము స్నానమాడునని వేళా ఘంటికల్ మ్రోసె గ్రొం
జలి గాడ్పుల్ చెలరేగి దేహముల నంటన్, గూండ్లలో బండి కూ
నలపై రెక్కలుగప్పి కన్ను మలిపెన్, నానా శాకుంతచ్ఛటల్'

అంటాడు జాషువా. మబ్బులు నల్లనై ఆకాశంలో తిరిగాయట, భూదేవి స్నానమాడుతుందని వీచే గాలి ప్రకటించిందట. పక్షులు పిల్లలపై రెక్కలు గప్పి పడుకున్నాయట. అలారం అనే ఆంగ్ల పదానికి "వేళా ఘంటికల్" అని ఒక చక్కటి మాట ఉందని జాషువా కంటే ముందెవ్వరూ చెప్పలేదు. ఇంకో పద్యంలో వాన, కవిని కాపాడే ఉద్దేశ్యంతో మెల్లగా కురిసిందంటాడు.

రాజు మోసానికి కారణం తన పాపమేనంటాడు కవి ఒకచోట. ఇతరుల శరీరాలను ఆహారంగా స్వీకరించే కత్తిని ఆయుధంగా ధరించిన రాజులను తన పద్యంతో పొగిడిన పాపం ఊరికే పోలేదనడం గొప్ప వ్యాజస్తుతి.

'పూనికరాసికిన్ మనుజభుక్తి నొసంగెడు రాతిగుండె సుల్తానుల
కస్మదీయ కవితాసుధ జిందిన పాతకంబు నాపై నటనంబొనర్చినది'

అంటాడు.

కావ్య నిర్మాణంలో జాషువా ఒడుపు కూడా పేర్కొనదగింది. పిరదౌసీ మసీదు మీద రాసిన పద్యాలను కావ్యంలో రెండుసార్లు చెప్పాడు జాషువా. కవి గజనీ నుండి పారిపోతూ రాసినప్పుడు రాజు మజీదు గోడపై చదివినప్పుడు. ఇంకో విశేషం 'కృతికర్తగా' కవిత కింద పిరదౌసి అని రాయడం. దైవాన్ని ప్రకృతిలోని చర్యలలో భాగంగా చిత్రించిన 'విత్తనంబున మహా వృక్షంబు నిమిడించి' పద్యం తర్వాత కాలంలో ఎన్నో సినిమా పాటలకు బీజ భూతంగా మారింది. 'కవిని గన్నతల్లి గర్భంబు ధన్యంబు' అన్న పద్యం, 'క్షణము గడిచిన దాని వెన్కకు మరల్ప' అన్న పద్యం 'వసుధ శాసింప గల సార్వభౌముడగును' అన్న పద్యం జాషువా 'షానామా' ఘనతను ఉద్దీపించే ఉద్దేశ్యంతో అత్యంత శ్రద్ధగా రాసినవి. 'షానామా ఎంత లోతుగా రాసి ఉంటాడో చెప్పడానికి 'పారశీక గ్రంథ భండారమునెల్ల', 'వాని డెందంబు సోకిపోవని తలపులు', 'శాసనములన్ని పరికించి' పద్యాలు అల్లాడు. షానామా నిజంగా అంతటి నిసర్గ, విస్తార, చారిత్రాత్మక, కవితాత్మక మహా పురాణం అని జాషువా ఉద్దేశ్యం. అందుకే అంతటి లోతైన పద్యంతో దాన్ని ధ్వనింపజేశాడు.

అన్యదేశ్యాలను తెలుగులో కలపడంలో జాషువా తర్వాతే ఎవరైనా.

తొలి పద్యంలో

'మును గజనీ మహమ్మదు డభూత పరాక్రమశాలి'

అని మరోచోట

'క్రమమొప్పన్ సులతాను మేడల నగారా మ్రోగె'

అని ఇంకోచోట

'నా హెూట నాదముల నిండే మజీదు, లాష్టనుల స్కంధావార మందాట గుర్రము'

అని ఇంకో పద్యంలో

'పాదుషా తోడ నతని దర్బారుసీమ'

అని ఉర్దూ, ఫార్సీ పదాలను అలవోకగా తెలుగు మాటను చేసి వేసాడు జాషువా. తయారు, హుక్కా, కూనీ, సబక్తజీను లాంటి పదాలు డజన్ల కొద్దీ ఇందులో ఇముడ్చాడు.

లోకోక్తులు, నుడికారాలు, తెలుగు

**జాషువా కులం వల్లనో, వంశ ప్రతిష్ట వల్లనో కాక తన వాక్పటిమ వల్ల గుర్తించ బడ్డాడు. ఉద్యమాల వల్లనో, రాజకీయాల వల్లనో కాక కరుణ రస హృదయం వల్ల కవితాపతాక నెగురవేసాడు. 'నాల్గు పడగల హైందవ నాగరాజు' బుసల నడుమ స్వశక్తితో ఎదిగాడు. అయినా తనను చిన్న చూపు చూసిన అవ్యవస్థ పట్ల తాను ప్రేమ దృష్టినే ప్రదర్శించాడు. తనను అనేక ఇబ్బందులకు గురి చేసిన కన్న ఊరిని, 'నను మరచిన నిను మరువను, వినుకొండా నీకు నా పవిత్ర ప్రణతుల్ అని ప్రస్తుతించాడు.**

దనం ఉట్టిపడే పదరాసి జాషువాకు వెన్నతోనే వచ్చింది. 'సిరి నిజంబుగ వట్టి టక్కరిది సుమ్మ' అంటాడొక చోట, 'నరుని సుఖ దుఃఖములందు నడిచి వచ్చు నీడలే స్వప్నములు అని ఒక చోట గంభీరమైన అర్థంలో ప్రయోగించాడు. తెలుగు పద బంధాలు చాలా విన సొంపైనవి చాలా ఉన్నాయి పిరదౌసిలో. "తొమ్మిది వన్నెల రాత్నరాసులన్", "లొట్ట పిట్టల మిద దిట్ట పరచి', 'తోసుకొనివచ్చు తలపు గుంపులు' లాంటి అపురూపమైన పద ప్రయోగాలు పిరదౌసిలో చాలా ఉన్నాయి. పద్య నిర్మాణ సొబగులో జాషువాది తనదైన విలక్షణ వైఖరి. అయన ధారలో చాలా సహజసిద్ధంగా యతి, ప్రాసయతి అలవోకగా పడిపోతుంటాయి. ఈ సొగసు పిరదౌసిలో ఏ పద్యంలోనైనా కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో వచన కవిత్వం ఆరంభమయ్యాక వచ్చిన పద్య కావ్యాలలో పిరదౌసి శ్రేష్ట కావ్యం. వచన కవిత్వం పట్ల గౌరవం లేని జాషువా పద్యంలో ఎలా ఎలా ఆట లాడవచ్చో, కథాకావ్యానికి అదెంతగా ఒదుగుతుందో పిరదౌసిలో ఆచారణాత్మకంగా నిరూపించాడు. పిరదౌసి ఒక కరుణ రస ప్రవాహం.

కవిత

# అమ్మ యాది

ఎగిలివారంగ కోడి కూత అమ్మకు "అజాఁ"
సెంట్రల్ జైలు లాంటి ఇంటికి పెద్దర్వాజ... చైనా గోడలా...
తెరిసేప్పుడు... నాకు నోరుందని
కర్రుమని ధిక్కార స్వరం...

మసక చీకట్లో... నిద్రలో నడిచినట్టుగా
బావి దగ్గరకు అమ్మ...
కాబూలీ వాలా లాగా
బొక్కెనతో అప్పు రాబట్టుకోవడం...

బాధా సర్వద్రష్ట బావి...
నీటి చెల్లింపులతో ఏళ్లకేళ్లు...
నిత్య నైవేద్యం చేసినా...
పిసరంతైనా తరగని బావి అప్పు...

కిర్రుమంటున్న బావి గిరక సాచ్చిగా (సాక్షి)
తోడి.. తోడి... అమ్మ... రెక్కలు
"ఫ్రీవీలు" పోయిన సైకిలు పెడల్ లా....

బావి ఎప్పట్లాగే...
తీరని అప్పుతో నిండు చూలాలుగా...
పురిటినొప్పులతో...

పసులు పొలంబాట పట్టకముందే...
అరెకరం వాకిలికి అలుకు అలంకారం...
ఎర్రమన్ను పూసుడుతో...
కడుపుల పేగులు నోట్లోకి...

కట్టెల పొయ్యితో కుస్తి నిత్య కృత్యంకాగా..
పొగ వాసనతో మమేకమైన ఛా ఏ ఛాయ...
మా కడుపుల్లోకి సెలైన్ ఎక్కించినట్లు...
చెమట నీళ్లతో పాటు... తనకూ గిన్నె
కడిగిన నీళ్ల లాంటి రంగునీళ్లు .. మహా భాగ్యంగా..

పొద్దటికి... పగటికని జాయింటుగా...
వండిన అడ్డెడు బువ్వ...
తలా ఇంత పంచంగ...
మిగిలిన శేషం.... మాడు చెక్కలు...
నీళ్లల్ల ముంచుక తిననిక...

మాపటిజాము... పీకల దాకా తాగి...
అయినదానికీ కానిదానికీ శివతాండవం చేసే...
"బాపు"కు మౌన ప్రేక్షకురాలు
ఏడవడానికి సొతంత్రంలేని అస్వతంత్ర ప్రాణి

పవళింపు సేవ అయ్యేసరికి...
తాను బద్దలయ్యే అగ్నిపర్వతమైనా...
మంచు పర్వతమంత చల్లగా...

పెద్ద దర్వాజా బందు అయినాక...
ఆకాశాన్నంటే బాపు గుర్రులో...
అమ్మ కన్నీళ్లు... వెక్కిళ్ల.. కాక్ టైల్
అర్ధరాత్రి ఆజాద్ వచ్చినట్టు...
తుఫానులో పిచ్చుక స్వరంలా...

అమ్మ ....
జీతం బత్తెంలేని... కట్టు బానిస...
ఆకలి... రుచి తెలియని మానవ యంత్రం...
ప్రేమకు...
ఆనందానికి...
సంతోషానికి...
నోచుకోని అనాథ...

సంసార
సుడిగుండంలో...
చిక్కుకున్న ఒంటరి పడవ...

అన్నీ ఉండి...
అందరూ ఉండి...
ఏమీ లేని అనాథ...
అమ్మ... అందరికొరకైనా...
అందరం... ఎవరికివారే యమునా తీరే...





దేవరాజు విష్ణువర్ధన్ రాజు

వ్యాసం

# నేను అంతర్ బహిర్జగత్తుల వసంతం

**భావ భౌతిక వాదాలు ఏకముఖంగా చూపెడుతూ....**



సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి

ఆత్మవత్ సర్వభూతాని భగవంతుని వాక్యం. తన వలనే తన చుట్టూ ఉన్న ప్రాణి సమూహం ఉన్నది అని దీని అర్థం. భగవంతుడు తన వలెనే మిగిలిన ప్రాణులు అనడంలో నేను అన్ని ప్రాణులలో ఉన్నానని అని చెప్పడం అక్కడి ఉద్దేశం. మరి మానవులు నేను అన్న మాటను తమ వైఖరిని చెప్పే ఉద్దేశంతో వాడుతారు. నేను ఈ మాట అన్నాను, నేను ముందే చెప్పాను, నేను అనుకున్నది ఇదే. నేనే ఈ మొత్తం వ్యవహారాన్ని చక్కబెట్టాను అన్న ఈ మాటల సందర్భంలోని నేను లక్ష్యం వేరు అని తెలుస్తూనే ఉంది. నేను శ్రీశ్రీ సామూహిక చైతన్యం అన్న అర్థంలో ఉపయోగించే వారని విమర్శకులు అంటారు. కాల్పనిక అభ్యుదయ విప్లవ యుగాలలోని నేను ఇచ్చిన అర్థం సమాజం సమూహాలను కేంద్రంగా చేసుకున్నట్లయితే వాసిలి వసంతకుమార్ నేను అన్న యౌగిక కావ్యం అంతర్ బహిర్జగత్తుల సంవాదం. అయితే ఇది ఆత్మవిశ్వాస మాధ్యమంగా ఎలా వ్యక్తం అవుతుంది అని పరిశీలించడం ఈ చిరు వ్యాసం లక్ష్యం.

ఆత్మవిశ్వాసము అన్నది భౌతిక స్థైర్యం ద్వారా వచ్చే స్వభావమా? అంతశ్చైతన్యం ద్వారా వ్యక్తమయ్యే స్వరూపమా? అని ముందు ప్రశ్నించుకోవాలి. అతడిలో ఆత్మవిశ్వాసం ఉంది అని మనం గుర్తించేది అతడి భౌతిక స్వరూపం వల్లనే. భౌతిక స్వరూపం అలా ఉండడానికి కారణం మానసిక సంతులన. మనసు ప్రభావం శరీరం మీద ఉంటుంది. శరీరం మనసు స్థితిని వ్యక్తం చేస్తుంది. కాబట్టి ఆత్మవిశ్వాస మాధ్యమం నేను అంతర్బహిర్జగత్తుల సమన్వయం అని ముందుగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఇంతకీ తాత్పర్యం ఏమిటి అంటే మనసు స్థితిని శరీరం వ్యక్తం చేస్తుంది. అది ఇతరులకు ఆత్మ విశ్వాసంగా శరీరం ద్వారా మాత్రమే తెలుస్తుంది. కాబట్టి ఆత్మ విశ్వాసం తనకు (నేను) అంతస్సు నుంచి బాహ్యానికి ప్రయాణించేది కాగా ఇతరుల చూపుకు బాహిర, స్థితినుంచి అంతస్సుకు ప్రయాణించేది. ఇది ఎటునుంచి ఎటు ప్రయాణించినా దాని స్వభావం మాత్రం అంత శ్చేతనకు సంబంధించినదే.

**నేను అన్న దానిని కొందరు అహంగా చూస్తారు. అహం అన్నది "నేనే" అవుతుంది కానీ నేను కాదు. కాలేదు. నేను ఆత్మవిశ్వాస చిహ్నం మాత్రమే. ఈ యౌగిక కావ్యంలో భౌతికంగా వైజ్ఞానికంగా సాంఘికంగా ఆర్థికంగా ఎదిగిన నేను అహంతో ఎదిగిన రీతికి గుర్తు. భౌతిక స్థితి దీనికి పునాది.**

అనుభావ కావ్యం తాత్విక కావ్యం యౌగిక కావ్యం అన్న మాటలు పరి భాషలుగా కొంత స్థిరపడటానికి జరుగుతున్న ప్రయత్నం ఇటీవల కనిపిస్తుంది. అనుభావ కావ్యం మార్మిక కవిత తోడిదైతే, తాత్విక కావ్యంలో జీవిత పరమార్థ బోధన, ఉనికి పట్ల అవగాహన సత్య అన్వేషణ అన్నవి ఉంటాయి. మరి యౌగిక కావ్యంలో ఏముంటుంది. కేవలం బాహ్య జగత్తో అంతర్ జగత్తో ఉండదు. యోగ శారీకరంగా చేసే ఒక సాధన దాని పరమార్థం మానసిక సంతులన. స్థిత ప్రజ్ఞత. ఇది దైవికం అని యోగ శాస్త్రం చెప్పదు. ఇది అభ్యాసం వలన సాధ్యం మాత్రమే. అభ్యాసం శారీరక మానసిక అంశాల సమ్మేళనా రూప ప్రక్రియ. ఇది ప్రయత్న సాధ్యమూ, సాధనే తప్ప తాంత్రిక విద్య కాదు. ఈ విషయాన్ని నేను అన్న యౌగిక కావ్యం బోధిస్తుంది. అది యౌగిక కావ్యం అన్న సాహిత్య ప్రక్రియకున్న స్వభావం. కావ్య స్వభావమే ఆత్మవిశ్వాస మాధ్యమం అని తెలుస్తుంది. ఈ ఆత్మ విశ్వాసాన్ని మనలో మనం పరీక్షించుకోవాలంటే దానికి అభ్యాసం కావాలి. సాధన కావాలి. దీని వలన జ్ఞాన కర్మేంద్రియాలపై నిగ్రహం, స్వీయ నియంత్రణ అన్నవి మనిషి పొందుతాడు. భోజరాజీయంలోని వశిష్ట అగస్త్య

సంవాదానికి సంబంధించిన కథ ఇటువంటి స్వీయ నియంత్రణని చెబుతుంది. దేని మీద విపరీతమైన యావలేని తనాన్ని చెబుతుంది. స్వీయ నియంత్రణ అభ్యాస సాధ్యమైనది అందుకు యోగ దారి చూపుతుంది. ఆ స్థిరమైన చిత్తం ప్రయత్న సాధ్యమే కానీ అయత్న సిద్ధి కాదు. ఆ సత్యాన్ని బోధించడానికి ఆధునిక చేతనతో వాసిలి వసంతకుమార్ నేను అన్న యౌగిక కావ్యం రచించారు.

నేను కావ్యంలో 7 పథాలున్నాయి. పథం అంటే దారి. దారిని నడక ద్వారానే, ప్రయాణం ద్వారా మాత్రమే కొలవవచ్చు, తెలుసుకోవచ్చు. ఇవి పరిణామ, ప్రమోద, ప్రమాణ, ప్రస్థాన, ప్రయోగ, ప్రవిమల, పరమ పథాలు. ఇవి భౌతిక స్థితి నుంచి ఆత్మిక స్థితికి ప్రయాణించిన యోగి మార్గానికి చిహ్నాలు. పరిణామంలో మనిషి పెరగడం, ప్రమోదంలో చింతనలో ఎదగడం, ప్రమాణంలో సాంస్కృతికంగా వైజ్ఞానికంగా జీవన ప్రమాణాలను ఉన్నతీకరించుకోవడం, ప్రస్థానం ప్రయోగం ప్రవిమలం పరమ పథకాలలో భౌతికం మొదలు ఆత్మిక ఆధ్యాత్మికత తత్వాల దాకా ఎదిగిన, ప్రయాణించిన మానవుడు కనిపిస్తాడు. భౌతికం పరిణామంలో, ప్రకృతిలో ప్రమోదం శాస్త్రంగా ప్రమాణం, ప్రమాణం ద్వారా ప్రస్థానం మొదలై ప్రయోగానికి దారితీసింది. అందులోని ప్రవిమలత్వం మనిషిని పరమ పథానికి చేర్చింది. మనిషి

**ఆత్మవిశ్వాసము అన్నది భౌతిక స్థైర్యం ద్వారా వచ్చే స్వభావమా? అంతశ్చైతన్యం ద్వారా వ్యక్తమయ్యేస్వరూపమా? అని ముందు ప్రశ్నించుకోవాలి. అతడిలో ఆత్మవిశ్వాసం ఉంది అని మనం గుర్తించేది అతడి భౌతిక స్వరూపం వల్లనే. భౌతిక స్వరూపం అలా ఉండడానికి కారణం మానసిక సంతులన. మనసు ప్రభావం శరీరం మీద ఉంటుంది.**

పుట్టి పరిణామంలో ప్రకృతితో మమేకమై తన జీవితానికి ఒక ప్రామాణికతను తెచ్చుకుని తన ప్రస్థానం మొదలుపెట్టి ఈ జీవన ప్రయాణంలో జీవిక కోసం ఎన్నో ప్రయోగాలు చేస్తాడు. ప్రయోగాల నుంచి విమలత్వాన్ని పొంది జీవనంలో ఉత్కృష్ట స్థితిని చేరుకుంటాడు. ఇది భౌతికంగా కనిపిస్తున్న పరిణామం కాగా ఆత్మికంగానూ ఇదే రీతిలో తనను తాను మలచుకుంటాడని నేను ద్వారా ఆత్మవిశ్వాస బోధన చేస్తున్నారు వాసిలి వసంతకుమార్.

నేను అన్న దానిని కొందరు అహంగా చూస్తారు. అహం అన్నది "నేనే" అవుతుంది కానీ నేను కాదు. కాలేదు. నేను ఆత్మవిశ్వాస చిహ్నం మాత్రమే. ఈ యౌగిక కావ్యంలో భౌతికంగా వైజ్ఞానికంగా సాంఘికంగా ఆర్థికంగా ఎదిగిన నేను అహంతో ఎదిగిన రీతికి గుర్తు. భౌతిక స్థితి దీనికి పునాది. దీన్ని జయించాలంటే యోగమార్గం అనుసరించాలి. అది చిత్త వృత్తి నిరోధం, కర్మ కౌశలంతో కూడింది. నైతికంగా, జ్ఞానంగా, సాంస్కృతికంగా, నిస్వార్థంగా ఎదిగిన నేను ఆత్మవిశ్వాస చిహ్నం. ఈ రెండిటికీ ఇదే స్పష్టమైన వ్యత్యాసం. ఈ కావ్యమంతా ఇదే అంశం నేనుగా పరచుకుని ఉంది. అందుకు ఈ కింది కవితా పంక్తులు ఉదాహరణగా నిలుస్తాయి.

కవి చెప్పుకున్నట్లు ఇది మనసు కథనం. - ఇది మనుగడ కథనం ఇది.

మనిషి మనుగడ కోసం చేసే ఒక పోరాటం వలన ఆత్మవిశ్వాసం పొందు తాడు ప్రకృతి రూపం, ప్రకృతిలో తన రూపం రెండు భౌతికమే కానీ ఆ రూపం వెనక ఉన్న చేతనం ఆత్మవిశ్వాసాన్ని బోధిస్తుంది.

నాభి నుండి నాడీమండలం వరకు రూపా విష్కరణ

మత్స్యం నుండి మనువు వరకూ ఇహ ఆవిష్కరణ

నేను జీవితపు దారుల్లో బాల్యాన్ని
సంయమనంలో వార్ధక్యాన్ని
యోగికంగా కౌమారాన్ని అని

అనడంలో భౌతిక మానసిక స్థితుల సమతౌల్యతను కవి భావిస్తున్నారు.

పరిణామానికి
తొలి బీజంగా నేను
తొలి ఇజంగా నేను
తొలి నిజంగా నేను అని అనడంలో బీజం పునాది అయితే ఇజం ఆలోచన నిజం ఆత్మవిశ్వాసానికి సంకేతాలు. ఇది బోధించడానికి ఆ మార్గంలోకి ఆహ్వానిస్తున్నది ఈ యోగిక కావ్యం. నేనులో ఈ ఆత్మవిశ్వాసం ఎన్ని రీతులుగా వ్యాపించి ఉందో ఇందులోని 7 పథాలు తెలియజేస్తాయి. ఈ ఏడు పథాలు షట్చక్రాన్ని ఊర్ధ్వలోక సప్తకాన్ని సూచిస్తున్నాయి.

ఆధారం - భూలోకం - పృథ్వి భూత స్థానం

స్వాధిష్ఠానం - భువర్లోకం - జలభూతం స్థానం

మణిపూరకం - సువ ర్లోకం - అగ్ని భూత స్థానం

అనాహతం - మహ ర్లోకం - వాయు భూత స్థానం

విశుద్ధ చక్రం - జన లోకం - ఆకాశభూత స్థానం

ఆజ్ఞా చక్రం - తపో లోకం - జీవాత్మ స్థానం

సహస్రారం - సత్యలోకం - ప్రమాత స్థానం పంచ భూతాలు, జీవేశ్వరుల నాభి నుండి బ్రహ్మ కపాలం వరకు వ్యాపించి ఉండడాన్ని యోగ మార్గం చెబుతుంది. ప్రకృతి అసమత్వం మన ఆత్మవిశ్వాసాన్ని తగ్గించడం ప్రస్తుత కరోనా పరిస్థితులలో చూస్తున్నాం. దానికి విరుగుడు యోగ అని ఒక అభిప్రాయం వినిపిస్తున్నది. శారీరక స్వస్థత మానసిక ధైర్యానికి కారణం అవుతుంది. అది బాహిర ప్రకృతి నుండి అంతర ప్రకృతి లోకి తెచ్చుకునే మార్గాన్ని యోగ బోధిస్తుంది. అది అంతర్బహి ర్జగత్తులోని వసంతంగా మన ముందు నిలపడం కోసం ఋషులు ప్రయత్నం చేసారు. దానికి తన లోపలి విశ్వాన్ని బయటి విశ్వాన్ని భూమికగా చేసుకున్న విశ్వర్షి అందించిన ఒక యౌగిక కావ్యం నేను.

# 'నిజం', 'అలల'లో ఉప్పొంగిన వాన!

(సి. రామమూర్తి మనం పత్రిక ఎడిటర్)

నిజం (శ్రీరామ్‌మూర్తి) కవిత్వమై
కురిసిన వాన చప్పుడు వినిపించిన శ్రీలక్ష్మి



అయినంపూడి శ్రీలక్ష్మి

"Poetry is the epitome of Literature"

సాహిత్యంలో ఎన్నెన్నో ప్రక్రియలు. మరెన్నో శిల్పాలు, ఇంకెన్నో సంప్రదాయాలు, ధోరణులు, రీతులు! కానీ వాటన్నిటిలోనూ తనదైన ప్రత్యేకతను సాధించిన ప్రక్రియ మాత్రం కవిత్వమే! అందుకే సాహితీవ్యాసంగాలన్నిటిలోనూ కవిత్వానికి అగ్రస్థానం ఉంది. Brevity, Symbolism, philosophy, generalisation, metaphorical expression వంటి అంశాలు ప్రధాన లక్షణాలుగా గల కవిత్వం, మేధోజీవులకు 'ఆలోచనామృతం'గా పరిణమించింది. అల్ప పదాలలో అనల్పార్థాన్ని, మనకు తెలిసిన భాష, పదాల నుంచే మనకు తెలీని కొత్త జీవన సత్యాన్ని ఆవిష్కరిస్తూ పాఠకులను సంభ్రమాశ్చర్యాలకు లోను చేసే శక్తి కవిత్వానికి ఉంది. అందుకే కవిత్వం - అణువంత అక్షరంలో విశ్వమంత విశాలత్వాన్ని నిబిడీకృతం చేసుకున్న మహిమాన్విత సృజన!

కవిత్వానికి సంబంధించి ఈ మాటలన్నిటికీ అచ్చమైన ఉదాహరణగా నిలుస్తున్న కవితాసంకలనం - "అలలు".! "నిజం" అనే కలం పేరుతో గత కొన్ని దశాబ్దాలకాలం నుంచి పేరెన్నికగన్న కవిత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన శ్రీరామమూర్తి గారు తాజాగా



**కేవలం ఆగ్రహం, ఆవేదన, ఆక్రోశం మాత్రమే కాకుండా హైదరాబాద్‌లో 100 సంవత్సరాల తర్వాత కురుస్తున్న వానని రసాత్మకంగా, సౌందర్యాత్మకంగా, కవితాత్మకంగా నిజంగారు చూడగలిగారు. అంత చక్కగాను అక్షరబద్ధం చేయగలిగారు.**

వెలువరించిన సంక్షిప్త కవితల సంకలనమే - అలలు!

తెలుగు కవితాప్రస్థానంలో సంక్షిప్త కవితలది ప్రత్యేక స్థానం! మినీకవితలుగా, హైకూలుగా, సినెర్యాలుగా, నానీలుగా ఇతర ప్రక్రియలుగా సంక్షిప్త కవితలు తెలుగు కవితాప్రపంచాన్ని సుసంపన్నం చేసాయి. అయితే ఈ సంక్షిప్త కవితాప్రస్థానంలో సరికొత్త చేర్పుగా వచ్చిన ఈ 'అలలు', పేరుకు తగ్గట్టే జీవన సాగరంలో ఎడతెరపి లేకుండా వచ్చే 'అనుభవాల అలలు'గా మనకు కనిపిస్తాయి. ఈ కవితలలో సంక్షిప్తత ఎంత సహజంగా ఒనగూడిందో, సార్వజనీనత, తాత్వికత అంతే స్వభావసిద్ధంగా అంతర్భావాలుగా ఇందులో ఒదిగిపోవడం విశేషం!

చాన్నాళ్ళ క్రితం కుందుర్తిగారి 'నగరంలో వాన' కవితల సంపుటి చదివాను. "నగరం గడగడ వణికిపోతుంది. నడి సముద్రంలో తేలాడుతున్న ద్వీపంలా వుంది. విను వీధి నుండి జారిన మంచుకొండ పగిలి శతకోటి శకలాలు జలబిందువులుగా మారి ముసురు ముంచేస్తుంటే గూట్లోకి చేరిన గువ్వలా నగరం నక్కి కూర్చుంది. కదుల్తున్నాయి కార్లు బాలవీరులు విసిరిన కత్తి పడవల్లా ఆకాశరాజు చేసిన దాడికి నగరం నలిగిపోయింది. చీటికి మాటికి కోర్టుకెక్కటం చీదరెత్తింది. కాబోలు హైకోర్ట్ భవనం మీద చింతతో చిందిన చినుకు పక్కనే వున్న మూసీ నదిలో పడి ముక్కు మూసుకుంది. శాసనసభా శిఖరం మీద చల్లగా జారిన బిందువు ఆకసం వంక తలెత్తి చూసి చాలిక వర్షమని

శాసించింది. అంతటితో వాన వెలిసింది'' అంటూ వాన సౌందర్యాన్ని అద్భుతంగా వర్ణించాడు. 1967లో తొలి ముద్రణకు నోచుకున్న ఈ పుస్తకం ఎందరి హృదయాలనో కొల్లగొట్టింది.

ఆ తర్వాత ఎంతోమంది వర్షం మీద రాశారు. కొన్ని నేను చూసి వుండక పోవచ్చు కూడా. కుందుర్తిలా నా మనసులో నాటుకున్న కవితా పంక్తులు మామిడి హరికృష్ణ గారివి. "ఓ నా ప్రియమైన భాష్యకారుడా! / అనాహూత తుఫాను గుండె వేదనల్లోంచి / హఠాత్తుగా పెల్లుబికిన చినుకు నేమనాలి? / ఒక అనామకలోకంలోని / ఒకానొక తిరస్కృత ప్రేమికుడి / కన్నీటి పాట అందామా'' అంటూ రాశారు.

అలా 'నిజం' రాసిన 'అలలు' సంకలనంలోని కవితలలో వాన మీద రాసిన కవితలు నేను పైన చెప్పిన కవితలను గుర్తు చేసుకునేలా చేసాయి.

అయితే తెలుగునుడుల ప్రాణ రహస్యాన్ని ఔపోసన పట్టిన కవి 'నిజం' 'వాన' మీద రాసిన కవితలు మరింత నవ్యంగా కనిపిస్తాయి. ఆయన కలం నుండి జారిన కవనధారలు సరికొత్తగా కన్పిస్తాయి ఈ 'అలలు' సంపుటిలో.

మొదటి పుస్తకం 'నిజం' గీతాలైతే, రెండో పుస్తకం 'ఎర్ర మందారాలు' తర్వాత 40 ఏళ్ళకి తీసుకొచ్చారు.

**"మేఘ బాహువులు సారించి అదేపనిగా కురుస్తున్న నింగికి అలసట రాదా. ఓర్పరి భూమికి మొకరిల్లదా?" అంటూ అలసిపోకుండా ఏరోజు వాన తగ్గుతుందా, పేద ప్రజల బాధలు తీరుతాయా అని ఎదురుచూసీ చూసీ ఆశావహంగా ఉండే తన ఆలోచనలకు అక్షరమంత భరోసా ఇచ్చారన్పించింది. అవును. ఓర్పరితనం ముందు అంతా మొకరిల్లాల్సిందే. అది నింగైనా... వానైనా..!**

2018లో నివురు, 2019 డిసెంబర్‌లో 'నాలుగోపాదం'. ఇక 2020లో విడుదలైన 'అలలు'! ఇలా మూడు సంవత్సరాలకు 3 పుస్తకాలు తీసుకొచ్చారు. అంటే మనం చెప్పుకుంటున్న ఈ 'అలలు' 5వ పుస్తకం అన్నమాట. ఈ 5వ పుస్తకంలో విశ్వరూపమెత్తిన 'వాన'ను ఇప్పుడు పరిశీలిద్దాం.!

కేవలం ఆగ్రహం, ఆవేదన, ఆక్రోశం మాత్రమే కాకుండా హైదరాబాద్‌లో 100 సంవత్సరాల తర్వాత కురుస్తున్న వానని రసాత్మకంగా, సౌందర్యాత్మకంగా, కవితాత్మకంగా నిజంగారు చూడగలిగారు. అంత చక్కగాను అక్షరబద్ధం చేయగలిగారు.

"ఒక్క వాన చుక్క చాలు ఎండిన నేల గుండెను తడపటానికి

ఒక్క చక్కని కవిత చాలు మనిషి గుండెను అనుభవాల తడితో నింపటానికి"

అలాంటి చిత్తడి అనుభూతిని పంచిన నగరంలో వర్షం మీద కవితా వర్షాన్ని కురిపించిన 'నిజం' గారి పోతపోసిన అక్షరాలోచనలే 'అలలు' కవి తలపోతల పుస్తకంలోని సగంభాగం కవితలు.

ఇవి ఏకాంశాలు కాదు. చిరు కవితలుగా, ముక్తకాలుగా వెలిసిన ఆలోచనాత్మక పదచిత్రాలు. వస్తువు నగరంలో వర్షమైతే కవితాశిల్పం చిన్నకవితలు. 'అలలు' పుస్తకంలో ఎన్నో కవితాంశాలున్నా ఈ కవితలు చదువుతున్నంత సేపు 'వర్షం' మీద ఎక్కువగా కవితలుండటం వల్లనుకుంటాను. అదే మనసుకు నాటుకుపోయింది. ఒక దీర్ఘకవిత చదివిన అనుభూతిని కల్గించింది. అప్పుడప్పుడు వచ్చిపోయే మబ్బులుగా రైతులు, మహిళలు, ప్రకృతి, పడతి కవితాంశాలు పలకరిస్తూ పోతుంటే ఒక మోడ్రన్ పెయింటింగ్‌లా అర్థమయ్యి కానట్టు అస్పష్ట కవితలా ఊరిస్తున్నట్టుగా నగరంలో 100 ఏళ్ళ తర్వాత, కురిసిన అతి భారీ వర్షం మీద కవితలన్నీ 'నిజం' గారి తలలో మొలిచిన కవితాక్షతలుగా మనసులో సజీవంగా నిలిచిపోతాయి.

నిజానికి 'నిజం' గారి కవితల్ని చూస్తుంటే ఎక్కువగా సమాజంలోని పలు అంశాలపట్ల తనదైన కోణంలో విశ్లేషించిన స్పందనలుగా అన్పిస్తాయి. కుప్పల కొద్దీ అద్భుత పదబంధాలతో మళ్ళీ మళ్ళీ వెనక్కు తిరిగి చూసి చదువుకునే అక్షర విన్యాసాలతో, అలంకారాలతో అద్భుతమనిపించే భావనా చమక్కులతో, తాత్విక ఆలోచనా స్రవంతులతో, భావోద్వేగ స్ఫూర్తితో, వ్యవస్థ పట్ల ఎనలేని ఆవేదనతో ఆలోచింపచేసేలా వుంటాయి. చదివే వారి దృష్టి కోణాన్ని పట్టి ఆ కవితలు కన్పిస్తుండటం విశేషం. సాధారణ పఠితలకి, అబ్బా ఏం రాశార్రా అన్పిస్తే కవులకి మళ్ళీ మళ్ళీ చదువుకునే, రాసుకుని దాచుకునే సంపదల నందిస్తాయి. వ్యాఖ్యాతలకి చప్పట్ల దండల్ని వేయిస్తాయి. అందుకే 'నిజం' ఓ పట్టాన ఓ ఫ్రేమ్‌లో ఒదగరు.

ప్రజాకవిగా, నిజాల కవిగా, నిష్ఠుర కవిగా, జాగృత కవిగా, జన చైతన్య కవిగా కన్పిస్తారు. 'నిజం' ఎప్పటికైనా 'నిజమే' అన్నట్టు 'నిజం' కవితలన్నీ సమాజంలో 'నిజాల' ఇజాల్ని మాత్రమే చూపిస్తాయి. చెళ్ళున చెంప మీద చరుస్తాయి. వ్యంగ్య బాణాలు విసురుతాయి. ఆలోచనల్లో పడేస్తాయి. కన్నీళ్ళు పెట్టిస్తాయి. కార్యోన్ముఖుల్ని చేస్తాయి. ప్రణయ విహారాలు చేయిస్తాయి. ప్రళయాగ్నుల్ని కురిపిస్తాయి.

కేవలం 'వాన' అంశంగా వున్న ఈ కవితలన్నీ చదివాక, వీటిలో ఎన్నెన్నో కవితా ధోరణులు అలవోకగా ఒదిగినట్టు అనిపిస్తుంది. సాధారణంగా ఏ కవిత్వమైనా 1. అభ్యుదయ ధోరణి, 2. సౌందర్యాత్మక ధోరణి, 3. మానవీయ ధోరణి, 4. విప్లవ ధోరణి, 5. అస్తిత్వ వాద (స్త్రీవాద, మైనారిటీవాద, దళితవాద, ప్రాంతీయ వాదం వంటివి) ధోరణులతో ఉండటం లేదా వీటిలోని ఏదో ఒక ధోరణిలో ఒదగడం చూస్తాం.

కానీ ఈ 'అలల'లోని కవితలు ధోరణుల కన్నా అనుభవాలను,

పుస్తక పరిచయం

అనుభూతులను, స్పందనలను, సంవేదనలను మనముందు పరిచినట్లుగా అనిపిస్తాయి.

వస్తువు ఏకమే. కానీ చూస్తున్న దృష్టిని బట్టి అర్థం చేసుకున్న సృష్టిని బట్టి ఆయన కలం విభిన్న పోకడలు పోయింది. 360 డిగ్రీలలో దృష్టి నిల్పిన ఈ కవి 'వదిలిన' అంశమంటూ లేదు. ఇక ముందు ఏ కవి




వర్షం మీద కవిత రాసినా అది ఈ కవితలతో సరిపోల్చటం తప్పనిసరిగా జరిగి తీరుతుందన్నంత విస్తృతంగా వర్షం గురించి రాశారీ కవితల్ని అన్విస్తుంది.

"మేఘాలు గర్జిస్తే ఉరుములు మెరుపులు / వర్షిస్తే మొలకలు, బతుకులు" అంటూ జీవన చిత్రాన్ని చెపుతూనే- 'వానాకాలంలో గొడుగుల పందిరయ్యే నగరం ఈసారెందుకో నెత్తిన చేతులు పెట్టుకుని పరుగులు తీసింది. మన చేతకాని తనమే వానని పగవానిని చేస్తుంది. గొంతులు పైరులెండే వేళ వరుణ పూజలు చేస్తుంది' అంటూ ద్వంద్వ ప్రమాణాలతో బ్రతికే మనిషి నైజాన్ని ఎండగట్టారు. 'గొడుగుల పందిరయ్యే నగరం' అంటూ కొత్త కోణాన్ని ఆవిష్కరించారు.

"మేఘ బాహువులు సారించి అదేపనిగా కురుస్తున్న నింగికి అలసట రాదా. ఓర్వరి భూమికి మొకరిల్లదా?" అంటూ అలసిపోకుండా ఏరోజు వాన తగ్గుతుందా, పేద ప్రజల బాధలు తీరుతాయా అని ఎదురుచూసీ చూసీ ఆశావహంగా ఉండే తన ఆలోచనలకు అక్షరమంత భరోసా ఇచ్చారన్పించింది. అవును. ఓర్వరితనం ముందు అంతా మోకరిల్లాల్సిందే. అది నింగైనా... వానైనా..!

జర్పైలం కాస్తా జలపైలమయ్యింది అంటూ "కష్టపడి కూడబెట్టిన నీటి సంపదను సిటీ చెరువు బ్యాంకుల్లో దాచుకోవాలని పోటీపడ్డాయి మేఘాలు. అవి ముందే లూటీ అయి మూతపడ్డాయని తెలీక మోసపోయాయి." ఎంత వాస్తవిక కోణమో కదా! భావుకత భలే చిత్రంగా అల్లారు. ముందే లూటీ అయిపోయాయి సిటీ చెరువులు అంటూ కబ్జాలకు గురైపోయిన వైనాన్ని వ్యంగ్యంగా, చక్కగా చెప్పారు.

"వానొస్తుందని తెలిసి చెట్టు చెట్టునూ గొడుగులు చేసి పెడుతుంది భూమి. బతుకు బాటల నుంచి తలదాచుకోను వస్తారని" అంటారు. నిజం కదా! భూతల్లికి తన బిడ్డలంటే ఎంత ప్రేమనో. బ్రతుకు బాటల నుంచి పరుగెత్తుకుంటూ తడిచి చెట్ల క్రిందకి చేరే జనాల కోసం "చెట్టు చెట్టును గొడుగులు చేసి పెడుతుందని" చెప్పడం ఎంతో భావనాత్మకంగా వుంది.

"బస్తీలకు వరద సుస్తీ. పుర శరీరం నిండా డ్రైనేజీ పుండ్లు." నిండి పొర్లుతున్న డ్రైనేజీలను చూస్తే రసి కారుతున్న పుండ్లే గుర్తొస్తాయి ఎవరికైనా 'నిజం' చెప్పిన ఈ నిజం బస్తీలకు చేసిన వరద సుస్తీని మరో మారు గుర్తుచేసింది.

'వెండి మేఘాలుండే చోటనే కరిమబ్బులూ అవి ఆకాశ కిరీటాలు, ఇవి ప్రాణధారలు. కొందరు అనాయాస ఏలికలు. శ్రమించి చరిత్రకెక్కని పీలికలు ఎందరో' అంటూ నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అన్న శ్రీశ్రీని గుర్తుచేస్తారు. వీరందరిది కష్టం, మరికొందరిది కరెన్సీల చుట్టరికం. వారిది శ్రమ. వీరిది శ్రమదోపిడి తత్వం.

కొండ మీద ఇల్లు కట్టుకున్న మేఘం బండ మీటర్‌తో నేల దాహాన్ని కొలుస్తుంది. అవసరం లేకపోయినా కురుస్తుందని వేదన చెందే ఈ కవి మరో


"మేఘాలు ఘర్జిస్తే ఉరుములు మెరుపులు / వర్షిస్తే మొలకలు, బతుకులు" అంటూ జీవన చిత్రాన్ని చెపుతూనే- 'వానాకాలంలో గొడుగుల పందిరయ్యే నగరం ఈసారెందుకో నెత్తిన చేతులు పెట్టుకుని పరుగులు తీసింది. మన చేతకాని తనమే వానని పగవానిని చేస్తుంది. గొంతులు పైరులెండే వేళ వరుణ పూజలు చేస్తుంది' అంటూ ద్వంద్వ ప్రమాణాలతో బ్రతికే మనిషి నైజాన్ని ఎండగట్టారు. 'గొడుగుల పందిరయ్యే నగరం' అంటూ కొత్త కోణాన్ని ఆవిష్కరించారు.


**'ఇది వాన చేస్తున్న భూహక్కు పోరాటం / కబ్జాదార్ల దుర్మార్గానికి అమాయకుల బలిపీఠం నగరం' అంటూ రాసి నిజమే కదా. ఇది భూహక్కు పోరాటమే అని మనతోనే అన్పిస్తారు. అదే 'నిజం' గారి ఇజం. ఆయన ఏది రాసినా 'కన్విన్సింగ్'గా చెప్తారు. మనం ఎంత కాదని చెప్పాలనుకున్నా గొంతు పెగలదు. ఎందుకంటే అవన్నీ నిజాలు. రాసింది పైగా నిజం గారే కాబట్టి.**

కోణంలో ప్రేమైక మూర్తిగా మారారు.

'చినుకు వంతెన మీద చిరుపాదాలతో వస్తుంది వాన' అంటూ కుచ్చిళ్ళు ఎత్తిపట్టుకుని జాగ్రత్తగా మువ్వల పాదాలతో వస్తున్న లేజవ్వనిగా వానని అభివర్ణించారు!

'తల్లిపాలు కడుపునిండా తాగిన బిడ్డలా / వానాకాలపు నేల ఆకుపచ్చగా కేరింతలు కొడ్తుంది' అంటూ ఒక ఆరోగ్యకరమైన చిన్నారి బిడ్డ కడుపునిండిన సంబురంతో చేసే కేరింతలాటను 'వాన'కు ఆపాదించారు.

'వర్షాకాలమంతా ఆకాశం నల్లమేఘాలు కుట్టిన పైట కప్పుకుంటుంది / వాన పాలుబ్బిన వక్ష స్థలం దాచుకోవటానికి" అంటారు. ఎంత చక్కని పరిశీలన. ఎంత సౌందర్యాత్మక పోలిక!

"రాత్రి కురిసిన మేఘాలను ఆరేసుకుంది ఆకాశం, తెల్లచీరలు పరిచిన నీలినింగి." అవును నీలినింగి కాస్తా తెల్లటి మేఘాలు పర్చుకోవడటం వల్ల తెల్లచీరలు పర్చినట్టు కన్పిస్తుందంటూ హృద్యంగా కవితాత్మను చెప్పారు.

'పనీపాటా లేనట్టు మేఘాలకిదేం పని / మితిమీరి తాగిన సాగరాన్ని అదే పనిగా జనమ్మీద వాంతి చేసుకుంటున్నాయి" అంటూ చమత్కరిస్తున్నాడు ఈ కవి. కవి కలం కన్ను బలం ఎంతగా వుందో మీకీ కవిత చూస్తే అర్థం అవుతుంది. మితిమీరి తాగటం వల్ల వాంతులు అవుతున్నాయట మేఘాలకి.

"ఆకాశానికి ఈత నేర్పుతోంది నేల" ఎంత హృద్యమైన భావన! ఎక్కడి ఆకాశం. ఎక్కడి నేల. వరద ముప్పిరికొనటంతో ఆకాశం నింగి కలిసిపోవటం వల్ల ఆకాశం ఈత నేర్చుకోగల్గుతుందని చెప్పటంలో గొప్ప కవితాత్మ దాగి వుంది.

'భూమినీ ఆకాశాన్ని కలిపి కుడుతోంది వాన దర్జీ / నడుమనున్న బడుగు జనానికి నీటి బెజ్జాలు' "రాత్రంతా కుండపోత. ఎక్కడ నిద్రపోవాలో తెలీక భూమి నీటిదుప్పటిలో దాక్కుంది." ఇది ఎంతో హైట్స్‌తో కూడిన భావన. 'నీటి దుప్పటి'లో దూరిందట భూమి ఎక్కడ నిద్రపోవాలో తెలియక. పాపం పేదవాడు నీడ కోల్పోయి - నిద్ర కోల్పోయి - బట్టలు తడిసిపోయి నిస్త్రాణంతో అదే నీళ్ళలో కూలబడి సోలిపోయి నిద్రోయాడేమో అన్పిస్తది.

"నగరం తలవంచుకుని నడుస్తుంది. రోడ్డెక్కిన మురుగు కాలువలు, చెరువులను దాటుకుంటూ" అంటూ దీనావస్థను ఎండగట్టారు.

"మెట్రో విహారానికి వచ్చిన నీలి మేఘాలకు తిరిగి వెళ్ళబుద్ధి కావటం లేదు. పురవీధుల్లో జలకాలు, బడుగుజనం కొంపముంపులు." పల్లెటూరి నుండి నగరం చూడటానికి వచ్చిన స్కూలు పిల్లలు ఇంతింత కళ్ళు వేసుకుని లైట్లతో సింగారించుకున్న నగరాన్ని చూస్తూ ఇంటికి వెళ్ళటానికి నిరాకరిస్తారు. మారాం చేస్తుంటారు. అదే గుర్తుకు తెచ్చారు.

రెచ్చిపోయిన వానబిందువుల్ని చూసి కార్చిన కన్నీళ్ళెన్నో / కన్నీటి బిందువొకటి ఎన్ని వేదనల నిఘంటువో / హృదయం లేని చోట రాలనంటుంది ససేమిరా... అనటంలో గొప్ప మానవీయ భావన దాగుంది.

**నిజానికి 'నిజం' గారి కవితల్ని చూస్తుంటే ఎక్కువగా సమాజంలోని పలు అంశాలపట్ల తనదైన కోణంలో విశ్లేషించిన స్పందనలుగా అన్పిస్తాయి. కుప్పల కొద్దీ అద్భుత పదబంధాలతో మళ్ళీ మళ్ళీ వెనక్కు తిరిగి చూసి చదువుకునే అక్షర విన్యాసాలతో, అలంకారాలతో అద్భుతమనిపించే భావనా చమక్కులతో, తాత్విక ఆలోచనా స్రవంతులతో, భావోద్వేగ స్ఫూర్తితో, వ్యవస్థ పట్ల ఎనలేని ఆవేదనతో ఆలోచింపచేసేలా వుంటాయి. చదివే వారి దృష్టి కోణాన్ని పట్టి ఆ కవితలు కన్పిస్తుండటం విశేషం.**

వానైనా... కన్నీరైనా నీరే కదా/ బిందువులు, బిందెలు తెలుసు కానీ వీధులు సింధువులవడం ఇప్పుడే చూస్తున్నాం. నీటిదారిని ఇకనైనా విడిచిపెడదాం...- అంటూ గడ్డం పట్టుకొని హితవు చెప్తారు.

వానకెంత పురప్రేమో చేతులపై ఎత్తుకుని ముద్దాడుతుంది / 'నగరం' పై ప్రాణాలు పైనే పోతున్నాయ్.. / చిన్నపిల్లాడిని తండ్రులు పైకి ఎగరేసి ముద్దాడటం చూస్తూ వుంటాం కదా.. అలానే 'పురం' కూడా అన్పిస్తాడు.

నీలాకాశం మేఘాల బండరాళ్ళను దొర్లిస్తోంటే భూమి భరిస్తోంది / బిడ్డలను బలిస్తోంది గంగావతారమెత్తి అంటూ పౌరాణిక కథనాన్ని గుర్తుచేస్తాడు.

ఏ బస్తీకి వెళ్ళాలో తెలియకుండా ఓ టికెట్ తీసుకుని సిటీ బస్సెక్కితే అన్ని కాలనీలు ఒకేలా ఉన్నాయి మున్నీటి తపస్సులో - 'మున్నీటి' తపస్సులో జపం చేస్తున్నట్టున్న భక్తుల భాగోతాలను ఎండగట్టారు.

"చెట్లెప్పుడూ ఇంతలా కంట తడి పెట్టలేదు, నగరం సాగరమైందని ఏడుస్తున్నాయి" అంటూ సాగర సదృశ్యమైన నగరాన్ని తల్చుకుని చెట్లు ఏడుస్తున్నాయని సరికొత్తగా ఆవిష్కరించారు.

'నీటిపాములు ముట్టడిస్తుంటే పుడమి మూర్ఛపోయింది. నీళ్ళు చల్లండి' అంటూ భావనాపటిమను చాటాయి.

'వానదెబ్బలకు కాళ్ళు విరిగి, కళ్ళు, పళ్ళూడిపోయిన రోడ్లు, భవనాలకు ఆసుపత్రులు చాలక కరోనా రోగులను ఖాళీ చేయిస్తున్నారు' అన్న ఈ చిన్న కవిత అణుబాంబు కన్నా గొప్పగా పేలుతుంది జనాల మెదళ్ళలో.

"ఎక్కడ ఏ గుడిసె మాడి మసైపోయిందో, ఏ పచ్చని పండ్ల చూలాలు బూడిదై పోయిందో. మేఘార్భాటానికి ఎదురేది- పిడుగు నుండి కాపాడే గొడుగేది" అని రాయటంతో వారి అక్షర విన్యాసాల అందం మరో మారు ద్యోతకమయింది.

"ఆచితూచి అడుగేయండి. ఏది రోడ్డో ఏది మురుగో, మడుగో తెలిసి సాగండి / ఇది అభివృద్ధి మయసభ..." అంటూ ఆనాటి మయసభ మాదిరిగా సత్యం ఏదో భ్రమ ఏదో తెల్సి సాగాల్సిన వైనాన్ని గుర్తుచేశాడు.

"వాన భీముడు చెట్లను పెకిలించి గదలు చేసుకుంటున్నాడు.

దీన బతుకులైన ప్రజలు దిక్కులు వెతుక్కుంటున్నారని చెప్తూ తాను 'ప్రజాకవి'నని, ప్రజల పక్షపాతినని మరో మారు అందంగా అక్షరాలా చాటుకున్నారు.

'మేఘం మేనులో మెరుపు ఖడ్గం / చీకటి కడుపులో కాంతి కరవాలం / అణచివేత క్షేత్రంలో తిరుగుబాటు అంకురం' అంటూ తిరగబడాలన్న ఆలోచనకి అంకురం పడితే చాలు వానచుక్క కూడా కరవాలంగా మారిన వైనాన్ని కవితలో దర్శింపచేశారు.

"సముద్రానికి మరో సముద్రాన్ని కనిస్తున్నాయి భూమ్యాకాశాలు" అంటూ ప్రేమైక భావంగా పైకి కన్పించే "ప్రకృతి పైరులే ఆదిమవేల్పులు విగ్రహారాధనతోనే జన సంస్కృతిపై కాల్పులు" అంటూ తిరోగమనంలో సాగుతున్న మానవ జీవన గమనాన్ని గుర్తుచేశారు.

'ఇది వాన చేస్తున్న భూహక్కు పోరాటం / కబ్జాదార్ల దుర్మార్గానికి అమాయకుల బలిపీఠం నగరం' అంటూ రాసి నిజమే కదా. ఇది భూహక్కు పోరాటమే అని మనతోనే అన్పిస్తారు. అదే 'నిజం' గారి ఇజం. ఆయన ఏది రాసినా 'కన్విన్సింగ్'గా చెప్తారు. మనం ఎంత కాదని చెప్పాలనుకున్నా గొంతు పెగలదు. ఎందుకంటే అవన్నీ నిజాలు. రాసింది పైగా నిజం గారే కాబట్టి.

"ఆకాశాన్ని ఎవరు ఈడ్చితన్నారో ఆ కసినంతా భూమ్మీద కుమ్మరిస్తోంది / పై మెట్టుకి కిందిది లోకువే కదా" అని జనాంతికమైన ఆధిపత్య భావజాలాన్ని కవిత్వంలో నింపి గమ్మత్తుగా 'ఔరా' అన్పిస్తారు.

"గాల్లో వానల ఉరితాళ్ళు పేనుతున్న

**'భూమినీ ఆకాశాన్ని కలిపి కుడుతోంది వాన దర్జీ / నడుమనున్న బడుగు జనానికి నీటి బెజ్జాలు' "రాత్రంతా కుండపోత. ఎక్కడ నిద్రపోవాలో తెలీక భూమి నీటిదుప్పటిలో దాక్కుంది." ఇది ఎంతో హైట్స్‌తో కూడిన భావన. 'నీటి దుప్పటి'లో దూరిందట భూమి ఎక్కడ నిద్రపోవాలో తెలియక. పాపం పేదవాడు నీడ కోల్పోయి - నిద్ర కోల్పోయి - బట్టలు తడిసిపోయి నిస్త్రాణంతో అదే నీళ్ళలో కూలబడి సోలిపోయి నిద్రోయాడేమో అన్పిస్తది.**

రాత్రి, ధాత్రి పుటల నిండా దుర్భర జీవనగాధలు రాస్తోంది" అంటూనే

"మాసికల రోడ్లను వొళ్లనంది వాన, నరికి ముక్కలు చేసింది, ఇళ్ళను గుల్ల చేసింది. నగర సుందరి మేకప్ చెరిపేసింది" అంటూ సౌందర్యాత్మక 'మేకప్' వేసుకున్న నగరం పాపం వర్షానికి చెరిగిపోయి 'రంగులు వెలసిన' ఇళ్ళు వెలవెలపోతున్న విధానాన్ని చూపించారు.

"నగరం ఆరేసుకున్న చీరతో కరెంట్ తీగల గుండె ఝుల్లు / విద్యుత్ షాక్‌కి బదులు వేడికన్నీళ్ళు"

'కురిసి కుమ్మినప్పుడల్లా పునరావాసాలే / ఆవాసాలెప్పుడూ ఎండమావులే' అంటూ ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలప్పుడు మాత్రమే పరుగులు పెట్టే విధానాన్ని నిరసించాడు.

'ఏరెత్తుకెళ్ళిన చూపు ఏ తీరం చేరుతుందో / ఎక్కడ మునిగి ఇంకెక్కడ తేలుతుందో' అంటూ దృష్టికి అందకుండా వెళ్ళిపోయిన ఆత్మీయుల చూపుల మీద ఆవేదనను ఒంపారు.

'నది వరదలో ఈదుతోంది. బాహువులు చాచి పంటలను, ఇళ్ళను నిమురుతోంది. ఉప్పొంగిన ప్రేమకు ఊపిరులు ఉల్లిపొరలవుతున్నాయి' అంటూ పొసెసివ్ ప్రేమతో అల్లల్లాడుతున్న నగరం దుస్థితిని వివరించారు.

'ఎడతెరపి లేని వర్షం, అలిగిముసుగేసుకున్న పుడమి మూతిముడుపులు, భూమ్యాకాశాల ప్రణయకలహాలు' అంటూ అమర ప్రేమికులైన భూమి ఆకాశాల ముచ్చట్లను అక్షరబద్ధం చేశారు.

ఎప్పటి నుండో నిజం - తాత్విక కవి - తాజాకవి- నేటికవి - మేటికవి. ఇప్పుడు 'వర్షం' కవి కూడా. సీరియస్‌గా కవిత్వాన్ని ప్రేమించే ప్రతీకవి 'వర్షం' మీద కవిత రాయాలన్పిస్తే వీరి పంక్తులు గుర్తుకురాక మానవు. అభివ్యక్తి ఏదైనా అనురక్తి ఎంతైనా 'వర్షం' మీద ఇంత ఉన్నతంగా ఇన్ని కోణాల్లో ఎవరూ రాయలేదనిపించింది.

తాను రాసుకున్నట్టుగానే ఆకలితో అల్లాడిపోయే అక్షరాలకు భావాల పాలు తాగించి గంతులేయించటమే కవిత్వం అన్నట్టుగా వారి ఈ చిరుకవితలన్నీ చినుకుల్లా కొత్త పదబంధాలతో, కొత్త పదాలతో అలంకరించుకుని మురిసిపోయాయి.

కల్లూరి భాస్కరంగారు ముందు మాటలో రాసినట్టు శబ్దార్థాల సమప్రాధాన్యత ముచ్చటగొల్పుతుంది. ప్రకాశ్ గారన్నట్టు ఇది జనవద్గీతే.

ఇలా ఈ 'అలలు'లోని కవితలు - రూపంలో హ్రస్వంగా వున్నా, భావంలో విశ్వంగా కన్పిస్తాయి! ఈ సంక్షిప్త కవితల సంకలనం ఇటీవలి కాలంలో ఆలోచింపచేసిన కవిత్వంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అందుకే "A True Poem is one, which provokes a thought, triggers an idea and inspires the Life!" అన్న మాటలకు నిలువెత్తు సాక్ష్యంగా ఆవిష్కృతమయింది. అధ్యయనం, అనుభవం, పరిశీలన, భాష, పదసంపద, జీవితం, తాత్వికత అనే ఆరు అంశాలను తన జ్ఞానం అనే సముద్రంలో ప్రతిష్టించి, ఆ మధనంలోంచి వెల్లువెత్తిన 'అలల'ను కవితలుగా మనకు అందించిన 'నిజం' నిజంగానే అభినందనీయుడు!



## జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

# ఒ.ఎన్.వి.కురుప్

ప్రముఖ కేరళ రచయిత ఒట్టాప్లక్కల్ నంబియదిక్కల్ వేలు కురుప్(ఒ.ఎన్.వి.కురుప్) 2007 లో జ్ఞాన్ పీఠ్ అవార్డును పొందారు. ఒ.ఎన్.వి.కురుప్, రచయితగానే గాక, మళయాళీ సినీ పరిశ్రమలో సైతం పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. సాహిత్య, సినీ రంగాల్లో అనేక అవార్డులు గెలుచుకున్నారు. వామపక్ష అనుకూలవాదిగా పేరున్న ఒ.ఎన్.వి.కురుప్, రాజకీయాల్లోకి సైతం ప్రవేశించారు. దినంతం, పురథన కిన్నరం, మృగయ, అగ్ని సాలభంగల్ ఒ.ఎన్.వి.కురుప్ ప్రముఖ రచనలు.

## నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత

# హెర్టా ముల్లర్



రుమేనియా దేశ నవలా రచయిత్రి హెర్టా ముల్లర్ 2009లో నోబెల్ సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. జర్మనీలో స్థిరపడ్డ హెర్టా ముల్లర్, రుమేనియాలో కమ్యూనిస్టు నియంతృత్వ పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలకు అక్షరూపం ఇచ్చారు. Nadirs హెర్టా ముల్లర్ తొలి రచన. హెర్టా ముల్లర్ రచనలపై అక్కడి ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించింది. దాదాపు ఇరవై భాషలలో హెర్టా ముల్లర్ రచనలు అనువదించబడ్డాయి.

కథ

# ప్రభాతభేరి

మధురమైన బాల్య జ్ఞాపకం....



వేముగంటి మురళి

అమ్మ! నన్నుగుడా బాపుతోని మబ్బులనే లేపే, రేపు పంద్రాగస్ట్ పొద్దున్నే ప్రభాతభేరికి పోవాలె" అన్న అమ్మతోని...

"నేను నాల్గుటికి లెవ్వంగనే నిన్నే మొదలులేపుత, ఇప్పుడైతే జల్దివండుకో" అని నవారు మంచం మీద చద్దరు పర్చి నన్ను పండుకోవెట్టింది అమ్మ.

తెల్లారి ఐదుగొట్టింది. గచ్చుల మంచుకురుస్తున్నది. అమ్మ లాసిగ పిలిచిలేపింది. లెపంగనే లేసి, మొహం కడుక్కోకుంటనే చాకలి రామలక్ష్మి ఇంటికిపొయ్యి కడక్ ఇస్త్రీ చేసిన ఖద్దరు లాగు, తెల్లంగి తెచ్చుకొని దిగూట్ల వెట్టుకున్న.

ఐదున్నర వరకు రాజ్మహ్మద్ చిన్నకొడుకు లియాఖత్, వడ్ల రవి, నేను కలిసి కమాన్ దగ్గరుండే మా బడికి పోయినం. అప్పటికి సూర్యుడు పుట్టలే. చీకటి చీకటిగనే ఉన్నది. ఒగలమొగాలు ఒగలకు సరింగ కనవడుతలెవ్వు గొంతులనువట్టుకొని గుర్తుపట్టుడే.

కొద్దిసేపటికి పీటీ శేఖర్ సర్ బడిదగ్గరకొచ్చిండు. విజిల్ తీసుకొని క్లాస్ తీరుగ వరుసగ నిలవెట్టిండు. ప్రతి వరుసకు క్లాస్ పెబ్బ మొదలు నిలవడ్డడు. ముంగట బ్యాండ్ కొట్టే రమేశ్, దోర్నోల్ల మనోహర్ యన్.సీ.సీ. డ్రెస్సు వేసుకొని నడుస్తున్నరు.

మెల్లగ ప్రభాతభేరి మెయిన్ రోడ్డు మించి, బస్టాండ్ దగ్గరికి చేరుకునే సరికి సూర్యుడు అప్పుడే పుట్టిన చిన్నపిల్లగాడు కండ్లు తెరిచినట్టు, భూమిమీద చూపు ప్రసరించిండు. మేమంతా భారత్ మాతాకీ జై, జై జవాన్, జై కిసాన్, బోలో స్వాతంత్ర్య భారత్‌కి జై అని నినాదాలు చేసుకుంట పోతున్నం. విక్టరీ టాకీస్ చౌరస్తాల మా బడి ప్రభాతభేరికి ఎదురుంగ కాంచీట్ చౌరస్తాల ఉన్న ఇంకో బడి పిల్లలు ఎదురైన్రు. వాళ్ళు మమ్మల్ని చూసి లాషిగ నినాదాలు ఇస్తే, అంతకంటెక్కువ మేము నినాదాలు ఇస్తున్నం. అట్ల మా బడి ప్రభాతభేరి గాంధి బొమ్మ నించి మళ్ళా బడికి ఏడింటికి చేరింది.

మళ్ళా శేఖర్ సర్ అందరిని లైన్ల నిలవెట్టి,

"మీరు జల్దిన ఇంటికివొయ్యి, స్నానం చేసి ఇస్త్రీ చేసిన బడి డ్రెస్ వేసుకొని ఎనిమిదిన్నరకు జెండావందనం ఉంటది అందరూ రావాలి" అని మమ్మల్ని ఇంటికి పంపిండు.

బాపు బడికి తయారైతుండు. దోతికట్టుకొని, లాల్చీ వేసుకొని మీద కండువా సదుర్కొని "అరే మురళీ నీ తయారవుడు అయ్యిందా లేదా" గట్టిగ అన్నడు. నేను వెంటనే దన దన దిగూట్లున్న ఇస్త్రీ అంగీ, లాగువేసుకొని వచ్చిన. బాపు, నేను నడుసుకుంట బడి తొవ్వవట్టినం. నాకు ప్రభాతభేరికి దోస్తులతోని పొయ్యి మజా ఉడాయించుడు, జండా ఎగిరేటప్పుడు బాపుతోని ఆవెన్క ల్యాగ దూడ లాగ నడిచిపోవుడు చానా చానా ఇష్టం,

సరింగ 8 గొట్టంగనే కమాన్ దగ్గరజండాని మున్సిపల్ ఛైర్మెన్ సోహన్లాల్ బల్దవా ఎగిరేసిండు. దానిపక్కకే మా బడి. ప్రతి పంద్రాగస్టుకు, చెబ్బిస్ జనవరికి ముఖ్యఅతిథి బల్దవాసేటే.

బల్లె మా హెచ్చెమ్ తొడుపునూరి కిష్టయ్య సార్ ఎగిరేసిండు. పదవ తరగతి పెబ్బ ఉమాకాంత్ జనమనగణ గీతాన్ని పాడితే మేమంత గొంతుకలిపి జెండాకు వందనం చేసినం. అప్పటికే జరంత పెరిగిన సూర్యుడు తొంగి తొంగి చూసుకుంట జెండాను కిరణాల వేళ్ళతో సెల్యూట్ చేస్తున్నడు.

మళ్ళొక్కసారి పీటీ సర్ విజిలేసిండు. హెచ్చెమ్ సర్ మైక్ అందుకొని" మన పట్టణ ప్రథమ పౌరుడు, మున్సిపల్ చైర్మన్ గారు అయిన సోహన్ లాల్ బల్దవా విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారు" అన్నడు.

నా మట్టుకు నేను ఆయన ఉపన్యాసం అస్సలు వింటలేను, వెనక లియాఖత్‌తోని మాట్లాడుతున్న, ముందటున్న కోమట్ల నాగేందర్ "అరే మురళి మీ బాపు నీ దిక్కే కోపంగ చూస్తున్నడు. ముచ్చటాపి పెద్దోళ్ళు చెప్పున్నది విను" అన్నడు.

కథ

"నువ్వు విన్నా, ఎప్పుడు వింటున్నదే గదా, గండ్ల కొత్తగేముండది" అన్నగని, అసలు విషయం అదికాదు. చైర్మెన్ సర్ ఉపన్యాసం అయిపోయేటప్పుడు చెప్పే ముచ్చటకోసమే నా ఎదురుచూపు.

"....... ఇట్లా ఎన్నో పనులు చేసిన. మీ బడికి జాగగుడా చూసినా...... చివరగా...... నాకు ఎర్కే మీరు దేనికోసం ఎదురు చూస్తున్నరో, ఎప్పటి లెక్కనే, మా బాలాజీ టాకీస్ల పదిగంటలనుండి పదకొండు గంటల వరకు ఉట్టిగనే సినిమా పాటలు, కొన్ని ఫైటింగ్ బిట్లు మీకోసం రెడీగ ఉన్నయి. వచ్చి చూడుండి" అని తన ఉపన్యాసాన్ని ముగించిండు.

ఈ మాటకోసమే నా మనసు అన్ని ఆగవట్టుకొని ఎదురు చూస్తున్నది. సినిమా అంటే నాకు చదువుకంటే ఎక్కువ ప్రాణం. ఈరోజైతే అంతా స్వేచ్ఛ గనుక, ఇంట్ల అమ్మేమనదు, బాపైతే బడిలనే ఉన్నడు. వెంటనే నేను నాగేందర్కు ఇషార చేసినా, లియాఖత్ ఇంకా కొందర్ని మోపుజేసిండు. మెల్లగ అందరం లడ్డుబొంది చూర తీసుకున్నం. అప్పుడే గేటు దగ్గర నిలవడ్డ బాపు తన చేతిల ఉన్న బోంది లడ్డుపొడి నాకు వెట్టి తినుకుంట పొమ్మన్నడు.

బస్సు డ్రైవర్ స్టీరింగ్ పట్టుకొంగనే లోపటున్నోళ్లు ఎంత సంబరపడుతరో అంతకంటే ఎక్కువ సంతోషంతోని దోస్తులగూడి బాలాజీ టాకీస్కు పోయినం.

పదినిమిషాల్ల అందరం టాకీస్కు చేరినం. ఆడ ఇంక గేట్లే తియ్యలేదు. మస్తుమంది గేట్లనువట్కొని ఊపుకుంట లొల్లి లొల్లిజేస్తున్నరు. ఆ మందిని చూసి నా నోట్ల తియ్యగ కరుగుతున్న బొంది చూర ఒక్కసారి చేదుగొట్టవట్టింది. ఈసారి ఎట్లనన్న లోపటికి జొరవడి సీటుదొర్కవట్టుకోవాలె అనుకున్నం అందరం. పదయింది టైం. గేట్ తీస్తున్నరు, పిల్లలు ఒక్కసారి కోమటి చెరువు మత్తడి దుంకినట్టు ఒక్కటే ఉరుకుడు లోపటికి.

ఈసారి అందరం అష్టకష్టాలువడి సీటు దొరికిచ్చుకున్నం. పదినిమిషాల ఆలస్యంతోని వేటగాడు సినిమాలోని పాట మొదలైంది. ఎన్టీఆర్ రెండు గుండీలిప్పి డ్యాన్స్ మొదలు వెట్టిండో లేదో పర్దామించి పాట మాయమయ్యింది. ఏం జరుగు తున్నదో ఎవ్వరికీ అర్థమైతలేదు. ఒర్రుతున్నరు కొందరు. ఈలలు గొడుతున్నరు. కాయిదాలు చింపి ఎగురేస్తున్నరు. కొందరైతే సీట్లు చింపనీకి

**బాపు బడికి తయారైతుండు. దోతికట్టుకొని, లాల్చీ వేసుకొని మీద కండువా సదుర్కొని "అరే మురళీ నీ తయారవుడు అయ్యిందా లేదా" గట్టిగ అన్నడు. నేను వెంటనే దన దన దిగూట్లున్న ఇస్త్రీ అంగీ, లాగువేసుకొని వచ్చిన. బాపు, నేను నడసుకుంట బడి తొవ్వవట్టినం. నాకు ప్రభాతభేరికి దోస్తులతోని పొయ్యి మజా ఉడాయించుడు, జండా ఎగిరేటప్పుడు బాపుతోని ఆవెన్క ల్యాగ దూడ లాగ నడిచిపోవుడు చానా చానా ఇష్టం. సరింగ 8 గొట్టంగనే కమాన్ దగ్గరజండాని మున్సిఫల్ చైర్మెన్ సోహన్లాల్ బల్దవా ఎగిరేసిండు.**

చూస్తే గేట్ దగ్గరోళ్ళు చూసి లొల్లివెడితే ఆగిపోయిండ్రు బడిపిల్లలు.

అట్లనో, ఇట్లనో టైం గంట అయినట్టున్నది. అందరం వాన కోసం నోరు తెరిచిన భూమిలెక్క కండ్లు తెరిచి పరదానే చూస్తున్నం. నేను వెనకకు తిరిగి రీళ్ళు నడిచే ప్రొజెక్టర్ దిక్కు చూసిన. లోపట సినిమా ఆపరేటర్ ఏదో సదురుతున్నడు. పెద్దపొక్కల నుంచి సినిమా బొమ్మ పడుతుంటే, పొగల వరుసకనవడుతది అసలుకైతే, కని ఇంకా ఆ పొగ పొక్కల నుండి వస్తలేదు. కొంచెంసేపటికి ఏదో మెతుకంత వెలుగుపొగ వస్తుంటే తల పరదాదిక్కు తిప్పిన.

"క్షమించండి, ప్రొజెక్టర్ల రీల్ జామ్ అయినందున వేటగాడు పాటల ట్రైలర్ మొత్తం చూపించలేక పోతున్నందుకు చింతిస్తున్నాం, ఇట్లు టాకీస్ యాజమాన్యం" అని ఉన్న స్లైడ్ ప్రత్యక్షమైంది.



వ్యాసం

# బెకన్ రచనల్లో పుస్తకాల ప్రాధాన్యం

**బెకన్ వచన రచనల్లో సత్యం యొక్క విశిష్టత, పుస్తకపాఠనావిశ్యకత...**

కాంచనపల్లి గోరా

లండన్ - 1561-1626 కాలానికి చెందిన బెకన్ న్యాయవాదిగా తాత్వికుడుగా రాజకీయవేత్తగా ఆంగ్ల భాషాకోవిదుడుగా బహుముఖ ప్రఖ్యాతుడు. అతడు విద్యార్థి దశలో ట్రినిటి కాలేజీలో చదివే రోజుల్లోనే ఆరిస్టాటిల్ తాత్విక వివేచనకు ప్రభావితుడయ్యాడు.

బెకన్‌ని Father of English Essay అని అంటారు. Father of Empiricism అంటారు. మానవునికి శాస్త్రీయ దృక్పథం ప్రకృతిని దగ్గర నుండి చూస్తే వస్తుందని చెబుతాడు బెకన్. బెకన్ వ్యాసం of Truth నైతిక భావజాలం ప్రోది చేసుకోవడానికి ఉపయుక్తంగా నిలిచింది. సత్యాన్ని గురించి నైర్మల్యాన్ని గురించి వివరిస్తుంది ఈ వ్యాసం. బెకన్ దృష్టిలో సత్యాన్వేషణ అంటే ప్రేమించడం గురించి తెలుసు కోవడమే. సత్యానికి సంబంధించిన జ్ఞానం పొందడం అంటే సత్యాన్ని దృఢంగా విశ్వసించడమే. సత్య పథం ద్వారా ఆనందం పొందేవాడు నిజమైన సార్వభౌమాధికారం కలవాడు. బెకన్ తన పరిశీలనలో మనిషి స్వాభావికంగా అబద్ధం చెప్పే లక్షణం కలిగి ఉంటాడని చెబుతాడు. బెకన్ అసత్యం వైపు మొగ్గు చూపాడని, అసత్యవాచకంలోని స్వాభావికతను సమర్థించాడని అర్థం కాదు. బెకన్ గొప్ప ఆదర్శాలను, విస్మృత సత్యాలను అర్థం చేసుకున్న రచయిత. సత్యాన్వేషి అయిన రచయిత ఎప్పుడైనా పాఠకునిలో నిజాన్ని ప్రోది చేయాలని చెబుతాడు.




పై ప్రతిపాదనతోనే కొనసాగిన ఆయన off Goodness, Goodness of Nature అనే వ్యాసాలు నైతిక సూత్రాలు ఆవృతాలుగా కొనసాగుతాయి. ధార్మిక వ్యక్తిత్వం బాధా హేతువౌతుందని చెబుతాడు, దాన గుణానికి లేక ధార్మికతకు హద్దులు ఉండవు అని చెబుతాడు.

బెకన్ పునర్జీవనోద్యమానికి (Renaissance) చెందిన వాడు. మనిషి తనకు ఈ ప్రపంచానికి గల సంబంధం అసలే ఆలోచించడు. బెకన్ మానవుని ఆచరణాత్మకత మీదనే నిరంతరం దృష్టి నిలిపేవాడు. Of Truth, Of Beauty పూర్తిగా మనిషి సత్ప్రవర్తనకు సంబంధించినవే. బెకన్ సౌందర్యం సత్యం అవిభాజ్యం అంటాడు. ఆయన మానవీయ అధ్యయనం అంతా ఈ కోణంలోనే సాగుతుంది. మనిషిలోని దైవత్వం, లేక ఉన్నత వ్యక్తిత్వం నిరూపించేందుకే ఆయన ప్రయత్నం. ఒక తాత్వికుడుగా సత్యాన్వేషణ ఆయన ప్రధాన లక్షణం. మనిషిలో సాధారణంగా ఉండే భ్రమలను ఆయన వ్యతిరేకిస్తాడు. ఈ విషయంగా అతడు జరిపిన అన్వేషణ మానవీయ కోణంలోని నిజాయితీని బయట పెడుతుంది. “To say of what is that

వ్యాసం

"it is,or of what is not that is not, is truth" అంటాడు బెకన్.

బెకన్ అసత్యానికి సృజనాత్మకత ఉంటుందని చెబుతాడు. అట్లాగే Free will కూడా ఉంటుంది. కాగా సత్యం గుంజకు కట్టేసినట్టు నిక్కచ్చిగా ఉంటుంది. మనిషి కష్టపడితేనే సత్యం లభ్యమౌతుంది. మనసు కష్టపడడానికి ఇష్టపడక అసత్యం వైపు భ్రమల వైపు వెడుతుంది. సాధారణంగా అబద్ధాలు చెప్పేవాళ్ళు కవులు, వ్యాపారస్తులు అయి ఉంటారని చెబుతాడు బెకన్. సత్యం ముత్యం లాంటిది. అది పగటి వెలుగులో కనబడుతుంది. అబద్ధం చీకటిలో మెరిసే వజ్రంలా ఉంటుంది. సాధారణంగా కొంచెం సత్యం కొంచెం అబద్ధం కలిపిన మాటలు వినసొంపుగా ఉంటాయి. కవిత్వం ఇట్లాంటి వ్యక్తీకరణలు అధికంగా చేస్తుంది కాబట్టే Augustin కవిత్వాన్ని దయ్యాల ద్రాక్ష రసం అన్నాడు. సత్యం theological truth - philosophical truth అని రెండు రకాలుగా ఉంటుంది. జ్ఞానమే సత్యశోధనకు మూలమౌతుంది. నిజం అనే గుట్టపైకి ఎక్కి కిందికి చూస్తే కనిపించే యుద్ధాలు అసలు విషయం తెలుపుతాయి.

బెకన్ of Studies, వ్యాసం అధ్యయనావశ్యకత తెలిపేది. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు కూలంకషంగా చర్చిస్తాడు బెకన్. చదువు ఆనందాన్ని, శక్తిని, ఇస్తూ ఒక ఆభరణంగా ఉంటుందంటాడు బెకన్. బెకన్ దృష్టిలో విద్య పట్ల మూడు రకాలైన దృక్పథాలు కలిగిన వాళ్ళుంటారు. కపటులు లేక అవివేకులు (crafty) సామాన్యులు (simple) వివేకులు (wise). అవివేకులు పుస్తకాలను, పఠనాన్ని నిరసిస్తారు.


THE ESSAYS, OR Councils, Civil and Moral, OF Sir FRANCIS BACON, Lord Verulam, Viscount St. Alban. With a TABLE of the Colours OF Good and Evil. And a Discourse Of the WISDOM of the ANCIENTS.

To this Edition is added the Character of Queen ELIZABETH; never before Printed in English.

LONDON, Printed for H. Herringman, R. Scot, R. Chiswell, A. Swalle, and R. Bentley, 1696.

సామాన్యులు అధ్యయనాన్ని ఆరాధిస్తారు. వివేకులు పుస్తక జ్ఞానాన్ని ఆచరణకు తెస్తారు. బెకన్ పఠనీయ పుస్తకాల గురించి కూడా సూచనలు చేస్తాడు. కొన్ని పుస్తకాలను చదివే ఉత్సాహం కోసం చదవాలి. ఇలాంటి ఆసక్తి కలిగించేది ప్రధానంగా ఫిక్షనే. కొన్ని పుస్తకాలు మొత్తం కాకుండా అవసరమైన భాగాన్ని చదివి అర్థం చేసుకోవాలి. మరికొన్ని గొప్ప పుస్తకాలు


BACON, His Age's Pride and Britann's Glory, Whose Name will still be Famous in Her Story, Having by's works oblig'd all future Ages To pay Him Thanks as many as His Pages, Having well-weigh'd each Tittle of that Praise Found a great part arose from His ESSAYES.

THE ESSAYS, OR COUNSELS, CIVIL, & MORAL, OF Sir Francis Bacon, Lord VERULAM, Viscount St-ALBAN: Whereunto is added by Himself A TABLE of the Colours OF GOOD and EVIL.

To which is prefixed A Preliminary DISCOURSE

LONDON, Printed by J. Redmayne for Thomas Palmer at the Crown in Westminster-Hall. 1663.

> **బెకన్ ఏ శాస్త్రం చదివినా ప్రయోజనం ఉంటుందని చెబుతాడు. చరిత్ర జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. కవిత్వం ఊహాత్మకత పెంచుతుంది. గణితం బుద్ధిని వికసింపజేస్తుంది. తత్వం అనవసర ఆలోచనలు చంపి ఏకాగ్రత కలిగిస్తుంది. న్యాయశాస్త్రం చెడ్డ జ్ఞాపకాలను అధిగమిస్తుంది. శరీరారోగ్యం కోసం వ్యాయామం ఎంత అవసరమో మానసిక ఆరోగ్యం కోసం చదువు అంత అవసరం అంటాడు బెకన్.**

జాగ్రత్తగా చదివి జీర్ణం చేసుకోవాలి. కొన్నయితే చదవాల్సిన అవసరం లేదు నిష్ప్రయోజనమైనవి.

బెకన్ ఏ శాస్త్రం చదివినా ప్రయోజనం ఉంటుందని చెబుతాడు. చరిత్ర జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. కవిత్వం ఊహాత్మకత పెంచుతుంది. గణితం బుద్ధిని వికసింపజేస్తుంది. తత్వం అనవసర ఆలోచనలు చంపి ఏకాగ్రత కలిగిస్తుంది. న్యాయశాస్త్రం చెడ్డ జ్ఞాపకాలను అధిగమిస్తుంది.

అధ్యయనం వల్ల సిద్ధపడే తత్వం పెరుగుతుందంటాడు. ప్రతిదాన్ని ఆకళింపు చేసుకొని వర్తమాన సమాజానికి అవసరమైన వ్యక్తిత్వం సంతరించు కొంటాడు మనిషి. బెకన్ ఒక్క చదవడమే కాక రాయడాన్ని కూడా ఆహ్వానించాడు. రాయడం వల్ల కచ్చితత్వం వస్తుందని చెబుతాడు.

శరీరారోగ్యం కోసం వ్యాయామం ఎంత అవసరమో మానసిక ఆరోగ్యం కోసం చదువు అంత అవసరం అంటాడు బెకన్.

చదువు మనిషిని సంపూర్ణ మానవునిగా మారుస్తుంది అంటాడు.

నిజానికి ఒక మహా రచయితను చిరు స్పర్శతో తూచడం అంత సులువు కాదు. ఎవరికైనా ఈ చిరు ప్రయత్నం వల్ల సత్యశోధన మీద అధ్యయనం మీద ఆసక్తి కలుగుతుందేమో అనే అభిలాషే.

# వంటింటి నుదుటి బొట్లు



కొమురవెల్లి అంజయ్య

పక్క పక్కనే మంటల వంటల పనిమంతురాళ్లు
కవలల్లా పుట్టి పక్కపక్కనే
వంటింట్లో చిట్టుపొయ్యి, కట్టెలపొయ్యి
జాజుతో అలికి ముగ్గేసి బొట్లు పెడితే
ఇంటి పెద్దర్వాజ కడపలా బడాయి పోయేవి

ఒకటి ముట్టిచ్చి ఊరుకుంటే
రెండోది చిన్నబోయేది, అలకబూనేది
వాడిన మూకుడునో, అన్నం కూర గిన్నెలనో మోసేది
తప్పని తిప్పలు తగులుకున్న భావన
రెండు మూడు కట్టెలు పెట్టి వెలిగిస్తే
భగభగ మండే పొయ్యి మీసాలు మెలేసేది
చిన్న రోకలి నిలబెట్టి పొయిల చిట్టు నింపడం
అమ్మ నేర్చిన బ్రహ్మవిద్య
మంట మలిగినా కాకతగ్గని చిట్టుపొయ్యిది
నెమ్మదితనం, నేర్పరితనం

ఒక్కోసారి రెండూ అలిగి మారాం చేసేవి
పొగ ఏడుపులతో గోలగోల చేసేవి
గొట్టం ఊది ప్రాణవాయువు బిస్కెట్లిస్తేనో
గ్యాస్ నూనె బెల్లం ముక్క చేతిలో పెడితేనో
తొవ్వల కొచ్చి మండేవి బుద్దిగా
పొగ గొట్టం ఊదడమంటే ప్రాణం కొంత పంచివ్వడమే
పొగ సూరిన కన్నీళ్ళను తుడువడమే

పొయ్యిలు పొగబెడితే
సున్నం గోడలకు మసంటకుండా
పెంకుటింట్లో పైకప్పు కట్టెలు మసి బారకుండా
ఇంటి కప్పును చీల్చి కట్టిన చిమ్నీ
పొయ్యిలు రాజేసిన విషయం
వాడకట్టంతా చాటింపేసేది

పొయ్యిల పిల్లి లేస్తేనే కదా
కడుపుల ఎలుకలు పరారయ్యేది
మంట మర్యాదగా మెలిగితేనే
మసంటని గిన్నెలు, మాడిపోని వంటలు

కుండలో పాలు పొంగడానికి
తుకతుక ఉడికే రాతెండి బువ్వ గిన్నెలకు
చలికాలం స్నానాలకు నీళ్లు మసల బెట్టేందుకు
పొయ్యిలు రెండు పెద్దదిక్కయ్యేవి
ఇంటింటికి మంటి పొయ్యిల కాలంలో
అవి వంటింటి నుదుటి బొట్లు
నాగరికతకు ఆనవాళ్లు

గ్యాస్ వంటింట్లో పెత్తనం మొదలెట్టాక
కట్టెలు, చిట్టు, గ్యాస్ నూనె పొయ్యిలన్నీ
కొట్టేసిన చిట్టా పద్దులయ్యాయి
ప్రదర్శనలలో కూడా వెలుగని బొమ్మలైనాయి



## Listen to My Case!

తమకు జరుగుతున్న అన్యాయాలపై, వ్యవస్థల్లోని లోపాలపై న్యాయపోరాటం చేసిన మహిళల విజయగాథలను Listen to My Case! When Women Approach the Courts of Tamil Nadu పుస్తకంలో వివరించారు జస్టిస్ కే. చంద్రు. మద్రాసు హైకోర్టులో జడ్జిగా పనిచేసిన చంద్రు, తమిళనాడులో జరుగుతున్న వివిధ అంశాలు, అన్యాయాలపై కోర్టుల్లో న్యాయపోరాటం చేసిన 20 మంది మహిళల గురించి, రచయిత ఈ పుస్తకంలో వివరించారు. న్యాయపోరాటం చేసిన మహిళల నేపథ్యం, వారి డిమాండ్లు, కోర్టు తీర్పులను ఇందులో పొందుపరిచారు.




## The Braided River




బ్రహ్మపుత్ర నది, ఆసియాలో అతిపెద్ద మరియు అతిముఖ్యమైన నదుల్లో ఒకటి. బ్రహ్మపుత్ర నదీ తీరం వెంట ప్రయాణించిన జర్నలిస్టు సామ్రాట్ చౌదరి, తన అనుభవాలను The Braided River: A Journey Along the Brahmaputra పుస్తకంలో వివరించారు. బ్రహ్మపుత్ర నది టిబెట్ నుంచి భారతదేశంలో ప్రవేశించడం నుండి, నదీ తీరం వెంట ఉన్న ప్రజల జీవన విధానాలు, సంస్కృతి, బంగ్లాదేశ్‌లో బ్రహ్మపుత్ర - గంగా నది, చైనా భారత్ సంబంధాల్లో బ్రహ్మపుత్ర పాత్ర వంటి అనేక అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు.

## Till We Win

దేశంలో కరోనా సెకండ్ వేవ్ తీవ్ర రూపం దాల్చింది. భారత దేశంపై కరోనా ప్రభావం గురించి Till We Win: India's Fight against the COVID-19 Pandemic పుస్తకంలో వివరించారు రచయితలు డా. చంద్రకాంత్ లహారియా, డా. గగన్ దీప్ కాంగ్, డా.రణ్ దీప్ గులేరియా. వైద్య రంగంలో నిపుణులైన రచయితలు, కరోనా మహమ్మరి విజృంభణకు దారి తీసిన పరిస్థితులు, ప్రజాజీవనంపై కరోనా ప్రభావం, కరోనా చికిత్స, క్వారంటైన్, దేశ వైద్య రంగంలో జరగాల్సిన మార్పులు వంటి అనేక అంశాలను ఈ పుస్తకంలో వివరించారు.



# తెలుగు శాసనాల ఆకర గ్రంథాలు - పరిచయం

చారిత్రక పరిణామంలో శాసనాల ప్రాధాన్యం తెలిపే వ్యాసం...

డా॥ బూర్ల చంద్రశేఖర్

**పరిచయం...**

శాసనాలే చరిత్ర రచనకు ప్రధానమైన ఆకరాలు. శాసనాల్లో వారివారి భావాన్ని వ్యక్తపర్చే భాష ఉంటుంది. భాషలోనే లిపి, సాహిత్య, సంస్కృతి మొదలగు విషయాలన్నీ ఉంటాయి. అలాంటి భాషను అధ్యయనం చేస్తే, ఆయా భాషీయుల జాతి, ప్రదేశం యొక్క సమగ్రమైన చరిత్ర మనకు తెలుస్తుంది. ప్రాచీన భాషాధ్య యనానికి సాహిత్య గ్రంథాల కన్నా ముఖ్యంగా శాసనాలు మనకు ఎక్కువ తోడ్పడతాయి. ఇంకా చెప్పాలంటే సాహిత్య గ్రంథాల పరిష్కారానికి కూడా శాసనాల అవసరంతో ఉంది. ఎన్నో ఏళ్ళ కిందటి భాష, లిపి యథాతథంగా మనకు శాసనాల ద్వారా కనబడుతుంది. పూర్వ కవులు, రచయితలు, లేఖకులు, రాజులు ఏదైతే చెప్పదల్చుకున్నారో వాటిని అదే రీతిగా తెలుసుకోగలుగుతాం. శాసనాలను పూర్వం శిలలపై, లోహపురేకులపై, (తామ్ర), క్యానిఫామం (బంకమట్టిపై), చెక్కపలకలపై, జంతుచర్మాలపై, దంతాలపై, తాటి ఆకులపై, ఈత ఆకులపై, బూర్జపత్రాలపై, వెదురు బొంగులపై, వస్త్రాలపై, ఎముకలపై, ఇటుకలపై, రాసేవారు. నేడు కాగితాలపై రాస్తున్నారు. శాసనాలు రాయడానికి ఉపయోగించే వస్తువులు ఎన్ని ఉన్నా ఎక్కువగా శిలాసనాన్నే శాసనం అని వాడతారు. తెలుగునాట "శిలాశాసనం" అనే జాతీయం ఇందుకే వచ్చుంటుంది. అయితే ఈ శాసనాల సేకరణ, అధ్యయనం కష్టమైన పనే కాని ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి.

ప్రాచీన వాఙ్మయ చరిత్ర నిర్మాణంలో శాసనాలు ఎంతగానో తోడ్పడతాయి. తెలుగులో శాసనాల సేకరణ, అధ్యయనం దాదాపు తగ్గుతుందనిపిస్తుంది. 2013 లో ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారిచే సంకలనం చేయబడ్డ "విశ్వ విద్యాలయాల్లో తెలుగు పరిశోధన" గ్రంథంలో చూసినట్లైతే శాసనాలపై 22 పరిశోధనలు అందులో 3 ఎం.ఫిల్ అన్నట్లు, 9 గ్రంథాలే ముద్రణాభాగ్యానికి నోచుకున్నట్లు తెలుస్తుంది. శాసనాలపై పూర్వ పరిశోధకులంత కృషి చేయకున్నా కనీసం వారు సేకరించిన శాసనాలను పరిశీలించి, వ్యావహారిక భాషలోకి అనువదిస్తూ, టీకాతాత్పర్యసహిత అర్థ వివరణలతో పరిష్కరించి ప్రచురణలు కూడా మనం చేయడంలేదనిపిస్తుంది. వారు ఎంతో కష్టపడి సేకరించిన ప్రతులు చీకటి గదుల్లో మూలుగుతున్నాయి. 'ఒక్క మైసూర్ గ్రంథాలయంలో 1896 నుండి 2009 వరకు సేకరించిన శాసనాలు 18000 ఉన్నాయంటే పూర్వ పరిశోధకుల కృషి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. '(కుర్రా జితేంద్రబాబు గారి ఉపన్యాసం) ఒక్క మైసూరు గ్రంథాలయంలోనే ఇన్ని ఉంటే తంజావూరు గ్రంథాలయం, హైదరాబాదు ప్రాచ్యలిఖిత భాండాగారం, రాజ్యాభిలేఖన గ్రంథాలయం, బ్రిటీష్ మ్యూజియం లాంటి వివిధ దేశ, విదేశ గ్రంథాలయాలు, మ్యూజియాలలో ప్రచురణకు నోచుకోక మూలనపడిన ఎన్ని ప్రాచీన తెలుగు లిఖిత వాఙ్మయ సమాచారం వున్న శాసనాలున్నాయో అనిపిస్తుంది. పూర్వ పరిశోధకులు వాటిని వ్యక్తిగతంగా, సంస్థాగతంగా ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి వెలికి తీసారు. ఇలా తీసినవి తెలంగాణాలో కూడా ఇంకా ఎన్నో వేల శాసనాలు ప్రచురణలోకి రాలేదని తెలుస్తుంది. వారు అందించిన ఆ అమూల్య సంపద 'అంధేందూదయముల్ మూకబధిరశంఖారావము...'లే అవుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగం అంతగా అభివృద్ధి చెందని ఆ రోజుల్లోనే వారన్ని శాసనాలు సేకరిస్తే, సాంకేతిక రంగం ఇంతగా అభివృద్ధి చెందిన నేడు మనమెంత చేయవచ్చో అనిపిస్తుంది. ఇప్పటికీ సాహిత్యంలో ఒక్కో రంగంలో నిష్ణాతులైన విద్వాంసులున్నారు. వారి సేవలుపయోగించుకొని ఒక్కో శాసన ప్రతిని అర్థవివరణలో నేటి, రాబోవు తరాలకు అందిస్తే బాగుంటుంది. దీని

కొరకు తెలుగు భాషాభివృద్ధికై ఏర్పడిన సంస్థల, జ్ఞానకాసారాలైన విశ్వ విద్యాలయాల బాధ్యత ఎంతో ఉంది. ఔత్సాహికులైన పరిశోధకులకు శాసనాధ్యయనంపై శిక్షణాతరగతులనిచ్చి అంధకారంలో బంధీలైన శాసనాల ప్రతుల పుటలు విప్పాల్సిన అవసరం ఎంతో ఉంది. శాసనాలను అధ్యయనం చేయకుండా మన చరిత్రను మనం లిఖించుకోలేము. సేకరణ, అధ్యయనం, ప్రచురణ జరిగితే తప్ప అది సాధ్యం కాదు. "ప్రచురణ భాగ్యం లేని పరిశోధన నిష్ప్రయోజనకరం" (ఆధార గ్రంథం.నెం. 06. పు.14) అన్న మాట అక్షర సత్యం. నేను కూడా శాసనాలను అధ్యయనం చేయాలనే ఉత్సాహంతో ఈ శాసన ఆకరగ్రంథాలను సమీక్షించదల్చాను.

**తెలుగు శాసనాలపై జరిగిన కృషి...**

తెలుగు శాసనాలపై పూర్వ పరిశోధకులు అవిరళమైన కృషి చేసారు. వారి గ్రంథాలను అధ్యయనం చేయడం వల్ల మనలో ఉత్సాహం రావడమే కాకుండా ఎన్నో వినూత్న విషయాలు కూడా తెలుసు కోగలుగుతాము. శాసనాధ్యయనాలపై వచ్చిన గ్రంథాలు, వ్యాసాలు ఎన్నో ఉన్నాయి. అందులో నాకు దొరికిన కొన్ని గ్రంథాలను ఇక్కడ స్థాలీపులాకన్యాయంగా పరిచయం చేస్తాను.

**1. తెలంగానా శాసనములు - మొదటి సంపుటము...**

గ్రంథనామంలో తెలంగాణ పదం యొక్క వికృతి రూపమైన తెలంగానా శబ్దాన్నే ప్రత్యేకత కోసం వినియోగించినట్లు ఈ గ్రంథం పీఠికలో ఉంది. హైదరాబాద్ లోని "లక్ష్మణరాయ పరిశోధక మండలి" వారు ఈ గ్రంథాన్ని 1935లో ముద్రించారు. ప్రస్తావనా రచయితలు అప్పటి మద్రాసు హైకోర్టు న్యాయధీశులు వేపా రామేశం పంతులుగారు ఈ సంపుటికి ఆంగ్లంలో ముందుమాట రాసారు. అసలైన సంపాదకులు శేషాద్రి రమణకవులు (దూపాటి శేషాచార్యులు, దూపాటి వెంకట రమణాచార్యులు), మారేమండ రామారావు పంతులు గార్లు. కాని అట్టపైన వారి పేరు కనిపించదు. ఆదిరాజు వీరభద్రారావు రాసిన పీఠిక ద్వారా సంపాదకుల విషయం మనకు తెలుస్తుంది. 1921 హైదరాబాద్‌లో 'ఆంధ్ర జన సంఘం' స్థాపించబడింది. ఈ సంస్థ 1922లో 'ఆంధ్ర పరిశోధక మండలి' స్థాపించి సాహిత్య కృషిచేయ సంకల్పించారు. దీనిలో మొదటగా కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు సభ్యులుగా ఉన్నారు. వారి తదనంతరం వారి సేవలకు గుర్తింపుగా "లక్ష్మణరాయ పరిశోధక మండలి." అని పేరు పెట్టారు. దీని స్థాపకులు, అధ్యక్షులు మునగాల జమీందారు రాజనాయని వేంకట రంగారావు. 1924 తర్వాత ఈ ఆంధ్ర జన సంఘం కేంద్రం ఆధీనంలోకి వెళ్ళింది. దీని ఆస్తినంతా శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయంలో భద్రపర్చారు.

ఈ గ్రంథంలో 123 శాసనాలు న్నాయి. పరిశోధకులు శేషాద్రి రమణకవులు, మారేమండ రామారావు పంతులు రాష్ట్రంలో చాలా చోట్ల తిరిగి శాసనాలు సేకరించి నివేదికలు కూడా రాసారట. ఈ నివేదికలు ఇందులో పొందుపర్చలేదు. ఈ 123 శాసనాలను 3 భాగాలుగా చేసారు. మొదటి భాగంలో 57 కాకతీయ శాసనాలు, రెండవ భాగంలో 42 చాళుక్య శాసనాలు, మూడవ భాగంలో ఇతర శాసనాలుగా విభజించారు. 82 శాసనాలకు శేషాద్రి రమణకవులు, 40 శాసనాలకు మారేమండ రామారావు పంతులు, 01 శాసనానికి భావరాజు వేంకట కృష్ణారావు నకళ్లు రాసారు. ఇందులో విషయవివరణ, టిప్పణులు తెలుగు, ఇంగ్లీషులో ఉన్నాయి. ప్రతి శాసనానికి పుస్తకం చివరలో వివరాలు ఇవ్వడం ఇందులోని విశేషం. గౌరవ కార్యదర్శి ఆదిరాజు వీరభద్రారావు పీఠిక రాస్తూ ఒక్క మాటంటారు "ఆంధ్ర దేశంలోనే కాదు, హిందూదేశం మొత్తం ఇలాంటి శాసన సంపుటి ప్రకటించిన ప్రజా సంస్థ ఒక్క 'లక్ష్మణరాయ పరిశోధకమండలే' (ఆధార గ్రంథం.నెం.1. పు.xiv) అని తెలుపడంలో ఈ పుస్తక ప్రాధాన్యం మనం తెలుసుకోవచ్చు.

**2. తెలంగాణ శాసనములు-రెండవ సంపుటము...**

హైదరాబాద్‌లోని లక్ష్మణరాయ పరిశోధక మండలి వారు ఈ గ్రంథాన్ని 1960లో ప్రచురించారు. ప్రస్తావనా రచయితలు డా. పుట్టపర్తి శ్రీనివాసా చార్యులుగారు ఈ సంపుటికి ఆంగ్లంలో ముందుమాట రాసారు. గౌరవ కార్యదర్శి ఆదిరాజు వీరభద్రారావు పీఠిక రాసారు. సంపాదకులు గడియారం రామకృష్ణశర్మ, నివేదన రాసారు. దీని ముద్రణకు భారత ప్రభుత్వం కొంత ద్రవ్యమిచ్చి ప్రోత్సహించింది. ఇందులో 85 శాసనాలు ఉన్నాయి. ఇవి మొదటి సంపుటమేయగా నిలువవున్న శాసనాలు. ఇందులో బాదామీ చాళుక్యులవి 03, రాష్ట్ర కూటులవి 5, కళ్యాణి చాళుక్యులవి 41, కాలచూర్యులవి 2, కాకతీయులవి 14, విజయనగరంవి 06, ఇతర శాసనాలు 14 ఉన్నాయి. 83 శాసనాలకు గడియారం రామకృష్ణశర్మ గారు, 02 శాసనాలకు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, నకళ్లు రాసారు.

ఇందులో విషయ వివరణ తెలుగు, ఇంగ్లీషులో ఉంది. ప్రతి శాసనానికి పుస్తకం చివరలో వివరాలు ఇచ్చారు. అలాగే ఇంగ్లీషులో శాసనసంబంధిత వివరాలను టేబుల్సు వేసి వివరించారు. 5 శాసనాల ఫోటోలు కూడా అనుబంధంగా చేర్చారు.

"ఆంధ్రదేశము గురించియు, ఆంధ్రరాజులను గురించియు, నాంధ్ర వాఙ్మయమును గురించియు నెక్కుడు పరిశోధనలు చేసి క్రొత్త వింతలను గనుగొనదలచిన వారికి హైదరాబాదు రాజ్యమందలి తెలుగు భాగమొక బంగారుపు గని వంటిది" అని శ్రీ లక్ష్మణరావుగారు సెలవిచ్చియున్నారు. ఆ బంగారపు గని నుండి కొంత బంగారమును గ్రహించి బంగారు పువ్వులతో రెండు హారములను నిర్మించి ఆంధ్రమాత కంఠసీమ నలంకరించినాము. మొదటి హారమునందు. 123 బంగారు

పువ్వులు గలవు, రెండవ హారమునందు 85 బంగారుపువ్వులు గలవు.'' (ఆధార గ్రంథం. నెం.2. పు. iv) అని పీఠక రాస్తూ ఆదిరాజు వీరభద్రరావు అనడంలో ఎంతో ఔచిత్యముంది.

**3. Inscriptions of Andhra Pradesh-Karimnagar District**

ఈ కరీంనగర్ జిల్లా శాసనాలు గ్రంథాన్ని 1974లో ముద్రించారు. దీని సంపాదకులు శ్రీ పి.వి. పరబ్రహ్మ శాస్త్రి గారు. అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రచురించారు. దీనికన్నా ముందు మొదటగా వరంగల్ జిల్లా శాసనాలను సంకలనం చేసి ముద్రించారు. ఈ క్రమంలో కరీంనగర్ శాసనాల గ్రంథం రెండవది. తరువాత కడప జిల్లాది కూడా ప్రచురించారు. ఈ గ్రంథంలో రాష్ట్ర కూటుల సామంతులైన వేములవాడ (లేములవాడ) చాళుక్యుల వంశంలోని క్రీ.శ. 750 కాలం నాటి వినయాధిత్య యుద్ధమల్లుని నుండి క్రీ.శ. 966 కాలం వరకు పరిపాలించిన మూడ అరికేసరి వరకు ఉన్న చరిత్రను వివరించారు. వేములవాడ చాళుక్యులు పోదన (బోధన్) నుండి వారి రాజధానిని రెండవ అరికేసరి (క్రీ.శ. 930-955) కాలంలో వేములవాడకు మార్చాడని తెలుస్తుంది. కాకతీయుల శత్రువులు పోలాస మేడరాజు, మంథెన గుండరాజు, నగునూరు దొమ్మెరాజు, రామగుండం ఒడ్డెరాజుల చరిత్ర ప్రస్తావన ఉంది. ఇందులో మరిన్ని ఆసక్తి గొలిపే అంశాలు, శాసనాలతో పాటు కోటిలింగాల, మునుల గుట్ట, సబ్బినాడు, శనిగరం, నగునూరు, సపాదలక్షప్రాంతం, పర్బని పత్రాలు మొదలగు విశేషాలు చర్చ చేసారు.

కరీంనగర్‌లోని రెండవ అరికేసరి క్రీ.శ. 946లో వేయించిన శాసనంలో తేదిని కూడా మనం చూడవచ్చు. " ... సకవష9, 869 పరాభవ సంవత్సర కాత్తి 9 బహుళ ఏకాదసి సోమవారదన్దు...'' అని ఉంది. ఇందులో క్రీ.శ. 945 కాలంలో జినవల్లభుడు వేయించిన తెలుగులో మొదటి కందపద్యం, కన్నడ పద్యం కలిగిన త్రిభాషా సమ్మిళిత ప్రసిద్ధి గాంచిన శాసనం గురించి ఉంది.

**4. నరసింహ కవి రాసిన సిద్ధోద్వాహః**

ఈ గ్రంథాన్ని 1968 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముద్రించింది. దీని సంపాదకులు శ్రీ పి.వి. పరబ్రహ్మ శాస్త్రి. వరంగల్ రైల్వేస్టేషన్‌కు 2 మైళ్ళ దూరంలో ఉన్న ఉర్సుగుట్ట (Hillock) పైన రాజగురు విశ్వేశ్వర కుమారుడైన నరసింహకవి సంస్కృతంలో 155 పంక్తుల్లో చెక్కిన (కావ్యం) శిలాశాసనం. ఇందులో 60 శార్దూల శ్లోకాలు, 2 స్రగ్ధర శ్లోకాలతో కలిపి మొత్తం 62 శ్లోకాలున్నాయి. శాసనం చివర్లో కవి సంతకం కూడా ఉంది. శాసనం మొదట్లో ఒక దేవనాగరి లిపిలో ఒక వాక్యం మాత్రమే ఉంది. మిగతా దంతా తెలుగు లిపిలో ఉంది. ఈ కవి కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థాన కవిగా, కాలం 12 శతాబ్ది నుండి 13వ శతాబ్ది మధ్య జీవించి ఉండొచ్చునని చరిత్ర పరిశోధకులు ఊహిస్తున్నారు. ఈ కావ్యంపై కాళిదాసు మేఘసందేశ కావ్య ప్రభావం ఉందని తెలుస్తుంది. ఇంగ్లీషు, తెలుగు లిపులలో పూర్తి శాసన పాఠాన్ని ముద్రించారు. ఇంగ్లీషులో ఈ శాసన వివరణ, విశ్లేషణ ఉంది. ఈ శాసన కావ్యంలో ఒక సిద్ధుని ప్రేమ వివాహ కథ ఉంది. ఈ కథ మేరు పర్వతవర్ణన దగ్గర మొదలై సిద్ధుని వివాహవర్ణనతో ముగుస్తుంది. ఇందులోని కావ్యలక్షణాలను కవికి సమకాలికుడైన, ప్రతాపరుద్రుని ఆస్థాన కవి అయిన విద్యానాథుని ప్రతాపరుద్రయశోభూషణం అలంకార శాస్త్ర గ్రంథంతో అన్వయించి చూస్తే మరిన్ని విశేషాలు లభ్యమయ్యే అవకాశం ఉంది.

**ప్రాచీన వాఙ్మయ చరిత్ర నిర్మాణంలో శాసనాలు ఎంతగానో తోడ్పడతాయి. తెలుగులో శాసనాల సేకరణ, అధ్యయనం దాదాపు తగ్గుతుందనిపిస్తుంది. 2013 లో ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారిచే సంకలనం చేయబడ్డ "విశ్వ విద్యాలయాల్లో తెలుగు పరిశోధన" గ్రంథంలో చూసిన ట్లైతే శాసనాలపై 22 పరిశోధనలు అందులో 3 ఎం.ఫిల్ అన్నట్లు, 9 గ్రంథాలే ముద్రణాభాగ్యానికి నోచుకున్నట్లు తెలుస్తుంది.**

**5. ప్రాచీనాంధ్ర శాసనములు**

ఈ గ్రంథ రచయిత డా. బూదరాజు రాధాకృష్ణ, వీరు ఈ అంశంపై పరిశోధన చేసి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ గ్రంథం 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురించింది. దీనిని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారికి అంకితమిచ్చారు. ఇందులో క్రీ.శ. 2 శతాబ్ది నుండి క్రీ.శ. 1100 మధ్య కాలంలో వచ్చిన 269 శాసనాల గురించి ఉంది. ఇందులో 217 శిలాశాసనాలు, 52 తామ్రశాసనా లున్నాయి. వీరు 255 శాసనాలవరకు వివిధ ముద్రిత గ్రంథాలు, పత్రికల నుండి సేకరించారు. రచయిత తెలిపిన ప్రకారం ఇందులో 74 రాయలసీమ 93 ఉభయ గోదావరులవి, 62 ఉత్తరాంధ్రవి, 4 తెలంగాణ ప్రాంతాల శాసనాలు విశ్లేషించానన్నారు.

రచయిత నిజానికి 1958-60 ప్రాచీనాంధ్ర భాషా చారిత్రక వ్యాకరణ మొకటి ఆధునిక పద్ధతుల్లో రాయాలన్న తలంపుతో మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి సహాయం తీసుకొని ఈ శాసనాలపై కృషి చేసారు. అందుకే ఈ గ్రంథంలో భాషాపరమైన అంశాలను తీసుకొని శాసనాలు విశ్లేషించారు. శాసనాలను భాషాకోణంలో అధ్యయనం చేస్తే ఎన్ని కొత్త విషయాలు తెలుస్తాయో వివరించారు. అంతేకాకుండా వీరు ఈ గ్రంథంలో ఎన్నో నూతన శాసనాధ్యయన పద్ధతులను ఉపయోగించారు. ఇవి పరోక్షంగా తరువాతి శాసన పరిశోధకులకి తొవ్వజూపాయనవచ్చు.

క్రీ.శ. 1200 కాలం వరకు ఉన్న 'డ' 'ళ' ల కు, 'ద' 'డ' ల సమానంగా ఉన్న లిపి సంకేతాల వివరణ, క్రీ.శ. 17 శతాబ్ది తరువాతనే తెలుగులో ఎ ఏ ఒ ఓ ల

హ్రస్వ దీర్ఘతల భేదాన్ని స్పష్టంగా గుర్తించ గలమని తెలుపుతారు. ద్విరుక్త వర్ణాలు, మహాప్రాణ అల్పప్రాణాల ఉపయోగం, అనుస్వార, రేఫల తర్వాత స్పర్శ వర్ణాలు దిత్వంగా రాయడం, పంక్తిమీద అనుస్వార చిహ్నం, శాసనంలోని నొక్కులకు అక్షరాలకు భేదం మొదలగు ఎన్నో భాషాపరమైన విశేషాలు చర్చించారు.

ఈ గ్రంథంలో శాసనాలను మరియు అందులోని శబ్దార్థాల వివరాలను ఇంగ్లీషు మరియు తెలుగులో ప్రచురించారు. రెండు భాషల్లో ప్రచురించడం వలన ఔత్సాహికులైన పరిశోధకులకు సమగ్రంగా శాసనస్థ విషయంపై సుబోధకం అవుతుంది.

**6. తెలుగు శాసనాలు**

ఈ గ్రంథ రచయిత జి. పరబ్రహ్మ శాస్త్రి గారు. ఈ పుస్తకాన్ని ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 1975 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వారు ప్రచురించారు. 1975 సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా ప్రకటించింది.

తెలుగు లిపి భాషలు మొదలుకొని ధనంజయుని కలమళ్ళ శాసనం, ఎఱ్ఱగిపాడు శాసనం, తిప్పలూరు శాసనం, కొరవి శాసనం అద్దంకి శాసనం, కుర్క్యాలశాసనం, ఉప్పరపల్లి శాసనం మొదలగు దాదాపు 17 శాసనాల వరకు వివరణాత్మక విశ్లేషణలతో తెలిపారు. భాషాపరమైన సంధులు, సమాసాలు, లిపి,ధ్వని, వర్ణం, పదజాల చర్చకూడా విస్తారంగా చేసారు. క్రీ.శ. 898 నాటికి శాసనాల్లో తెలుగులో ఐ ఔలు లేవని, అఆఇఈఉఊఎఒ అను 8 అక్షరాలే ఉన్నాయని, సున్నాకు బదులుగా వర్గపంచమాక్షరాలే వాడేవారని తెలిపారు. జయంతి రామయ్య పంతులు, వేటూరి ప్రభాకరశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ మొదలగువారు చర్చించిన విషయమైన అడ్డుగీత లేని శకటరేఫంలాగా ఉన్న వర్ణం డ,ళ,ద అనే అక్షరాలవలే ఎలా మారిందో అన్న వాదాన్ని ఇంకొంత వివరించారు. అలాగే అర్ధానుస్వార, పూర్ణానుస్వార చర్చచేసారు. క్లిష్టమైన పదజాలానికి ఆధునిక రూపాలను తెలిపారు. కరీంనగర్‌లోని కుర్క్యాల, ఉప్పరపల్లి శాసన చర్చ చేసారు. నేడు శాసనాలను అధ్యయనం చేసేవారికి మార్గదర్శన గ్రంథంలాగా ఉంటుంది.

**7. తెలుగు లిపి, భాషలకు ఈ శాసనాలు తిరుగులేని ఆనవాళ్ళు**

ఈ గ్రంథ రచయిత డా. ఈమని శివనాగిరెడ్డి గారు. ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం వారు 2008లో ప్రచురించారు. దీనికి ముందు మాటరాస్తూ డా॥ ఎ.బి.కె. ప్రసాద్ గారు "శాసనాలే మన 'శ్వాస'నాలాలు" అని అనడం ఎంతో ఔచిత్యంగా ఉంది. కోటిలింగాల, సింగవరం ప్రాంతాల్లో లభించిన నాణేలు సుమారు 2500 సంవత్సరాల తెలుగు లిపి, భాషా చరిత్రని పట్టిస్తున్నాయని. నాణేలపై అధ్యయనం చేసిన డా. దేమో రాజారెడ్డి గారి కృషిని కూడా గుర్తు చేస్తారు. కల్నల్ కాలిన్ మెకంజి (1754-1821) మొదటగా తెలుగు ప్రాంతం అంతటా తిరిగి 6218 నాణేలు, 8076 శాసనాలు సేకరించినట్టు, వీరికి కావలి సోదరులుతో సహకరించారనే విషయం మనకు తెలుస్తుంది. 1837లో జేమ్స్ ప్రిన్సెప్ బ్రాహ్మీ లిపిని కనుగొన్న తర్వాత శాసన పురావస్తు చరిత్రను సమూలంగా మార్చివేసింది. 1870లో బాస్వెల్ స్థూపాన్ని, 1892లో బూలర్ భట్టిప్రోలు ధాతుపేటికల మీదున్న శాసనాలను చదివి ప్రచురించారు. తెలుగులో కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, వేణుగోపాల్, జయంతి రామయ్య పంతులు, కుందూరి ఈశ్వరదత్తు, చిలుకూరి వీరభద్రరావు, చిలుకూరి నారాయణరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, దూపాటి వేంకట రమణాచారి, గడియారం రామకృష్ణ శర్మ, పుట్టపర్తి శ్రీనివాసా చార్యులు, నేలటూరి వెంకటరమణ, బి.ఎన్. శాస్త్రి, పి.వి. పరబ్రహ్మశాస్త్రి, వి.వి.కృష్ణశాస్త్రి, దేమో రాజారెడ్డి, జితేంద్రదాసు మొదలు ఎందరో శాసన పరిశోధనలో కృషి చేసారని, తెలుగు నేలలో 6500కు పైగా శాసనాలు సేకరించారని, క్రీ.పూ. 3 శతాబ్దిలోని భట్టిప్రోలు శాసనం నుండి క్రీ.శ. 9 శతాబ్ది యుద్ధమల్లుని బెజవాడ శాసనం వరకు తెలుగు లిపి, భాషా పరిణామ వికాసాలకు నిలువుటద్దాలని ఈ పుస్తకం ముందుమాట ద్వారా తెలుస్తుంది.

ఈ గ్రంథంలో భట్టిప్రోలు బుద్ధ ధాతుపేటిక, అశోకుని ఎరగుడి శాసనం నుండి ప్రారంభమై కోటిలింగాల నాణేలు పెద్దబొంకూరు ముద్రికలు, శాలిహుండం ముద్రికలు, ధాన్యకటక, అమరావతి శాసనాలు, ఇక్ష్వాకు, బృహత్పలాయన, శాలంకాయన, పల్లవ, విష్ణుకుండిన, రేనాటి చోళ, బాదామి చాళుక్య, తూర్పు చాళుక్య, బాణారాజుల, మైదుంబ రాజుల, రాష్ట్రకూట రాజుల శాసనాల వరకు విస్తృత వివరణలో పాటు శాసనాల ప్రతిబింబాలను కూడా ఇచ్చారు. అనుబంధాల్లో బ్రాహ్మీ లిపి, తెలుగు లిపి పరిణామక్రమ చార్టులను కూడా ఇచ్చారు.

**8. శాసన సంపుటి (1,2 భాగములు)**

ఈ గ్రంథ సంపాదకులు బి.ఎన్.శాస్త్రి గారు. ఈ పుస్తకాన్ని సరస్వతీ నిలయం. నారాయణగూడ వారు 1976లో (ద్వితీయా ముద్రణ) ప్రచురించారు. దీనికి గడియారం రామకృష్ణ శర్మ అభిప్రాయం, తిరుమల రామచంద్ర గారి ముందు మాట సంపాదకుల కృషిని ఇనుమడింపజేసాయి. గడియారం గారు మైసూరు ప్రభుత్వం 'ఎపిగ్రాఫికా కర్నాటికా' శాసనాలపై మంచి కృషి జరుపుతుందని, మన ప్రభుత్వం ప్రారంభించిన 'ఎపిగ్రాఫికా ఆంధ్రికా' ఇంకా పురిటి దశలోనే ఉందని ఆనాటి వాస్తవిక స్థితిని ఎండగట్టారు. అదే సమయంలో శాసనాలపై అవిరళ సేవ చేసిన రాజమండ్రి 'ఆంధ్రేతిహాస పరిశోధకమండలి' హైదరాబాద్ లోని 'లక్ష్మణరాయ పరిశోధక మండలి' సంస్థలను, వ్యక్తిగతంగా కృషి చేస్తున్నవారిని మెచ్చుకున్నారు. బి.ఎన్. శాస్త్రి గారు కృతజ్ఞతలలో శాసనాల

సేకరణలో తెలంగాణాలోని 9 మండలాలు 4000 గ్రామాలు తిరిగి చూసొన్నారు. పూజా ద్రవ్యాలతో నిండిన దేవాలయాల్లో శాసన ప్రతిబింబాలు తీయడంలోని ఇబ్బందులు, ప్రజలు మూఢనమ్మకాలతో శాసనాలను బయటకు తీయడానికి కూడా ముందుకు రాకపోవడమే కాకుండా, కనీసం వారి గడ్డపారలు కూడా ఇవ్వకపోయేవారని, స్వయంగా వీరే గడ్డపారలు కొనుక్కొని తవ్వితీసి సేకరించేవారని వారి వ్యక్తిగత సాధకబాధకాలను వివరించారు.

ఈ సంపుటిలో మొదటి భాగంలో తామ్రశాసనాలు, రెండవ భాగంలో శిలాశాసనాల గురించి ఉంది. మొదటి భాగంలో 2 విష్ణు కుండినులవి, 1 మారర వంశీయులది, 2 కళింగ గంగ రాజులవి తామ్రశాసనాలున్నాయి. రెండవ భాగంలో 10 కందూరు చోడరాజులవి, 12 కళ్యాణి చాళుక్యులవి 10 కాకతీయులవి, 1 గోల్కొండ నవాబులవి శిలాశాసనా లున్నాయి. వీరు ప్రకటించిన శాసనాలన్ని అముద్రితాలే. ఈ శాసనాలు ఎక్కువగా మహబూబ్‌నగర్, నల్గొండజిల్లాలో పర్యటించి సేకరించినవి. శనిగరం శిలాశాసనం మాత్రం కరీంనగర్లోని శనిగరం పార్థేశ్వర దేవాలయంలోనిది. శాసనపాఠంతో పాటు, అనువాదం, భాష విషయాలు, లిపి, వర్ణక్రమం గుర్తులు, అందులోని వస్తువు చారిత్రక నేపథ్యాలు కాలనిర్ణయం, వంశవృక్షాలతో పాటు వివిధ రకాలైన అంశాలను సవిస్తరంగా తెలిపారు. ఇలా ప్రతి శాసనానికి విపులమైన వ్యాఖ్యానమందించడం పాఠకులకు ఆసక్తికరంగా ఉంది. తామ్రశాసనాల రేకుల బరువును, ఎన్ని పంక్తులున్నాయో తెలుపడం వీరి లోతైన పరిశోధనాదృష్టికి నిదర్శనం. ఈ సంపుటిలోని ఇంద్రపాలనగర తామ్రశాసనం వలన విష్ణుకుండినులు మహబూబ్‌నగర్ మండలంలోని శ్రీపర్వత ప్రాంతీయులని, ఇక్ష్వాకులకు సామంతులుగా నల్లగొండ జిల్లాలోని ఇంద్రపాలనగరాన్ని రాజధానిగా చేసుకొని రాజ్యం చేసారని, దక్షిణాపథులైనారని ఉంది. ఇంత వరకు వీరు విజయవాడ, అమరావతి ప్రాంతపువారన్న వాదాన్ని ఇది విభేదించింది. ఈ తామ్రశాసనం గురించి సంపాదకులు రాసిన వ్యాసం 1965లోనే భారతి పత్రిక జూన్, జులై సంచికల్లో వచ్చింది. ఇదేకాదు తామ్రశిలా శాసనాలలోని పేరూరు, కందుకూరు శాసనాలు తప్ప అన్ని శాసనాలు భారతిపత్రిక 1965 సంవత్సరంలో వారు వ్యాసాల రూపంలో ప్రకటించినవే ఉన్నాయి. స్వయంగా 400 పైగా శిలాశాసనాలను సేకరించారంటే ఎంతో ఆశ్చర్యం కలుగకమానదు.

**9. ఆచంద్రార్కం**

ఈ గ్రంథ సంకలన రచయిత దామరాజు సూర్యకుమార్ గారు. ఈ పుస్తకాన్ని డాక్రి (DACRI) వారు 2013లో ప్రచురించారు. వీరు శాసనాన్ని చూడగానే అలవోకగా చదవగలరు. ఈ గ్రంథంలో క్రీ.శ. 1042 జగదేకమల్లుని కాలంనాటి మాడుగుల శాసనం నుండి గ్రంథంలో క్రీ.శ. 1834 కాలంనాటి నల్లగొండ జిల్లా పాడిచేడు శాసనం వరకు 21 కొత్త శాసనాలు ప్రచురించారు. కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారి శిష్యులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, వారి శిష్యులు నెలటూరి వేంకట రమణయ్యగారు వారి శిష్యులు బి.ఎన్.శాస్త్రి గారు వారి శిష్యత్రయమే నేడు శాసనాలపై విస్తృత పరిశోధనలు చేస్తున్న డా. ఈమని శివనాగిరెడ్డి గారు, కుర్రా జితేంద్రబాబు గారు, దామరాజు సూర్య కుమార్ గారు. బి.ఎన్.శాస్త్రి గారు 'డెక్కన్ ఆర్కియాలజికల్ సొసైటి' పేరుతో ఒక సంస్థ స్థాపించి ప్రతి నెల రెండవ శనివారం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసేవారట. దామరాజు సూర్యకుమార్ గారు అందులో సభ్యులు.

10. Inscriptional Glossary of Andhra Pradesh (శాసన శబ్దకోశము)

ఈ గ్రంథం 1967లో ప్రచురితం అయింది. దీని రచయిత కుందూరి ఈశ్వర దత్తుగారు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వారు ముద్రించారు. శాసనభాషా పరిశోధకులకు అద్భుతమైన ఆకర గ్రంథం ఇది. ఈ గ్రంథాన్ని వేంకటా చలపతికి అంకితమిస్తూ శాసన పరిభాషలో కృతిసమర్పణ చేసారు. వీరికి శాసనాలమీద ఎంత మక్కువ ఉందో ఈ ఒక్క ఉదాహరణవల్ల తెలుస్తుంది.

ఆంధ్రదేశీయేతిహాస మండలి వారు 1992లో "శ్రీ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక" భావరాజు వేంకట కృష్ణారావు సంపాదకత్వంలో ప్రకటించారు. అందులో శ్రీ సోమశేఖర శర్మ రాసిన "ప్రాచీనాంధ్ర భాషాస్వరూపము" వ్యాసం, అందులోనే వచ్చిన గిడుగు వారి వ్యాసాలు వీరు చదివారు. అటు తర్వాత South Indian Inscriptions (Texts) 4,5 భాగాలు స్ఫూర్తి పొందారట. 1936లో "శాసనములలోని తెలుగుభాష" అనే వ్యాసం నవ్యసాహిత్య పత్రికలో రాసారు.

ఈ శాసన శబ్దకోశానికి పీఠిక రాస్తూ "నా దగ్గర నున్న వ్రాతప్రతి సంపుటముల పరిశీలించి గ్రంథ రూపకముగా ప్రకటనార్హమౌనో కాదో యని నిర్ణయించుటకు అకాడమీ కార్యనిర్వాహక సంఘము వారొక విద్వజ్జనపరీక్షకమూర్తి త్రయోపసంఘమును నియోగించిరి. అందలి సభ్యులు (1) డాక్టరు భద్రి రాజు కృష్ణమూర్తి గారు (2) డాక్టరు బిరుదు రాజు రామరాజుగారు (3) శ్రీ గడియారం రామకృష్ణశర్మ గారు మొదటి వారిద్దరు ఆంధ్రభాషావేత్తలు మూడవ వారు ప్రసిద్ధ శాసన పరిశోధకులు..." ఇలా ఆ ఉద్దండులను గుర్తు చేసుకొన్నారు.

శాసనాల్లోని శబ్దాలకు ఇంగ్లీషు, తెలుగు అర్థవివరణ ఇస్తూ ఆయా పదాలు ఏయే శాసనాల్లో ఉన్నాయో కూడా ఉటంకించారు. మిక్కిలి క్లిష్టమైన, ప్రయాసతో కూడుకున్న పరిశ్రమ ఇది. చివర అనుబంధాల్లో ప్రాకృత శాసన పదపట్టికలిచ్చారు, అలాగే భవిష్యతరాల వారికి ఇంకా అర్థ నిర్ణయం చేయాల్సిన పదాల పట్టిక జాబితా కూడా పొందుపర్చారు.

# తిరునగరికి... అశ్రు నివాళి



ఆ లేరు ముద్దుబిడ్డ, దాశరథి పురస్కారగ్రహీత, కవితిలక, డా॥ తిరునగరి 25, ఏప్రిల్ 2021 న హైదరాబాద్‌లో గుండెపోటుతో స్వర్గస్థులయారు. ఐదు దశాబ్దాలనుంచి నిరంతర సాహిత్యసృజన చేస్తున్న పద్యకవి, వచన కవి, విమర్శకులు, అపారమైన ధారణ కలిగిన పండితులు తిరునగరి. తెలుగు, సంస్కృతం, ఆంగ్ల భాషలో మంచి అభినివేశం ఉంది. ఆశువుగా పద్యాలూ చెబుతూ సాహిత్యోపన్యాసలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి. ముప్పైకి మించి సాహితీ రచనలు, వెయ్యికి పైగా సాహిత్య వ్యాసాలు, వందలకొలది ఆకాశవాణి, దూరదర్శన్‌లలో పాటలు రచించారు. మూడు దశాబ్దాల పాటు తెలుగు భాషోపాధ్యయుడుగా పనిచేసిన తిరునగరి, ఎన్నో ప్రభుత్వ, ప్రభుత్వేతర అవార్డులను గెలుచుకున్నారు. తిరునగరికి తంగేడు అశ్రు నివాళి అర్పిస్తున్నది. వారి ఆత్మకు శాంతి కలుగాలని ప్రార్థిస్తున్నది.

# ప్రముఖ రచయిత సి.హెచ్. మధు ఇక లేరు...



చందు పట్ల విట్టల్ అనే పేరు కలిగి సి.హెచ్ మధుగా విఖ్యాతుడైన రచయిత కరోనా కాటు వల్ల 24-04-2021న తన ప్రస్థానం ముగించారు. ఆయన నిబద్ధుడైన కవి. నవలా రచయిత, కథా రచయిత. సామాజిక ఉద్యమ కార్యకర్త. క్యాన్సర్‌ను జయించినా కరోనా కాటును తప్పించు కోలేకపోయారు. 1969 తెలంగాణా ఉద్యమం, నక్సల్ బరి ఉద్యమం ఆయనను చాల ప్రభావితం చేశాయి. నిరంతర సామజిక సాహిత్య అధ్యయనంతో ఒక ప్రగతివాద రచయితగా నిలబడ్డారు. ఆయన సాహిత్యం, జీవితం ఒకటిగా నడచిన సృజనకారుడు. తంగేడు అయన మృతికి సంతాపం ప్రకటిస్తున్నది. తన అశ్రు నివాళి అర్పిస్తున్నది.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికకనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కథ

# పొంగు!

డబ్బు విలువలను గుర్తించకుంటే నడుమంత్రపు సిరి ఎగిరిపోతుందని చెప్పే కథ...



పిన్నంశెట్టి కిషన్

రాజన్న గుడి ముందర బజార్లో- మాసిపోయి, రంగు వెలిసిన సఫారీలో నడుస్తున్న శాల్తీని ఎక్కడో చూసినట్లుందని... బుర్రను ఆరా తీస్తున్నడు రవీంద్ర.

ఇద్దరి చూపులు కలుసుకున్నయి.

అనుమానం లేదు, ఇతడు అతడే! నిర్ధారించిండు రవీంద్రలోని విలేఖరి. సూటిగా చూడలేక, కళ్ళు దించుకుని, రవీంద్రను తప్పించుకోడానికి అడుగుల వేగం పెంచిండు ఆగంతుకుడు.

పట్టువదలని వార్తాహరుడు వేగంగా కదిలి, ఎట్టకేలకు దొరకపుచ్చుకుని, "ఎల్లారావు గారు! మంచిగున్నరా? నన్ను గుర్తు పట్టిండ్రా?" అన్నడు.

సంభాషణ కొనసాగించడం ఇష్టం లేదన్నట్లు ముక్తసరిగా "ఆ!" అన్నడు.

అవన్నీ పట్టించుకుంటే వార్తా కథనాలు ఎలా పుట్టుకు వస్తాయని, "చాలా రోజులుగా కనిపించడం లేదు! రండి. ఉడిపి హోటల్ల కూసుని చాయ్ తాగుతాం" అంటూ దారి తీసిండు.

తనతో వెళ్ళడం ఇష్టం లేదు. కానీ 'చాయ్' మాట చెవులు వినేసరికి- ఎండి అలుకు పిడుచయిన నాలుక, మనసు మాట వినలేదు. అడుగులు అనుకోకుండానే రవీంద్రను అనుసరించినయి.

హోటల్ ఖాళీగా ఉంది. టిఫిన్ల తినే సమయం దాటి పోయింది. భోజనాలకు ఇంకా వేళ కాలేదు. అటూ ఇటూ కాని ఘడియలు. ఓ టేబుల్ ముందర వాళ్ళు కూర్చోబోతున్నది చూసి, వచ్చిన బేరర్కు "రెండు టీ" అంటూ రవీంద్ర ఆర్డర్ చేస్తుంటే "టిఫిన్ కూడా చెప్పండి" అన్నడు లో గొంతుకతో ఎల్లారావు. "అలాగే" అంటూ ఆర్డర్ చేయ బేరర్ వైపు తల తిప్పుతుంటే, "దోశ తప్ప, మరేం టిఫిన్లు లేవు సార్!" అన్నడు బేరర్. "సరే! ఒక మసాలా దోశ. ఎక్స్‌ట్రా కర్రీ. తిన్నంక, రెండు టీ" చెప్పాడు.

ఇద్దరి మధ్యన మౌనం తోడయ్యింది. ఎల్లారావు బజారును గమనిస్తున్నట్లున్నా చూపులు ఎక్కడో శూన్యాన్ని వెతుకుతున్నవి. ఒక్క చోట దృష్టి ఆన్చకుండా చూస్తున్నడు.

ఎల్లారావును గమనిస్తున్నడు రవీంద్ర. కళ తప్పిన ముఖం. చిక్కిపోయిన శరీరం. సఫారీ వేసుకోవలసిన సమయ సందర్భం కాదు. మరో రకం బట్టలు లేక, తొడుక్కున్నట్లు ఉంది. నూనె అంటని తల. పెరిగిన గడ్డం. తిండి కూడా సరిగా లేదేమో! ఆలోచనల్ని మధ్యలో తుంచుతూ దోశ వచ్చింది. ఆవురావురుమని తినడం మొదలు పెట్టిండు.

ఈ ఇరువురి పరిచయం అప్పట్లో గొడవతో మొదలయ్యింది...

'డబ్బులు తీసుకుని, 'వీసా' ఇప్పియ లేదని' వచ్చిన ఆరోపణలను నిర్ధారించుకోను ఎల్లారావు ఇంటికి వెళ్లిండు రవీంద్ర.

గేటు పక్కన టూ-వీలర్లు, ఫోర్-వీలర్లు పార్కు చేసి ఉన్నయి. వాటి పొంటి తన స్కూటర్ ఆపి, గేట్ ముందుకు వచ్చిండు. సెక్యూరిటీ గార్డులు లోపలికి వెళ్లనీయకుండా ఆపి, వివరాలు అడిగి- రాసుకుని, వాకీ-టాకీలో కాంటాక్ట్ చేశారు. "రమ్మ"ని, లోపలి నుండి పిలుపు వచ్చాకా లోపలికి వదిలారు.

విశాలమైన ఖాళీ స్థలం. మధ్యన పెద్ద ఇల్లు. ముందర ఒక వైపు, జర్మన్ షెపర్డ్ కుక్కల షెడ్. మరో వైపు షెడ్‌లో ఓ నాలుగు రకాల కార్లు, సైకిల్ మోటర్లు, స్కూటర్లు ఉన్నయి. తను ఎటు వెళ్ళినా కాన్వాయ్! లోకల్ ఎమ్మెల్యేకు లేని హంగామా. ఇంటి లోపలికి చెప్పులు విప్పి ఎంటర్ కావాలి. ఎల్లారావుగా రూపాంతరం చెందిన ఎల్లయ్య దొరతనం!

ముందు గది సిటౌట్ గోడలకు వేలాడుతున్న దేవుళ్ళ ఫోటోలు. వాటితో సమాంతరంగా తన గల్ఫ్ యజమాని ఫోటో! రవీంద్ర కోసమే ఎదురు చూస్తూనిలబడ్డ ఓ వ్యక్తి, ఆఫీస్ రూమ్‌లకు తీసుకుపోయిండు. చుట్టూ... అవసరార్థం తిరిగే మనుషులు! చోటామోటా రాజకీయ నాయకులు! ఊర్లో పెద్ద మనుషుల్లాగా, పహిల్వాన్లలాగా చలామణి అయ్యేవాళ్ళు!

అప్పటికే అక్కడ కూర్చుని ఉన్న తెలిసిన వాళ్ళు అందరూ రవీంద్రను పలకరించిండ్రు.

తనను తాను ఎల్లారావుకు పరిచయం చేసుకో పోతుంటే, "రవీంద్ర గారు! చెప్పండి. ఇలా వచ్చారు! ఏం పని?" అన్నడు.

విషయం చెబితే... అప్పటి వరకు నవ్వుతూ ఉన్న ముఖం రంగు మారింది. కుర్చీలోంచి లేచి, నడుస్తూ "రండి" అంటూ లోపలికి దారి తీసిండు. తనతో పాటు ఒక బౌన్సర్ అనుసరించిండు. హాల్ లోని సోఫాలో కూర్చున్నంక, బౌన్సర్ ను వెళ్ళమని సైగ చేసిండు.

అతిథిని చూసి, ఏం చెప్పకుండానే టీ-బిస్కెట్లు తీసుక వచ్చిన స్త్రీ మూర్తిని, తన 'రెండో భార్య'ని పరిచయం చేసిండు. "నమస్తే" చెబుతూ టీపాయ్ మీద ట్రే ఉంచింది. ఒంటినిండా నగలు! ఇంట్లో ఉన్నా ఎక్కడికో తయారై పోతున్నట్లు అలంకరణ! మరాఠా వనితల తొమ్మిది గజాల నవారి చీరలో! నట్టింట్లో నడుస్తున్న 'రామప్ప నాగిని'లా ఉంది. బాగోదని ఊరకున్నా- చూపు తిప్పనివ్వని అందం!



సంభాషణలోకి ఉద్యుక్తుడవుతూ "టీ తీసుకో"మని, తాను తీసుకుని తాగుతూ "ఎవరెవరో బట్ట కాల్చి మీద వెయ్యాలని చూస్తరు" అన్నడు.

"నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నయి. ఏదైనా అడ్వర్స్ న్యూస్ రాసే ముందు, వాళ్ల వివరణ తీసుకొని రాయడం నా అలవాటు" అన్నడు రవీంద్ర.

టీ తాగే వరకు మాట్లాడకుండా వేచి చూసి. లేచాడు. లేస్తున్నరవీంద్ర చెయ్యి పట్టుకుని మరో గదిలోకి తీసుకెళ్లాడు. బెడ్ రూమ్‌లా ఉంది. కాట్‌పై పరిచిన బెడ్ షీట్ తొలగించాడు. కళ్ళు చెదిరిపోయాయి. బెడ్ నిండా పరచిన కరెన్సీ నోట్లు! ఓ కట్ట తీసి, రవీందర్ కు ఇవ్వబోతుంటే "నేను అలాంటి వాడ్ని కాదు" అన్నడు.

"మీ గురించి తెలుసుకున్న. ఇప్పుడు చూస్తున్న. డబ్బులతో కాకపోతే మరో దారిలో వెళ్లాల్సి వస్తుంది" అన్నడు. నవ్వి, బయటకు వచ్చిండు రవీంద్ర.

మర్నాడు వార్త రావడం, బాధితునికి డబ్బు వాపస్ చేయడం జరిగింది. ఆ తర్వాత రవీంద్ర ఉద్యోగ రీత్యా కరీంనగర్ వెళ్లడంతో తన గురించిన సమాచారం తెలియకుండా పోయింది. మళ్లీ ఇలా ఇప్పుడే కలుసుకోవడం.

అతడు నిమ్మలం అయినంక, టీ తాగుతున్నప్పుడు "ఆ పటాటోపం అంతా ఏమయింది"దని అడిగాడు.

"పెద్ద చదువులు లేకపోవడం, పల్లెటూరి అమాయకత్వం, ఇవేవీ సంపాదనకు అడ్డు రానప్పుడు, సంపద తుడిచిపెట్టుకు పోవడానికి కూడా అవే కారణం కాదు. విధి రాత కాదు. లోపమల్లా పైస విలువ గుర్తించకపోవడమే!

బొంబాయికి పోతుంటేనే 'దేశం' పోతున్నడని ఏడ్చే కాలంలు ఏకంగా దేశం కాని దేశం! ఎడారి ప్రాంతం! కడుపు చేత పట్టుకుని, పెండ్లాం పిల్లలను వదిలి, బతుకు తెరువు కోసం పోయిన. శ్రమను, నిజాయితీని నమ్ముకున్న.

నా పనిని మెచ్చిన యజమాని, 'వీసా'ల గురించి చెప్పి, ఇండియా తిరిగి పంపించిండు. కనుచూపుమేర పరుచుకున్న ఇసుకలా ఎటుచూసినా రూపాయలు కనిపించవట్టినయి. దొరల్లా, రాజకీయ నాయకుల్లా ఉండాలని, 'నన్ను నేను తయారు చేసుకోకుండా' వాళ్లని అనుకరించటం మొదలుపెట్టిన.

ఈ హొటల్లోనే తిని, వందకు తగ్గకుండా బక్షిస్ ఇచ్చేవాడిని. పక్కనున్న పాన్ డేలాల సిగరెట్ ప్యాకెట్ కొన్నంక, ఎంత మిగిలినా తిరిగి తీసుకున్నది లేదు.

మార్కెట్లో కొత్త మోడల్ బండి వచ్చింది అంటే, తెమ్మని డబ్బులు ఇవ్వడమే తెలుసు. ఎవరి పేరున రిజిస్టర్ అయ్యింది తెలియదు. జాగాలు, పొలాలు అంతే! ఎవరి పాలు ఎంత అయిందో లెక్కా పత్రం లేదు.

ఆరోజు హవాలా సొమ్ము కారు సీట్లలో దాచిపెట్టి, బొంబాయి పోతుంటే పూణేలో పట్టుకున్నరు. లెక్క చెప్పలేకపోవడంతో అరెస్టయి జైల్లో పడ్డ. విడుదలయి వచ్చేసరికి, ఏమీ లేదు.

సిరి దా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్
సిరి దా బోయిన బోవును
కరిమింగిన వెలగపండు కరణిని సుమతీ!

చిన్నప్పుడు, బళ్ళో పంతులు చెప్పిన పద్యంలా సంపద రానూ వచ్చింది! పోనూ పోయింది! పద్యం బట్టీ వట్టినా ఒంట పట్టిచ్చుకోలేదు. రెండో భార్య, సందు దొరికిందని దొరికిన కాడికి అందుక పోయింది. మొదటి భార్య, పుట్టిన ఊరు, తిరిగి దిక్కయింది."

బతుకు సమరంలో సర్వం కోల్పోయి, నడమంత్రపు హంగు ఆర్భాటం పోయి శిథిలాలుగా మిగిలిన గత వైభవపు ఆనవాళ్ల మధ్యన, రోదనతో నిలిచిన ఎల్లయ్య ఓ పాఠం.

చరిత్ర

# కొఱవి గోపరాజు వర్ణించిన తెలంగాణ

**తెలంగాణ ప్రాంత విశేషాలను చిత్రించిన కవి...**



ఆచార్య అనుమాండ్ల భూమయ్య

కొఱవి గోపరాజు 15వ శతాబ్దికి చెందిన కవి. నిజామాబాదు జిల్లా ఆర్మూరు తాలూకాలోని భీంగల్ అతని జన్మస్థలం. కవి పేర్కొన్న నాటి వేములగల్లు. పూర్వ కవుల్లో కవిత్రయాన్ని, వేములవాడ భీమకవి, హుళక్కి భాస్కరాదులను పేర్కొన్నాడు. పోతనను పేర్కొనలేదు. పోతనకు కొంత ముందు కాలం వాడైయుంటాడు. లేదా, సమకాలికుడై ఉంటాడు. తల్లి కామాంబిక. ఈమె "శైవాచార ప్రథమ సింహాసనాధీశ్వరులైన బ్రహ్మదేవ వడియల కూతురు". ఇతడు వేములగల్లు నగరాధీశుడైన రాణామల్లనకు గురువు. తండ్రి కసవరాజు. రాణా మల్లనకు మంత్రి. తన తండ్రిని బృహస్పతి వంటి వాడని కవి పేర్కొన్నాడు.

కొఱవి గోపరాజు రాసిన కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'. సంస్కృతంలోని విక్రమార్క చరిత్ర - చంపూ కావ్యానికి ఇది అనువాదం. ఆ కావ్యంలోని కథలాధారంగా గోపరాజు వర్ణనాదులతో పెంచి రసవత్తరంగా కావ్య నిర్మాణం చేశాడు. కావ్యనాయకుడు విక్రమాదిత్యుడు. అతని సింహాసనం మీది ముప్పయి రెండు బొమ్మలు చెప్పిన కథలివి. విక్రమాదిత్యునికి ఇంద్రుడు కానుకగా ఇచ్చిన సింహాసన మిది. కాలాంతరాన ఇది భోజరాజుకు దొరికింది. దానిని ఎక్కడానికి ప్రయత్నించిన భోజరాజుకు ఒక్కొక్కసారి ఒక్కొక్క బొమ్మ విక్రమాదిత్యుని దాన పరాక్రమాదిగుణాలను చెప్పి నిలువరిస్తుంది. మంత్రి కుమారుడైన గోపరాజు, రాజులకు ఆదర్శనీయుడైన విక్రమాదిత్యుని గుణాలను చెప్పదలచుకొన్నాడు. అటు రాజులు, ఇటు కావ్యవేత్తలు సంతోషించటానికి కావ్యం రాస్తున్నానన్నాడు -

"...ధాత్రీ పాలురు, గావ్య వేదులును మోదం బంద, సింహాసన ద్వాత్రింశిత్కథల న్గుణంబులుగ గావ్యం బొప్పగాఁ జెప్పెదన్" (సింహా.ప్రథమా.59)

ఇరవయి ఒకటవ బొమ్మ చెప్పిన కథలో కొఱవి గోపరాజు తెలంగాణ ప్రాంత విశేషాలను కొన్నిటిని ఇందులో పొందుపరచాడు. ఇవి మూలంలో లేవు. ప్రాంతీయాభిమానం చేత మాత్రమే ఈ వర్ణనలు చేశాడు. బొమ్మ చెప్పిన కథాంశమిది. విక్రమాదిత్యుని మంత్రుల్లో ఒక మంత్రి కుమారుడు గ్రహిలుడు. చదువు శాస్త్రాలేమీ రాకపోవడం వల్ల తండ్రి తిడుతాడు. శాస్త్రజ్ఞుడనై తప్ప ఇంటికి తిరిగిరానని చెప్పి గ్రహిలుడు ఆ మధ్య భారతం నుండి తెలంగాణ ప్రాంతానికి, కన్నడ దేశానికి వచ్చి శాస్త్రజ్ఞుడై తిరిగి పోయాడు. గోదావరి నదిలోని అద్భుత సంఘటనను గ్రహిలుడు చెప్పగా విని, ఆ అద్భుత రహస్యం తెలుసుకుందామని విక్రమాదిత్యుడు ఇక్కడికి వచ్చి పోయాడు.

గ్రహిలుని ద్వారా గోపరాజు పేర్కొన్న ప్రాంతాలు 1.భువనగిరి, 2.శ్రీశైలం, 3. కన్నడ దేశం, 4. ఓరుగల్లు, 5. గోదావరి-శివాలయం - కాళేశ్వరం. 6. ధర్మపురి.

### భువనగిరి...

దక్షిణ దేశానికి వస్తున్న ఆ గ్రహిలుడు భువనగిరి వద్ద గల ఒక అగ్రహారంలో పౌరాణికుడు చెప్పే ప్రసంగం విన్నాడని గోపరాజు చెప్పాడు.

"భువనగిరి యొద్ద నొక్క యగ్రహారంబు దగ్గఱ, యందు గొందఱు సభ్యులు పురాణ శ్రవణంబు సేయుచున్న నట తాను జేరి వినునెడ నప్పౌరాణికుండు తీర్థఫలంబు లెరింగించుచు" (సింహా.అష్టమ.140)

తెలంగాణ ప్రాంతాల్లో నాటి కాలంలో అగ్రహారాలున్నట్లు, పండితులు, పురాణాలు చెప్పే పౌరాణికులున్నట్లు, వాటిని శ్రద్ధగా వినే వారున్నట్లు, పౌరాణికుల మాటల యందలి గౌరవంతో తదనుగుణంగా ప్రజలు నడుచుకొంటున్నట్లు గోపరాజు రాసిన ఈ మాట వల్ల తెలుస్తుంది.

### ఓరుగల్లు...

శ్రీశైలం, కన్నడదేశం పోయి

గ్రహిలుడు ఓరుగల్లు చేరినట్లు కవి రాశాడు. ఓరుగల్లును గురించి మూడు పద్యాలు రాశాడు. ఓరుగల్లు ధనాదులతో మహావైభవంతో అలరారుతున్నట్లు, నగరంలో కవులు శూరులున్నట్లు తెలిపాడు. ఏక శిలానగరం ఓరుగల్లు ఒక్కటే అన్న విషయాన్ని స్పష్టం చేశాడు.

"ఆకడ నీతిశాస్త్రవిదుడై గురు

వీడ్కొని  యేగె వేడ్కతోఁ

గాకిత మూలశక్తి గనిగా

నొనరించిన  పైటి చట్టునా

నేకశిలాభిధానమున నెన్నిక కెక్కి

ధరిత్రిలోన నే

పోకలఁ బోని యట్టి సిరి పుట్టిన

యింటికి నోరుగంటికిన్" (సింహా. అష్టమ-150)

ఈ ఓరుగల్లులో నాడు ఎవరెవరున్నారో గోపరాజు చెప్పాడు -

'చందన గంధులు, విటులు, జాణలు, దాన వినోదులు, కవులు, శూరులు, పెద్దలు.'

ఓరుగల్లులో కొన్ని రోజులుండి, కొందరు పురజనుల పరిచయం పొంది, అందువల్ల, ఆ గ్రహిలుడు "సకల కళాప్రవీణుండై"నాడన్నాడు కవి. ఓరుగల్లులో సకల కళాప్రవీణులున్నారన్న విషయం దీనివల్ల స్పష్టమవుతుంది.

**కొ**అవి గోపరాజు రాసిన కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'. సంస్కృతంలోని విక్రమార్క చరిత్ర - చంపూ కావ్యానికి ఇది అనువాదం. ఆ కావ్యంలోని కథలాధారంగా గోపరాజు వర్ణనాదులతో పెంచి రసవత్తరంగా కావ్య నిర్మాణం చేశాడు. కావ్యనాయకుడు విక్రమాదిత్యుడు. అతని సింహాసనం మీది ముప్పయి రెండు బొమ్మలు చెప్పిన కథలివి. విక్రమాదిత్యునికి ఇంద్రుడు కానుకగా ఇచ్చిన సింహాసన మిది.



### గోదావరి - శివాలయం - కాళేశ్వరం...

గోదావరి నదిలో ఒకచోట ఉష్ణ తీర్థమున్నట్లు, ఆ తీర్థం లోపలి నుండి ఎనమండుగురు దేవతాస్త్రీలు వచ్చి, సమీపంలోని ఆలయానికి వెళ్ళి తమ గాన, నాట్యాదులతో శివుణ్ణి సేవించినట్లు చెప్పినాడు. దీనిని బట్టి ఆ శివాలయం నాడు సుప్రసిద్ధమైనదని తెలుస్తుంది. (ఈ ప్రాంతం పేరు కవి పేర్కొన్నట్లు కన్పించదు.)

### కాళేశ్వరం...

కాళేశ్వరంలోని ముక్తీశ్వరుణ్ణి గ్రహిలుడు సేవించినట్లు గోపరాజు తెలిపాడు.

*"గౌతమీతీర కాననమున్ దూరుచు*

*నొక్కనాడు కడుఁ బుణ్యంబైన*

*కాళేశ్వరంబున కేతెంచి*

*మహోపచారపరుడై ముక్తీశ్వరుం గొల్చి"*

*(అష్టమ - 176).*

### ధర్మపురి...

నరసింహుడు, రాముడు ఒక్కచోట ఉండటం ధర్మపురి విశేషంగా పేర్కొన్నాడు గోపరాజు-

*"హరిహరులేకంబనియెడు*

*పురాణ వచనంబు దృష్టముగ*

*నొకచోటన్*

*నరసింహుండును రామేశ్వరుడును*

*గల ధర్మపురికి వచ్చెఁ గడంకన్"*

*(177)*

అచటి గంగలో స్నానం చేస్తు 'యమునిా కుండము, బ్రహ్మకూకటిముట్టి' -బయటకు వచ్చి నరసింహస్వామిని దర్శించుకొని గ్రహిలుడు భక్తితో పూజలు చేసినాడు. "ధర్మపురీ నృసింహ నిజదైవమవౌ విభు నిన్ను జూచితి" నన్నాడు.

ఆ తరువాత సమీపంలోని రామేశ్వరుణ్ణి సేవించుకొన్నాడు. అక్కడ ప్రవహిస్తున్న గంగను ఆ దేవుని కృపారసంగా పేర్కొన్నాడు కవి. అభీష్ట సంపద లిమ్మని కోరుకొన్నాడు. ఈ ఇద్దరు దేవతలను గూర్చి కవి వ్రాసిన పద్యాలను గమనిస్తే వారు కవికి ఇష్టదేవతలని స్పష్టమవుతుంది. గ్రహిలుడు మిషగా గోపరాజు తన భక్తి ప్రపత్తులనే తెలియజేశాడు.

"నర్మద, తుంగభద్ర, యమునానది,

జాహ్నవి,  కృష్ణ, గౌతమిం

గర్మము వాయ నెన్ని జలకంబులు

దీర్చితినో దయామతీ!

ధర్మము లెన్ని చేసితినొ, దానము

లెన్ని యొనర్చినాడనో

ధర్మపురీ నృసింహ నిజదైవమవౌ విభు

నిన్నుఁ జూచితిన్"  (179)

"శాశ్వతమౌ కృపారసము చాడ్పున

ముందఱ గంగ వాఱగా

విశ్వజనీన వృత్తిఁ బృథివిం దగు

రూపున నిల్చి సంతతా

నశ్వర భుక్తిముక్తి సదనంబగు

ధర్మపురీశు డైన రా

మేశ్వరు డెల్లకాలమును నీవుత మాకు

నభీష్టసంపదల్"  (181)

ఆ తరువాత గ్రహిలుడు వేరు వేరు చోట్ల గల పుణ్యస్థలాలు చూచి తిరిగి తన దేశం పోయినట్లు కవి చెప్పినకథ.

కొఱవి గోపరాజు తన కావ్యంలో తెలంగాణ ప్రాంత విశేషాలను ఈ విధంగా వర్ణించాడు.

క
థ

# గురువింద గింజలు

ఎదుటి వ్యక్తికి చెప్పడానికే నీతులు ఉన్నాయి
అనుకునే మనుషులు....



దేవకీ దేవి

పిండి వంటలు పూర్తి కావడంతో ఊపిరి సల్పినట్లైంది చందనకు. ఇక మిగిలింది డ్రై ఫ్రూట్స్ కొనడం. పిండి వంటలు సంప్రదాయానికి  సంబంధిస్తే డ్రై ఫ్రూట్స్ ఆరోగ్య సంబంధం. భర్త అనురాగ్‌కు ఆ పని  అప్పచెప్పాలనే ఆలోచన వచ్చినా ఒకటికి పదిసార్లు చెప్పినా ఏదో ఒకటి మరిచిపోయే మేళంతో లాభం లేదని తానే బయలుదేరింది. ఆటోవాడికి షాప్ లొకేషన్ చెప్పి కూర్చుందే కాని మెదడు నిండా చెయ్యాల్సిన పనుల లిస్టులు. ప్రొద్దున్నే ఎనిమిదింటికల్లా బయలుదేరాలె. పన్నెండు లోపలే సీమంతం కార్యక్రమం పూర్తి చెయ్యమని బ్రాహ్మణుడి ఆదేశం. ఆలోచనల పరుగులలో ఆటో పరుగును గమనించనే లేదు.

"మేడమ్ గీషాపేనా?" ఆటో డ్రైవర్ మాటలు ఆమె పరధ్యానాన్ని పటాపంచలు చేసినై. చందన డ్రైవర్‌కు అమౌంట్ పే చేసి షాపులో దూరింది. కాజు.. బాదామ్.. పిస్తా.. ఆక్రోట్.. కిస్మిష్.. అంజూర్.. కర్జూర్   అన్నీ లిఫ్ట్ చేసి బాస్కెట్‌లో వేసి బిల్‌కౌంటర్‌కు చేరుకుంది. తన ముందు ఒకే ఒక కస్టమర్ ఉండటంతో తొందరగా పనైపోతుందని ఫీలైంది. కానీ క్షణంలో ఆ సంతోషం పటాపంచలైంది. బహుశా ఇద్దరు పాత పరిచయస్తులేమొ.

"మీరన్నది నిజమే. మన మీ సారి చంద్రమౌళినే గెలిపించాలె."

"కాకపోతే రోజురోజుకు విశ్వనాథం అవినీతికి హద్దు పద్దూ లేకుండా పోయింది.

ఒడ్డెక్కేదాక ఓడ మల్లన్న అన్నట్లు ఎలక్షన్ల ముందు ఇండ్ల చుట్టు తిరిగి గెలిచిన తర్వాత ముఖం చాటేసిండు."

"ఎన్నికల ముందు వాగ్దానాలన్ని గంగలో కలిపిండు"

> **"నేను బిల్ అడుగుతున్న. నేను చెల్లించాల్సింది నాలుగు వేలని నేను ముందే లెక్కేసుకున్నాను. ఆ విషయం నాకు తెలుసు." కొంచెం కోపంగానే అంది చందన. ఆమె కోపాన్ని గమనించిన యజమాని తన గుమస్తాను వివరాలు అడిగి మరో తెల్లకాగితంపై విడివిడిగా వేసి టోటల్‌గా నాలుగు వేలుగా రాసి ఆమె ముందుంచిండు. దాన్ని తేరిపార చూసిన చందన కోపం నసాళాని కంటింది. "ఇది బిల్ రిసీట్ కాదు కదా!" తిరిగి ప్రశ్నించింది చందన. "మేడమ్ జీ! బిల్ సే క్యా ఫాయిదా మిల్తే. ఫిర్ జియస్‌టి.. వగైరా...." అంటూ ఏదో చెప్పబోయిండు. షాపతను.**

"అసలు ఊళ్ళోనే లేడాయె పెద్ద మనిషి. మకాం సొంతం పట్నానికే మార్చె"

"ఎన్నుకుంది మనం. ఉంటున్నదేమొ పట్నంల."

"శంకుస్థాపనలకు తప్ప ఊరి మొకం చూసుడే లేకపాయె"

"చెరువు పూడిక తీస్తననె ముచ్చటే మరిసిండు."

"గవర్నమెంట్ కాలేజ్ సాంక్షను చేయిస్తనని ఏతులు చెప్పె"

"మొన్న మా గుమస్తా తన భూమి విషయంల మాట్లాడుదామని  పోతే మాట్లాడుడు కాదు కదా! ముఖం కూడా చూడలేదట. అసలు ఆయనెవరో తెల్వనట్లే చేసిండట."

"ఇంతకు మీ గుమస్తా ఆయనకు తెలుసా?"

"అయ్యో ! గట్లంటరు. ఓట్లప్పుడు వాళ్ళ వాడకట్టుకు తీసుకపోయి వాళ్ళందరిని కలిపిచ్చుడే కాదు, గెలిసెటందుకు మస్త్ తిప్పలు పడ్డడు."

"ఔనా! గీ నాయకులే గింత. అందుకే ఈ సారి హర్గిజ్ విశ్వనాథాన్ని గెలువనీయొద్దు."

ఇట్లా వాళ్ళిద్దరి సంభాషణ రంజుగా సాగుతున్నది. ఒకవైపు వీలైనంత తొందరగా ఇంటికి చేరుకోవాలని మనసు పీకుతున్నా వాళ్ళ మాటల్లోని సత్యం

కథ

చందనను కట్టి పడేసింది. అనాలోచితంగానే వాళ్ళ మాటల్లో లీనమైపోయింది. షాపు గోడ గడియారం ఐదు గంటల చాటింపుతో చందన ఈ లోకంలోకి వచ్చింది. ముందున్న కస్టమర్ తన పిచ్చాపాటి చాలించి బిల్ పే చేసి వెళ్ళిపోవడంతో చందన ముందుకు కదిలింది.

"మాజీ కా బిల్ బోలో" అంటూ సర్వీస్ బాయ్‌ని అడిగిండు కాష్ కౌంటర్‌లో కూర్చున్న యజమాని. ఇంత వరకు తెలుగులో అఘోరించిన ఆయన హిందీలోకి ఎందుకు జంపైండో చందనకు ఏ మాత్రం అర్థం కాలేదు. ఐనా ఆయన ఏ భాషలో అఘోరిస్తే తనకెందుకట అని తనకు తానే సర్ది చెప్పుకుంది.

"ఫోర్ థౌసెండ్" అతని సమాధానం.

"మాజీ ఆప్ కా పైసే "అంటూ అతను చెయ్యి ముందుకు చాచిండు.

"మేరీ బిల్" చందన ప్రశ్నకు సమాధానంగా నాలుగు వేలు అని

**"మేడమ్ గీషాపేనా?" ఆటో డ్రైవర్ మాటలు ఆమె పరధ్యానాన్ని పటాపంచలు చేసినై. చందన డ్రైవర్‌కు అమౌంట్ పే చేసి షాపులో దూరింది. కాజు.. బాదామ్.. పిస్తా.. ఆక్రోట్.. కిష్మిష్.. అంజూర్.. కర్జూర్ అన్నీ లిఫ్ట్ చేసి బాస్కెట్‌లో వేసి బిల్‌కౌంటర్‌కు చేరుకుంది. తన ముందు ఒకే ఒక కస్టమర్ ఉండటంతో తొందరగా పనైపోతుందని ఫీలైంది. కానీ క్షణంలో ఆ సంతోషం పటాపంచలైంది. బహుషా ఇద్దరు పాత పరిచయస్తులేమో. "మీరన్నది నిజమే. మన మీ సారి చంద్రమౌళినే గెలిపించాలె." "కాకపోతే రోజురోజుకు విశ్వనాథం అవినీతికి హద్దు పద్దూ లేకుండా పోయింది.**

ఫిగర్స్‌లో రాసిన ఓ కాగితం ఆమె ముందుంచిండు యజమాని. నిర్ఘాంతపోవడం చందన వంతైంది. అది కేవలం నాలుగు వేలు అని రాసిన ఓ కాగితం ముక్కని ఆయన బిల్ అంటున్నడు.

"నేను బిల్ అడుగుతున్న. నేను చెల్లించాల్సింది నాలుగు వేలని నేను ముందే లెక్కేసుకున్నాను. ఆ విషయం నాకు తెలుసు." కొంచెం కోపంగానే అంది చందన. ఆమె కోపాన్ని గమనించిన యజమాని తన గుమస్తాను వివరాలు అడిగి మరో తెల్లకాగితంపై విడివిడిగా వేసి టోటల్‌గా నాలుగు వేలుగా రాసి ఆమె ముందుంచిండు. దాన్ని తేరిపార చూసిన చందన కోపం నసాళాని కంటింది.

"ఇది బిల్ రసీట్ కాదు కదా!" తిరిగి ప్రశ్నించింది చందన.

"మేడమ్ జీ! బిల్ సే క్యా ఫాయిదా మిల్తే. ఫిర్ జియస్‌టి.. వగైరా...." అంటూ ఏదో చెప్పబోయిండు. షాపతను.

"అంతసేపు మీ స్నేహితుడితో రాజకీయ నాయకుల నిబద్ధత అవినీతులపై ఏకధాటిగా మాట్లాడిన మీరు టాక్స్ ఎగ్గొట్టడం నేరం కాదా! నేను రాజకీయ నాయకులను సమర్థించడం లేదు. కానీ మరి మీరు చేస్తున్న పని? ఏదో నేనడిగినందుకు ఓ కాగితం ముక్క నా మొహాన పడేసిన్రు. అడగకపోతే అదీ లేదు. ఎదుటి వాళ్ళను అడిగే ముందు మనం నిజాయితీతో నడుచుకోవాలె. అది గుర్తు పెట్టుకోండి. ఫస్ట్ నాకు కరెక్ట్ బిల్ ఇవ్వండి కొంచెం ఘాటుగానే అడిగింది."

దాంతో యజమానికి బిల్ ఇవ్వక తప్పలేదు. బిల్ తీసుకొని చందన విస విసా ఇంటి దారి పట్టింది. కోపంతోనో శాంతించో ఆమె బిడ్డ సీమంతం సవ్యంగానే జరిగినా షాపు యజమాని తన వ్యాపారం తను తిట్టిన రాజకీయ నాయకుల అండదండలతోనే జీరో వ్యాపారం చేస్తూ దేశ అవినీతులను దుయ్యబడుతూ ఎంతెంత దూరం ముందుకు సాగిండో....?



సమాజం

# మనిషి దు:ఖాగ్ని 'యక్షగానం'

**బహుజన జీవన ప్రతిబింబం యక్షగాన కథా సంపుటం...**



డా॥ వెల్దండి శ్రీధర్

గడిచిన ఏడు దశాబ్దాలలో ఎన్నో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలు మనిషిని అతలాకుతలం చేశాయి. కాలం బతుకు పొడుగూత వేసిన ముద్రలెన్నింటినో ఒడిసి పట్టుకొని ఎంతో మంది కథకులు కథలుగా మలిచారు. అవన్నీ మనిషి కళాచరిత్రగా మిగిలిపోయాయి. జీవితం అడుగు నుండి సారవంతమైన మట్టిని తీసుకొచ్చి మానవుని బతుకు పయనాన్ని సజీవ చిత్రాలుగా అక్షరీకరించిన రచయిత  దేవులపల్లి కృష్ణమూర్తి. దానికి నికషోపలం అనదగ్గ రచన 'యక్షగానం' కథా సంపుటి.

ఇందులోని రెండు పదుల కథలు ఒక్కోటి ఒక్కో గుయెర్నికా చిత్రం. జీవితం లోలోపలికి వెళ్లి మనిషి అడుగు జాడల్ని అక్షరాల్లోకి తర్జుమా చేసిన కథలు. అందుకే ఏ కథలోనైనా మట్టి మనుషులు తాకుతారు. వారి జీవిత సంక్షోభం, సంఘర్షణ, సంక్లిష్టత, దు:ఖాగ్ని పాఠకుల్ని కథలో ఉండనీయక ఆయా పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసేలా చేస్తాయి. అప్పుడు రచయిత చిత్రించిన ముడి జీవితం యొక్క 'సెగ' మన గుండెల్ని ఆవరిస్తుంది.  ఏ కథా ఏదో ఒక జీవిత శకలం చుట్టూ అల్లిన ఏక వర్ణ చిత్రం కాదు. ఒక జీవితాన్ని సొంతం కథలో ఇమిడ్చి  చెప్పిన సింగిడి. వాస్తవ జీవితం నుండి ఎన్నో అనుభవ శకలాల్ని తెంపుకొచ్చి వాటిని యధాతథంగా అంతే వైవిధ్యంతో, వైరుధ్యంతో కాగితం మీద పరిచిన కథలు. సమాజ చలన సూత్రాలను, మనుషులను ఎంతో లోతుగా చదివిన అనుభవం ప్రతి కథలో తొంగి చూస్తుంది.

నిజ జీవితానికి ఏ మాత్రం రంగులు పూయకుండా, నిరలంకారంగా కథలు రాసిన వారు చాలా అరుదు. ఎందుకంటే ఒట్టి కంకర రాయి శిల్పం కాదని మన అపోహ. కాని ఎన్నో రూప రహిత రాళ్లను ఒక్క దగ్గర పోసి వాటిలో కళాత్మకతను వెతుక్కునేలా రాశాడు దేవులపల్లి కృష్ణమూర్తి. జీవితమంత విశాలత, విస్తృతి అన్ని కథల్లో కనిపిస్తుంది. మన చుట్టూ ఉన్న, మనకు బాగా పరిచయం ఉన్న వ్యక్తులే కథల్లో పాత్రలుగా ఒదిగిపోయారు. సన్నివేశ కల్పన కోసమో, సంభాషణల కోసమో, అనవసరపు మలుపుల కోసమో, కల్పనల కోసమో రచయిత ప్రాకులాడడు. జీవితాన్ని సాదాసీదాగా చెప్పుకుంటూ పోతాడు. కథాంగాలన్నీ వాటికవే అమరిపోతాయి. జీవితం చాలా తడితడిగా మన మనసును ఒరుసుకుంటూ పయనిస్తుంది. ఏడు దశాబ్దాల పాటు అనేక జీవితాల్ని చాలా దగ్గరగా పరిశీలించి పరిశీలించి గుండె లోతుల్లోకి ఇంకించుకొని, విశేషమైన అనుభవాన్ని రంగరించి రాసిన కథలు కాబట్టి వీటికి జవజీవాలు, రక్త మాంసాలు సహజంగా అంటుకున్నట్టున్నాయి. చాలా మంది రచయితలు జీవితాన్ని పొడిపొడిగా వ్యాఖ్యానిస్తూ పోతుంటారు. ఏదో కృత్రిమత్వం, ఏదో అసహజత్వం, ఏదో అంటిముట్టనితనం వాళ్ల వాక్యాల్లో పొడసూపుతుంది. కాని దేవులపల్లి కృష్ణమూర్తి కథల్లో మనకు దివిటీ పెట్టి వెతికినా జీవితాన్ని విడిచి ఒక్క వాక్యం కూడా దొర్లినట్టు కనిపించదు. ప్రతి కథ తాను అనుభవించి, పలవరించి రాసిందే. నల్గొండ జిల్లా కేంద్రంగా జీవితాల్లో, పరిస్థితుల్లో, ఘర్షణల్లో వచ్చిన మార్పులను చాలా లోతుగా పరిశీలించి రాసిన కథలివి. ఎక్కువ కథల్లో బహుజన జీవితాలే చిత్రింపబడ్డాయి.

"మా వూరికి వాస్తు పిచ్చిపట్టింది. ఇండ్లను మార్పు చేయబట్టింద్రు. దానితో మా ఇంటి ముందున్న ఇంటోల్లు దర్వాజను వెనుక బజారుకు మార్చింద్రు. మా పక్కున్న ఇల్లు బాగలేదని పశువుల కొట్టంగ మార్చింద్రు. దీనితో తలుపు తీస్తే మనిషే కనిపించకుంటయ్యిండు. బొగ్గు వ్యాపారం ఊపందుకుంది. చెట్లను కొట్టి బొగ్గు బట్టీలు పెడుతుంద్రు. ఉర్లుగొండ గుట్టకున్న చెట్లన్నీ ఒక్కటొక్కటిగా అన్ని మాయమైపోయినయి. గత పదేండ్ల నుండి జర్గుతుందీ తంతు." అని ఊరు ఎలా

మార్పుకు గురవుతూ పోతుందో చెప్పిండు.

ఈ సంపుటిలోని చాలా కథలు భూమి చుట్టు, వ్యవసాయం చుట్టే తిరుగుతాయి. ఊరు తెర్లయిన తీరు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నత, నమ్మకంగా మోసం చేయడం, నాగార్జునసాగర్ నీళ్ల ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పు, కుల వృత్తుల విధ్వంసం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, పండు టాకును కొడుకులు వంతు లేసుకొని సాకటం, పల్లె మర్యాదలు, ఆశల వెంట పరుగులు పెట్టే పురుగులు, చిత్రకళ మీది మమకారం, భారమైన బతుకుపోరు, బాధ్యతలేని యువత, మమ్మల్ని తీసుకు పోవడాన్ని దేవుడు మర్చిపోయిండేమోనని బాధ పడే వృద్ధులు, నిరుద్యోగం కారణంగా ప్రేమించిన యువతిని వదులుకోవడం, మోడును కూడా చిగురింపజేసే శ్రీశైలం, ఆయకట్టు భూముల్ని అగ్గువకు కొని తెలంగాణ మీద చాపకింది నీరులా పెత్తనం చెలాయించే ఆంధ్రుల తీరు, కొడుకును కాపాడుకోలేకపోయిన మోతీబాయి, తోడులేని వృద్ధురాలి కథ, జాతర నేపథ్యంలో గ్రామీణ జీవితం, పుస్తకాల

> **ర**చయితకున్న విశేషమైన లోకానుభవం, చిత్రలేఖన కళ మీది ఇష్టం, జానపద కళల మీది సాధికారికత అన్నీ ఇందులో చిత్రింపబడ్డాయి. కథల శీర్షికలన్నింటినీ తొలగిస్తే ఈ సంకలనం ఒక పెద్ద సాంఘిక నవలగా తోస్తుంది. పాత్రలు, సన్నివేశాలు, సందర్భాలు వేరువేరే కావొచ్చు కాని సారాంశంలో రచయిత చెప్పే కథంతా ఒక్కటేననిపిస్తుంది. ఎందుకంటే అన్ని కథల్లో మానవ సంబంధాల డొల్లతనం, మోసకారితనం, జీవిత ఘర్షణ సమానంగానే కనిపిస్తాయి.

మీది మక్కువ.. ఇలా ఎన్నో వస్తువులు ఈ కథలకు ఆలంబనగా నిలిచాయి.

గడిచిపోయిన జీవితాన్ని కాలానుగుణంగా తిరిగి పేర్చుకుంటూ పోవడం అంత సులభం కాదు. సమాజంతో పాటు సామూహికంగా జీవిస్తూనే మనసులో ఒక మూలలో రికార్డు చేస్తూ పోవాలి. మళ్లీ అవసర మున్నపుడు ఆయా సన్నివేశాలను, పాత్రలను ముందటేసుకోవాలి. సజీవంగా ప్రాణం పోయాలి. సాధారణంగా కవిగాని, రచయితగాని తన సమకాలీన సమాజం కంటే ఒక్కడుగు ముందుంటాడు. కాని దేవులపల్లి కృష్ణమూర్తి కథలు అలా ఉండవు. మనతో పాటు కలిసి నడుస్తూ, మనతో కలిసి జీవిస్తూ, మనలో ఒకడిగానే ఉంటూ కథ చెప్తాడు. చాలా కథలు మౌఖిక కథలుగానే తోస్తాయి తప్ప లిఖిత కథలుగా కనిపించవు.

జీవితం ఎన్ని పొరలు పొరలుగా ఉంటుందో, ఎన్ని అలలు అలలుగా ఉంటుందో అంతే మౌలికంగా చిత్రిస్తారు ప్రతి కథను. కథ చెప్పటంలో కూడా ఏ తిరకాసూ ఉండదు. నీటి కాలువ పొలంలో కల్సిపోయినంత మామూలుగా, చాలా సరళ శిల్పంలో నిరాడంబరంగా చెప్పిన కథలు. కథనం, సంభాషణలు రెండూ స్వచ్ఛమైన తెలంగాణ తెలుగులో సాగడం వలన కథ నేల విడిచి సాము చేయకుండా చాలా సహజంగా సాగిపోతుంది. సందర్భానుసారంగా చెప్పిన సామెతలు, జాతీయాలు, నుడికారాలు కూడా మరింత సహజత్వాన్ని కలిగించాయి.

ఏ కథలోనైనా రచయిత ఎక్కడా కనిపించడు. జీవితం మారుమూలల్లో దాగిన మార్మికతనో, మానవీయతనో చెప్పుకుంటూ పోతాడు రచయిత. కథ చదువుతున్నట్టు కాకుండా ఆ జీవితాన్ని మనమే అనుభవిస్తున్నట్టుగా అనుభూతి చెందుతాం. ఈ శైలి వల్లనే ప్రతి కథను విడవకుండా చదివేస్తాం. ఎవరి కోసమో, శైలీ, శిల్పాల కోసమో కథ రాయడు రచయిత. తాను చెప్పాలనుకున్న పాయింట్ చుట్టూ కథను కూర్చుకుంటూ పోతాడు. ఈ క్రమంలో ఎంతో జీవితం పొందుపరచబడుతుంది. ముఖ్యంగా రచయిత రెవెన్యూ ఆఫీసర్ కావడం మూలంగా కథ ఎవరూ చెప్పని కోణంలో తీర్చిదిద్దబడుతుంది. చాలా వరకు నోస్టాల్జియా విశేషాలే అయినప్పటికి మనకు ఒక విషాదాంత షాక్ ట్రీట్‌మెంట్‌నే మిగులుస్తాయి.

ప్రతి కథ ఒక సత్యజిత్‌రే సినిమాను తలపిస్తుంది. నిశ్శబ్దంగా లోలోపల కుమిలిపోతున్న ఊరు, గాయాలపాలై తనలో తాను మదనపడుతున్న పాత్రలు, ఎంతో నొప్పితో మాట్లాడే మాటలు, గొంతు దాటి బయట పడని దు:ఖం...అన్నీ మనల్ని ఎంతో గాఢంగా కదిలిస్తాయి. దేవులపల్లి కృష్ణమూర్తి కథల్లోని స్త్రీ పాత్రల్ని ప్రత్యేకించి పేర్కొనాలి. మనోరమ, పార్వతమ్మ, ముదుసలి అవ్వ, సుజాత, మోతీబాయి, వదిన పాత్ర, రచయిత భార్య పాత్ర, విమల, కాదంబరి... అన్నీ మోసగింపబడ్డ పాత్రలు. జీవితాన్ని నలుపు, తెలుపు ఫ్రేముల్లో చూపించిన పాత్రలు.

ఈ కథా సంపుటిలో పేర్కొనాల్సిన కథలు, లేదా తళతళ మెరిసే కథలు 'వలసపక్షులు', 'మృత్యుంజయుడు', 'గోడకున్న బొమ్మ', 'బాల్కని'. తెలంగాణ, ఆంధ్రరాష్ట్రం కలిసి 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడిన తరువాత ఆంధ్ర ప్రాంత పెట్టుబడిదారులు తెలంగాణకు వలస వచ్చి ఎలా ఇక్కడి సారవంతమైన భూములను కైవశం చేసుకున్నదీ వివరించే కథ 'వలసపక్షులు'. 'మృత్యుంజయుడు', గోడకున్న బొమ్మ' కథలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని చిత్రించిన కథలు. 'బాల్కని' కథ శిల్ప పరంగా చాలా మంచి కథ. మిగిలిన కథలన్నీ సాధారణ వస్తువుతో ఉన్నా వాటిలో కూడా ఎన్నో జీవిత కోణాలు ఆవిష్కరింపబడ్డాయి. 'బాల్కని' కథలో మినహా అన్ని కథల్లో నేపథ్యంలో గ్రామీణ జీవిత సంగీతం వినిపిస్తూ ఉంటుంది.

ప్రతి కథ నిస్సంకోచమైన ఎత్తుగడతో మొదలై, నది, సముద్రంలో కలిసేటప్పటి

సమాజం

నెమ్మదితనంతో కొనసాగి, పూవు నేల రాలినంత సహజంగా ముగిసిపోతుంది. గ్రామంలోని అన్ని లేయర్లను కథలోకి తీసుకొచ్చి ఒక సజీవ కావ్యంలా తీర్చిదిద్దుతాడు రచయిత. పాత్రల మధ్య అనురాగం, కోపతాపాలు, తడిగుడ్డతో గొంతు కోసే లక్షణం అన్నీ చాలా సహజంగా చిత్రించబడ్డాయి. ప్రతి కథ ఎంతో జీవిత గాంభీర్యతను, విలువలను తనలో దాచుకున్న కథే.

రచయితకున్న విశేషమైన లోకానుభవం, చిత్రలేఖన కళ మీది ఇష్టం, జానపద కళల మీది సాధికారికత అన్ని ఇందులో చిత్రింపబడ్డాయి. కథల శీర్షికలన్నింటినీ తొలగిస్తే ఈ సంకలనం ఒక పెద్ద సాంఘిక నవలగా తోస్తుంది. పాత్రలు, సన్నివేశాలు, సందర్భాలు వేరువేరే కావొచ్చు కాని సారాంశంలో రచయిత చెప్పే కథంతా ఒక్కటేననిపిస్తుంది. ఎందుకంటే అన్ని కథల్లో మానవ సంబంధాల డొల్లతనం, మోసకారితనం, జీవిత ఘర్షణ సమానంగానే కనిపిస్తాయి. ఒకప్పటి గ్రామాలు క్లోనింగ్ చేసినట్లుగా కథల్లో మళ్లీ జీవం పోసుకున్నాయి.

"ఆటన్నా, పాటన్నా
అంతా బొమ్మలాటన్నా
ఆడి పాడి, అలసి సొలసి
అవని వీడి పోయాడన్నా!"

అని ఎంతో తాత్త్వికతను కూడా బోధిస్తాయి. సాహిత్యం మనిషిలో మార్పును తీసుకొస్తుందో లేదో కాని ఇందులోని కథలు మాత్రం కాస్తంత జాగరూకత వైపు, నాణ్యమైన జీవితం వైపు అడుగులు వేయిస్తాయి.

కవిత



# ఏదీ మొదలు కాదు...
# ఏదీ ఆఖరు కాదు

**కాంచనపల్లి రాజేంద్ర రాజు**

పోగేసుకోవటం
పోగొట్టుకోవటం

అందుకోవటం
వదులుకోవటం

అనుకున్నది సాధించడం
సాధించిందే సమస్య కావటం

సంతోషాన్ని ఇచ్చిన సహవాసం
సామరస్యంగా మోసం చేయటం

అమ్మతనాన్ని ఇచ్చిన నమ్మకం
అర్ధాంతరంగా అదృశ్యమవటం

అన్నీ... ఇవన్నీ....

జీవితంలో వెంటాడే నీడలు
జీవితాంతం వేటాడే గాయాలు

నీడ లేకుండా మనిషి లేడు
గాయం కాకుండా గతం లేదు

వర్తమానం ఎప్పుడూ....
వలయమే

ఎక్కడ మొదలు పెట్టావో
అక్కడే ముగుస్తుంది.

భవిష్యత్తు ఎప్పుడూ
రంగురంగులలో కనిపించే
గతం అందించిన
నలుపు-తెలుపు చిత్రమే

ఏదీ మొదలు కాదు
ఏదీ ఆఖరు కాదు
అంతా కొనసాగింపే...



కవిత

# అతడూ అతని పని

నూటెంకి రవీంద్ర



ఊళ్లె ఏ కులపోల్ల ఇంట్ల
ఎవల తలాపున దీప మెలిగినా
మొదటి పిలుపు అతనికే

అక్కడి వాతావరణమంతా
ఏ రిక్టర్ స్కేల్ పైనా నమోదు చేయలేని
ఒక ఉద్విగ్నపు దుఃఖోద్వేగంతో ప్రకంపించి పోతంది
ఆరిపోయిన దీపాన్ని తలచుకొని శోకం పెడుతంది
గుండెలు బాదుకుంటూ ఆ యిల్లు

ఆత్మీయులు వచ్చినప్పుడల్లా ఆజ్యం పోసినట్టై
తారాస్థాయికి చేరుతున్న వలపోత
సునామీ కెరటాల్లా ఎగసి ఎగసి విరిగిపడుతంది
ఓ మూలన రాజేసిన కర్రమొద్దు కాలి కాలి చివరికచ్చి
ఇగ సాగనంపె యాల్లైందని పొగబెడుతంది

అప్పుడు వచ్చాడతడు
తన డప్పుల పరివారం వెంటేసుకొని
కొన్ని కట్టెలూ తాటాకులూ  పట్టుకొని
చెమటస్నాన మాడిన నల్లని మట్టి శరీరంతో

ఆలస్యమైందేమని అరిచే అదిలింపుల మధ్య
వచ్చీ రావడంతోనే పనిని మొదలు పెట్టి
ఏడుకట్ల సవారీని సిద్ధం చేశాడతడు
డప్పు చప్పుళ్ళ నేపథ్య హోరులో
తనదైన ఓర్పుతో మరింత నేర్పుతో

పల్లకీ నెక్కని దేహముండవచ్చు
పడవ నెక్కని దేహముండవచ్చు
పాడె నెక్కని దేహముంటుందా?

ఒక నిష్కామ యోగిని గమనిస్తున్నాను
చివరిపాన్పులు ఎన్ని తయారు చేసివుంటాడితడు!?
ముఖం మీది ముడతలు లెక్క చెబుతాయా?
ఆరూ నాలుగూ అయిదూ కొలతలతో
ఎన్ని బొందలు తవ్వి ఉంటాడితడు?
కాయలు గాసిన అరచేతుల పొరలను
తరచి చూస్తే తెలుస్తుందా?
మృత పశువుల చర్మాన్ని ఒలిచి
డప్పుగా చెప్పుగా మలిచిన రసాయనిక చేతులవి

గొల్లులూ గోవిందాల నడుమ శవయాత్ర మొదలైంది
లయబద్ధంగా ఆడుతున్న డప్పుల పాదాలూ
బాణసంచా కాల్పుల మధ్య మారుతున్న భుజాల మీద
వరదలో తెప్పలా తేలిపోతంది పార్థివ దేహం

ఎవరో ఔత్సాహికులు
పదీ ఇరువై యాభై వందా నోట్లను పొట్లం చుట్టి
ఇసుక కుప్పల నిలబెడుతున్నారు
డప్పు వాయిస్తూనే కంటి రెప్పలతో ఒడుపుగా పట్టుకొని
ఓ యువకుడు తీసిస్తుంటే
జేబులో పెట్టుకుంటున్నాడీ వృద్ధుడు దరువేస్తూనే
పొడిబారిన అతడి పెదాల మీద ఓ చిరునవ్వు విరిసింది
అతని యౌవ్వన రోజులు గుర్తొచ్చి వుంటాయా!?

ఏరుకున్న చిల్లర జ్ఞాపకాల్లో గల్లుమని ఉంటుందా?
ఆకుపచ్చని సంతకం చేసే ఏ వాడబిడ్డో
గ్రీన్ కార్డ్ హోల్డరైన వాడి బిడ్డో మదిల మెదిలుంటారా?
నెరిసిన అతని వెంట్రుకలు ఏ వెండి వెలుగులకు ఆనవాళ్ళో?

ఇతని లాంటి మరొకతనే  రేపెప్పుడో
నాకూ ఓ ఆఖరిమంచం సిద్ధం చేస్తాడా? యేమో!

ఊళ్లె ఎవలింట్ల ఏ శుభకార్యం జరిగినా
పిలువని పేరంటానికి వచ్చి
అల్లంత దూరాన ఓ పక్కన గొంతుక్కూర్చొని
ఇంత ఎంగిలిపడి పోయే అభ్యాగతుడైన అతిథి అతడే!

ము
ఖా
ము
ఖి

# రచనా వ్యాసంగం ఓ చెలమ లాంటిది...

**కవి ఏకాంతం కోరుకుంటాడు కానీ, ఒంటరి తనం కాదు... అంటున్న కవి, రాజేందర్ జింబోతో మామిడాల ముఖాముఖి...**



**మామిడాల రమేష్ బాబు**

**'జింబో' ఈ కలం పేరు వెనకాల కథేమిటి?**

(చిన్నగా నవ్వి) ఈ ప్రశ్న ప్రతి ఇంటర్వ్యూలో వస్తూ వుంటుంది. ఎందుకంటే జింబో అన్న పేరు చాలా మందికి ఆశ్చర్యంగా అన్పిస్తూ వుంటుంది.

చిన్నప్పుడు చాలా ఎత్తుగా వుండేవాడిని. భారీ శరీరం. పెద్ద పర్సనాలిటీ. మా రఘుపతన్న అప్పుడు హైదరాబాద్‌లో యం.బి.బి.ఎస్ చదువుతూ వుండేవాడు. 1962 ప్రాంతంలో అనుకుంటా. సరదాగా నన్ను జింబో అని ఇంట్లో పిలిచేవాడు. అట్లా ముద్దుగా ఇంట్లో వాళ్ళు కూడా పిలవడం ప్రారంభించారు. ఇంట్లో వాళ్ళతో బాటూ స్నేహితులూ, మా వూరి వాళ్ళు అలా పిలిచేవాళ్ళు. నేను ఏడవ తరగతికి వచ్చిన తరువాత అందరితో చెప్పి అలా పిలవడం మాన్పించాను. 62 ప్రాంతంలో జింబో అని జింబో నగర ప్రవేశం అన్న సినిమాలు వచ్చాయి. అందులోని హీరోది కూడా చాలా పెద్ద పర్సనాలిటీ. ఆ సినిమాల ప్రభావం వల్ల మా అన్నయ్య అలా పిలిచాడని అంటారు.

జింబో పేరుతో డిగ్రీ చదువు తున్నప్పుడు ఓ కథ రాసి ప్రగతి వార పత్రికకు పంపించాను. అది వెంటనే అచ్చయ్యింది. ఓ కవిత ఆంధ్రజ్యోతికి పంపిస్తే అది అచ్చయ్యింది. ఆ విధంగా సాహిత్యంలో జింబో పేరు ప్రాచుర్యం పొందింది. రాజేందర్ పేరుతో రాయండి అని తరచూ ప్రముఖ కవి జ్వాలాముఖి అనేవాడు. అట్లాగే కవి ఇస్మాయిల్ నా రెండక్షరాల కవితా సంపుటి చదివి ఇక పేరు జింబో పేరును వదిలేసి రాజేందర్ పేరుతో కవిత్వం రాయండీ అని ఉత్తరం రాశారు. ఆ ఉత్తరం ఇప్పటికీ నా దగ్గర వుంది. నేను న్యాయమూర్తి అయిన తరువాత చాలా మందికి జింబో పేరుతో పలకరించడం ఇబ్బందిగా ఫీలయినారు. అది గమనించి రాజేందర్ జింబో అని మంగారి రాజేందర్ అని రచనలు చేయడం మొదలుపెట్టాను. కొంతమంది సన్నిహితులు జింబో పేరుతో రచనలు కొనసాగించండి అని కూడా అంటూ వుంటారు.




మా వేములవాడ కథలు అన్న కథల సీరిస్ రాజేందర్ జింబో పేరుతో నవ్య వారపత్రికలో ఓ ఇరువై అయిదు వారాల పాటు రాశాను. ఆ తరువాత ఎమెస్కో ప్రచురించిన కథల పుస్తకం కూడా రాజేందర్ జింబో పేరుతో వచ్చింది. ఇప్పుడు రాజేందర్ జింబో అని మంగారి రాజేందర్ అని కథలూ, కవిత్వం, వ్యాసాలు రాస్తున్నాను. ఇదీ జింబో పేరు వెనుక వున్న కథా కమామిషూ.

**రచయితగా మిమ్మల్ని ప్రభావితం చేసినవారు ఎవరు?**

మా ఇంట్లో ఓ చిన్నపాటి లైబ్రరీ వుండేది. మా రఘుపతన్నకి సాహిత్యం అంటే చాలా ఇష్టం. శ్రీశ్రీ, సినారె, దాశరథి, కాళోజీ, బుచ్చిబాబు, చలం పుస్తకాలు ఎన్నో మా ఇంట్లో వుండేవి. నా చిన్నప్పుడు మా అమ్మని, మా తాతని కథలు చెప్పమని వేధించేవాడిని. కథలు వినడం, కథలూ, కవిత్వాలూ చదవడం వల్ల సాహిత్యం అంటే ఎక్కువ ఇష్టం ఏర్పడింది.

ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు రాకపోవడం వల్ల ఎం.బి.బి.ఎస్. ఎంట్రన్స్ రాయలేకపోయాను. నిజానికి సైన్సు నాకు పడని సబ్జెక్టు. మా అన్నయ్య ఈ విషయం గమనించక నన్ను డాక్టర్

చదివించాలని నన్ను బి.యస్సీలో చేర్పించాడు. సైన్స్ నాకిష్టం లేదని చెప్పే పరిస్థితి అప్పుడు లేదు. అలా బి.యస్సీలో చేరాను. కెమిస్ట్రీ అస్సలు ఇష్టం వుండేది కాదు. ఆ క్లాస్ ఎగ్గొట్టి మా కరీంనగర్ డిగ్రీ కాలేజీ లైబ్రరీలోని సాహిత్యమంతా చదివేశాను. మునిమాణిక్యం నుంచి అందరినీ చదివేశాను. అంపశయ్య నవీన్ నీ, దాశరథి రంగాచార్యను చదివేశాను.

నేను చదివిన సాహిత్యం, నేను విన్న కథలు, కవి సమ్మేళనాలు నన్ను ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. ప్రత్యక్షంగా వ్యక్తులు ఎవరూ ప్రభావితం చేయలేదు. అదే విధంగా పండుగలప్పుడు రేడియోల్లో ప్రసారం అయ్యే కవి సమ్మేళనాలని ఆసక్తిగా వినేవాడిని. లెక్క లేనన్ని పుస్తకాలని అప్పుడు చదివాను. బహుశ అవి నన్ను కథల వైపు కవిత్వం వైపు నడిపించాయని చెప్పవచ్చు.

**కథ కన్నా కవిత్వమే మిన్న అని మీరు ఒక సందర్భంలో అన్నారు. కారణం ఏమిటి?**

కథ కన్నా కవిత్వమే మిన్న అని నేను అనలేదు. 23.7.2007 రోజున కేంద్ర సాహిత్య అకాడమీ వాళ్ళు నాతో 'కథా సంచిక' కార్యక్రమాన్ని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఆ కార్యక్రమంలో చాలా మంది కవులు, రచయితలు పాల్గొన్నారు. కథా నేపథ్యం తరువాత రెండు కథలు చదివాను. ఆ తరువాత ప్రశ్నలూ, జవాబులూ నడిచాయి. మిత్రుడు కథకుడు కాసుల ప్రతాపరెడ్డి నన్ను ఓ ప్రశ్న అడిగారు. మీరు కవిత్వం, కథా ప్రక్రియల్లో రచనలు చేశారు కదా. మీరు దేనికి ప్రాధాన్యం ఇస్తారు. ఏది కష్టమైనది? ఏది మిన్న. ఈ ప్రశ్నకి జవాబుగా నా దృష్టిలో రెండూ గొప్పవే. కథ రాయాలంటే శ్రమతో కూడుకున్న పని. ఎక్కువ సమయం తీసుకుంటుంది. కవిత్వం అలా కాదు. వెంటనే రాసెయ్యవచ్చని చెప్పాను.

మనిషి జీవితం కవిత్వంతో అంటే పాటతో మొదలవుతుంది. అమ్మ పాట అందరమూ వింటాం. కొంచెం పెద్దగా అయిన తరువాత కథలు ఇష్టపడతాం. కథలు చెప్పమని పెద్దవాళ్ళ వెంట పడతాం. కథా స్థానం కథదే. కవిత్వం స్థానం కవిత్వానిదేనని చెప్పాను. ఇదే అభిప్రాయంతో ఇప్పుడూ వున్నాను.




**జింబో కథలు, రూల్ ఆఫ్ లా కథలు రాశారు. అవి కోర్సులకై నేర న్యాయ వ్యవస్థకి సంబంధించిన కథలు అంటే సీరియస్ కథలు. వీటికి భిన్నంగా మీ వూరు వేములవాడ నేపథ్యంలో వేములవాడ కథలు రాశారు. రెండూ పూర్తిగా భిన్నమైనవి. కథా రచయితగా మీరు ఏ అంశాలకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.?**

నిజమే! మీరన్నది చాలా వాస్తవం. జింబో కథలు రూల్ ఆఫ్ లా కథలు, నేర న్యాయవ్యవస్థకి సంబంధించిన కథలు నేను న్యాయవాదిగా అదే విధంగా న్యాయమూర్తి గా చూసిన జీవితం గురించి, రాసిన కథలు అవి. పోలీస్ స్టేషన్ లో, కోర్టు ల్లో నలిగిపోతున్న జీవితాలని ఈ కథల్లో రాశాను. నిన్న మొన్న, నేడు రేపు, జమానత్, ఫైలు, శ్వాస లాంటి కథలు చదివితే నాకే ఆశ్చర్యం వేస్తూ వుంటుంది. న్యాయమూర్తి గా పనిచేస్తూ, ఈ కథలు ఎలా రాశానని ఇప్పుడు అన్పిస్తుంది. చాలా మంది ఈ ప్రశ్న లని వేశారు.

'జింబో కథలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ, న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి రెండు మాటలు అన్నారు. లోహియా మాదిరిగా రాజేందర్, ఆయన మిత్రుడు క్రిష్ణారావులు సమాజ శ్రేయస్సు కోసం అలజడులు సృష్టిస్తూ వున్నారు. వీళ్లని చూస్తే నాకే భయం అవుతుంది అని అన్నారు. ఆ పుస్తకానికి వెనుక మాట రాస్తూ, పేద ప్రజల పట్ల జరుగుతున్న అన్యాయం, హింసకు వ్యతిరేకంగా స్పందించి రాసిన కథలు జింబో కథలు.

న్యాయమూర్తి చలమేశ్వర్ రూల్ ఆఫ్ లా కథల గురించి ఇలా అన్నారు. 'ఈ కథలు సందేశాలనివ్వవు. సందేహాలు కలుగ చేస్తాయి. సందేహాల నుండి ఆలోచనలు పుడతాయి. ఆలోచన మనిషి ప్రగతికి పునాది. వేములవాడ కథలు మా వూరి కథలే కాదు. అందరి పూర్ల కథలు. జింబో కథలకి, రూల్ ఆఫ్ లా కథలకి పూర్తిగా భిన్నమైనవి. ఇందులో మా వూరు, మా ఇల్లు, మా బాపు, మా అమ్మ, మా వూరు ప్రదేశాలు, మనుషులు, నా బాల్యం కన్పిస్తాయి.

నా కథలు అన్నీ నా అనుభవంలోంచి వచ్చినవే. మనిషి జీవితంలో ఎన్నో కోణాల వుంటాయి. నేను న్యాయవాదిని, ఆ తరువాత న్యాయమూర్తిని. వీటన్నింటితో బాటు ఓ మామూలు వ్యక్తిని. సెంటిమెంట్లు, వూరు, అమ్మ భాషల మీద భావోద్వేగం వున్న రచయితను. అందుకని నా కథలో అన్నీ కన్పిస్తాయి. ఈ కథలతో బాటూ జీవితం మీద ప్రేమ, నమ్మకం, ఆత్మవిశ్వాసం కలిగి వుండటాని కోసం కూడా కథలు రాశాను. అవి 'ఓ చిన్నమాట' అన్న పేరుతో పుస్తకంగా వచ్చింది. ఎమెస్కో ఆ పుస్తకాన్ని ప్రచురించింది. అలాంటి కథలని అనువాదం కూడా చేశాను. అది 'కథలకి ఆవల' పేరుతో వచ్చింది. నా అనుభవాలకే నేను ప్రాధాన్యం ఇస్తాను. నా అనుభవాల్లో మరెంతో మంది అనుభవాలు కూడా వుంటాయి.

**రావిశాస్త్రి కోర్టు జీవితాలని తన కథల్లో చూపిస్తే, మీరు కథల్లోనే కాదు, కవిత్వాల్లో**

**కూడా చూపించారు. మీ 'హాజీర్ హై' కి ప్రేరణ ఏమిటి?**

'హాజీర్ హై' ఓ విలక్షణమైన కవిత్వం. ప్రసిద్ధ కవి గోపి మాటల్లో చెప్పాలంటే జింబో మాత్రమే రాయగల కవిత్వం. న్యాయవాదిగా నేను కరీంనగర్ జిల్లాలో, సిరిసిల్లలో ప్రాక్టీసు చేశాను. అప్పుడు కోర్టుల్లో జరుగుతున్న విషయాలని, కవిత్వీకరించాను. 'మూడు తలల రాజ సింహం' అన్న కవిత 1986లో రాశాను. అది ఉదయం దినపత్రికలో ప్రముఖంగా ప్రచురించారు. అందులో కొన్ని వాక్యాలు ఇప్పటికీ రిలవెంట్ (Relevant)గా వుండటం బాధ కలిగించే విషయం

'మూడు తలల్తో రాజసింహం
కుర్చీ మీద నిఘా
వేసుక్కూర్చుంటుంది'

పరిస్థితులు ఇప్పటికీ ఏమీ మారకపోవడం బాధాకరం. న్యాయవ్యవస్థ పరిస్థితులు చూస్తే, జాలేస్తుంది. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా నేను చూసిన, నేను విన్న ఆక్రందనలు, ప్రశ్నల సారాంశమే 'హాజర్ హై'.

'హాజర్ హై, హాజర్ హై'
ఆమె గుండెల్లో మోగుతూనే
వుంటుంది
అక్కడ హాజరు పరచాల్సిందే
ఆమెను కాదు
న్యాయం చెప్పే కోర్టుని'.

ఈ పుస్తకం ఎందుకు విలక్షణమైనదని నేనంటూ వున్నానంటే కోర్టు చక్రాల కింద, పోలీసు బూటు నాడాల క్రింద నలుగుతున్న జీవితాల ఆక్రందనాలు ఎన్నో ఇందులో కన్పిస్తాయి.

న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్‌కి బాగా నచ్చిన కవిత. చలమేశ్వర్‌కే కాదు, చాలామందికి బాగా నచ్చిన కవిత. నాకు కూడా బాగా నచ్చిన కవిత. 'ఒక్క కేసు చాలు..' ఆ కవిత ఇలా ముగుస్తుంది

'కేసులు నిలుస్తాయని పెట్టారు
కేసులు నిలవాలని పెట్టారు
కేసులు కేసుల కోసమే పెడ్తారు
మనిషిని వంగదీయడానికి పెడ్తారు
మనిషిని లొంగదీయడానికి పెడ్తారు'

కవిత్వం, కథలు రెండూ రాస్తాను కాబట్టి 'హాజర్ హై' లాంటి కవిత్వం రాశాను. జింబో కథలు, రూల్ ఆఫ్ లా లాంటి కథలు రాశాను. వీటన్నింటికీ ప్రేరణ నా అనుభవాలే.

కోర్టుల గురించి రాసిన మరో కవితా సంపుటి 'ఒక్క కేసు చాలు...'అచ్చులో వుంది.

**రెండక్షరాలు, లోపలి వర్షం, చూస్తుండగానే... గురించి వివరిస్తారా?**

రెండక్షరాలు కవిత్వం లో ప్రధానంగా అమ్మ, పిల్లలు, భార్య, వూరు లాంటి వాటి మీద ఎక్కువ కవిత్వం వుంటుంది. రెండు మాటల్లో ఆ కవిత్వం గురించి చెప్పాలంటే అమ్మ ఊరు, వాగు స్నేహం, మోహం, పగ, ద్వేషం, దయ, క్షమ, త్యాగం - అన్న రెండక్షరాలే. జీవితాన్ని ప్రబలంగా శాసించే ఉద్వేగాలన్నీ రెండక్షరాలే. ఇదీ ఆ కవిత్వ సారాంశం. లోపలి వర్షంలో చాన్నాళ్ళకి కలిసిన స్నేహితులు గులాబీ రెమ్మల కన్నా సున్నితమైన కలలు, నిరంతరం చూసే నీడలేని కళ్ళు, చుక్కలు చుక్కలుగా రాలుతున్న విషాదం, తడిగా తగిలే జ్ఞాపకాలు.. లోపలి వర్షానికి తడవనివాడెవ్వడున్నాడు..?



ఈ రెండింటిలో సెంటిమెంట్ ప్రధానంగా వుంటుంది. కవిత్వంలో భిన్నంగా కవిత్వాన్ని రాశానని నేను అనుకుంటాను. పోలీసులు, కోర్టులు, నేర, న్యాయ వ్యవస్థని ప్రతిబింబించే కవిత్వం 'హాజీర్ హై', వూరు, స్నేహితులు, అమ్మ, బాపు, పాప, బాబు, కవిత్వాలని ప్రతిబింబించే కవిత్వం రెండక్షరాలు, లోపల వర్షం.

ఈ రెండింటికీ భిన్నంగా రాసిన మరో కవితా సంపుటి 'చూస్తుండగానే...'. ఆధునిక జీవితం లోని సంఘర్షణ, మానవ సంబంధాలు, రేపటి మనిషి, రాజు తీర్పు లాంటి అధిక్షేప కవిత్వాలు ఇందులో వున్నాయి. అనగా అనగా... అన్న కవిత ఎందరినో ఆకర్షించింది. సత్యమూర్తి ప్రత్యేకంగా ఆ కవిత మీద ఉత్తరం రాశాడు. కవి మిత్రుడు కోడూరి విజయ్ కుమార్, ఓ మంచి వ్యాసం రాశాడు. ఎన్‌కౌంటర్ల మీద, మోచేయిలు కోల్పోతున్న మనుషుల మీద రాసిన కవిత్వాలు ఇందులో కన్పిస్తాయి.

**కొత్త కవిత్వ పుస్తకాలు, కథల పుస్తకాలు వస్తున్నాయా?**

జవాబు: చెట్టులా... ఒక్క కేసు చాలు రెండు కవితా సంపుటాలు రావాల్సి వుంది. చెట్టులాలో ఆధునిక సమాజ రచనలు కన్పిస్తాయి. 'ఒక్క కేసు చాలు' కవిత్వ సంపుటిలో నేర న్యాయవ్యవస్థ ప్రతిబింబిస్తుంది. ఇక కథల విషయానికి వస్తే మా వేములవాడ కథలు రెండవ భాగం, ఫైలు శ్వాస కవిత్వ సంపుటి, ఇంకా రెండు చిన్న కథల సంపుటాలు రావాల్సి వుంది. ఈ కరోనా కల్లోలం వల్ల ఆలస్యం అయ్యాయి.

**రచయిత కవి spontaneous గానే ఎక్కువ స్పందిస్తున్నారు. పూర్తి కాల కవి/రచయితగా వుండాలని అనుకుంటున్నారా?**

కవి- వెంటనే స్పందిస్తాడు. కథకుడు కొంత ఆలోచించి, సమయం తీసుకుని స్పందిస్తాడు. నవలా రచయిత కొంత ఎక్కువ సమయం తీసుకొని సమగ్రంగా స్పందిస్తాడు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా పనిచేసినప్పటికీ నేను పూర్తి కాల కవిని రచయితని. అట్లా వుంటేనే నిరంతరం రాయగలుగుతాం.

మా వేములవాడ కథల్లోని ఎల్లయ్య అనే పాత్ర (నిజమైన వ్యక్తే) ఇలా అంటాడు.

'నేను రాయలేను. రచనా వ్యాసంగం ఓ చెలిమె లాంటిది. నీటిని తీసిన కొద్దీ వూరుతాయి. నేను ఆ నీటిని తీయడం మానేశాను. ఊట ఆగిపోయింది. రాయలేను. చదువుతున్నాను. అది చాలు.' ఎల్లయ్యలో రచయిత వున్నాడు. ప్రయాణం లేక అతను ఆగిపోయినాడు. రచయిత ఎల్లయ్య కావలసిన వ్యక్తి, గాజుల ఎల్లయ్యగా మారిపోయాడు. రచయిత, కవి నిరంతరం ఆలోచిస్తూ వుండాలి. రాయాలని అన్వేషించినప్పుడు రాస్తూ వుండాలి.

**ఈ మధ్య యూ ట్యూబ్‌లో కథలు పెడుతున్నారు కదా! ఈ ఆలోచన ఎలా వచ్చింది.**

'మా వేములవాడ కథలు' యూ ట్యూబ్‌లో ఎవరితోనన్నా చదివిస్తే ఎలా వుంటుందన్న ఆలోచన వుండేది. అది కరోనా కాలంలో కష్టమని అన్పించింది. కరోనా పాండెమిక్ వచ్చిన తరువాత బయటకు వెళ్లడం చాలా తగ్గి పోయింది. కోర్టుకు వెళ్లడం మానేశాను. లీగల్ సమస్యలు వున్న వాళ్ళని కూడా బయట మా క్లబ్ హవుజ్‌లో మాట్లాడి పంపించడం జరుగుతుంది. ఆ దశలో మా మేనల్లుడు వారాల ఆనంద్ నువ్వే చదువు, బాగుంటుంది అన్నాడు. మా అబ్బాయి అనురాగ్ ఎట్లా ఎడిట్ చేసుకోవచ్చో చెప్పాడు. ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకోమ న్నాడు. ఆ విధంగా నా యూట్యూబ్ ఛానల్ ప్రారంభమైంది. ఇప్పటికీ నా యాభై కథలు, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాను.

మనిషి అనేవాడు నిరంతరం పనిచేస్తూనే వుండాలి మనిషి గుండెలాగా. మా బాపులాగా. అందుకే నేను నిరంతరం పని చేస్తూనే వుంటాను. కరోనా కాలన్ని ఈ విధంగా సద్వినియోగం చేస్తున్నాను.

25 సంవత్సరాల యువకుల దగ్గర నుంచి 80 సంవత్సరాల పెద్ద వాళ్ళ వరకు నా కథలని చూస్తున్నారు. వింటున్నారు. మీరు ఇన్ని కథలు రాశారా? నేను గమనించనే లేదని కథకుడు నవలా రచయిత ఓసారి ఫోన్ చేసి అన్నారు. జింబో కథలు విని కవి మిత్రుడు దాసరాజు రామారావు ఇలా అన్నారు. మీ కథా పుట ఒక ఊరట... వినందే నిద్రపట్టదు, విన్నాక నిద్రపట్టదు.

యువకుడు కవి సుఫీ ఇలా అన్నాడు. ఇన్నాళ్ళుగా జింబోని చదవకుండా ఉన్నందుకు సిగ్గేసింది.. ఒక్కో కథని విను, ఒక్కొక్క క్షణం మరణించి మళ్ళీ బతుకు, అసలు బతుకుతున్న దారుల్లో ఎన్ని రంగులున్నాయో, ఎన్ని దుఃఖాలున్నాయో చూడు... ఆఖరున జింబో ఆ కథ రాయటం వల్ల ఏ ప్రయోజనాన్ని ఆశించాడో.. ఆ రూట్ ని పట్టాడో.. అది తిరుగు బాటవ్వచ్చు, నువ్వు కొద్దిగా తిరుగుబాటు అవ్వొచ్చు...

ఇలా కవి మిత్రులు, కథాభిమానులు ఎందరో నాతో కనెక్టు అవ్వమన్నారు. పాత మిత్రులు, కొత్త మిత్రులు ఎందరో సన్నిహితులుగా మారిపోయారు. 'పావు' కథ చదివి మీరు కథ రాసి న్యాయవ్యవస్థ లో ఎలా బతికి వున్నారో నాకర్థం కాలేదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కోదండరాం నవ్వుతూ అన్నారు. మా వేములవాడ కథలోని 'ఆర్ ఎమ్ టీ బస్టాండ్' కథలో ఓ వాక్యం వుంటుంది. పుట్టిన వూరు మీద కన్నా, బతికిన వూరు మీద భావోద్వేగం ఎక్కువగా వుంటుందేమో అని.. ఆ కథ చదివి హైదరాబాదుకి తన ప్రయాణాన్ని ఆ కథ గుర్తు చేస్తుంది అని. ఇట్లా ఎన్నో అభిప్రాయాలు - వాటి గురించి వివరంగా వ్యాసమే రాయాల్సి వుంది.

**'ఒంటరితనం లేనివాడు కవి మాత్రమే' అన్నారు. అంతేనంటారా?**

కవి అప్పుడప్పుడు ఏకాంతాన్ని కోరుకుంటాడు. కానీ ఒంటరితనాన్ని కోరుకోడు. నిజానికి ఒంటరితనం కవి దరిదాపుల్లో వుండదు. కవిత్వం ఎప్పుడూ అతని వెన్నంటే వుంటుంది

**'ఆధునిక కవిత్వం సంక్లిష్టంగా వుంటుంది' అని అంటుంటారు. కానీ ఏ మాత్రం సంక్లిష్టంగా వుండనిది మీ కవిత్వం. దీనిపై శ్రద్ధ ఏమైనా తీసుకుంటారా?**

కొంతమంది కవిత్వం మాత్రమే సంక్లిష్టంగా వుంది. వాళ్ళు మెదడుకు పని చెబుతారు. నేను హృదయానికి పని చెబుతాను. అందుకే సంక్లిష్టత కన్పించదు. మనసును ఆహ్లాదపరుస్తుంది. నా కవిత్వం అంతకు మించి ఆలోచింపజేస్తుంది. మన మనస్సు సరళంగా పారదర్శకంగా వుంటే కవిత్వమూ అదే విధంగా వుంటుంది. ఇంతకు మించి మరో శ్రద్ధ ఏమీలేదు.

**మంగారి రాజేందర్‌గా మీ ప్రయాణం చెప్పుతారా?**

మంగారి రాజేందర్ పేరుతో చాలా పుస్తకాలు రాశాను. యాభై ఐదు లా పుస్తకాలని తెలుగులో ఇంగ్లీషులో రాశాను. నేను రాసినన్ని లా పుస్తకాలు తెలుగులో మరెవ్వరూ రాయలేదు. వ్యాసాలూ అంతే! వారానికి నాలుగు వ్యాసాలు రాసిన రోజులు వున్నాయి.

**తెలుగులో రాయడానికి కారణం ఏమిటి?**

తెలుగులో పుస్తకాలు రాసి సామాన్యులకి, యువ న్యాయవాదులకి చట్టాలను పరిచయం చేయ్యాలన్నది నా ఉద్దేశం. ప్రజల డిమాండ్ మేరకు, ప్రచురణ కర్తల కోరిక మేరకు రాయల్సినన్నీ పుస్తకం రాయడం లేదు. సాహిత్యం నా ప్రాధాన్యత. దాని వల్ల కూడా రాయలేకపోతున్నాను.

**మీ సాహిత్య ప్రణాళికలు వివరించండి.**

కథలు, కవిత్వాలు రాస్తూ వుండటమే ప్రధాన ప్రణాళిక. రెండు మూడు నవలలు రాయాలని వుంది. చూడాలి. ఇది కాకుండా, సమయం అనుకూలిస్తే లీగల్ డిక్షనరీ రాయాలి. చూద్దాం... కొత్త పద్ధతులను, సాంకేతికత ను ఉపయోగిం చుకొని సాహిత్యంలో ప్రయోగాలు చేయాలి.

**మంచిది సార్. నమస్కారం. మీ ప్రయాణాలు సఫలీకృతం కావాలని ఆకాంక్షిస్తున్నాను.**

నమస్కారం.. మీకూ, తంగేడు సంపాదక వర్గానికి కృతజ్ఞతలు.

# అజో-విభొ పురస్కార గ్రహీత అనుమాండ్ల భూమయ్య

అజో - విభొ - కందాళం ఫౌండేషన్ వారు ప్రతి సంవత్సరం ఇచ్చే 'విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం' 2021 సంవత్సరానికి డా.అనుమాండ్ల భూమయ్య గారికి ఇచ్చారు. పురస్కారంగా యాభైవేల రూపాయలు, ప్రశంసా పత్రం అందజేశారు. 'సాహితీ వైజయంతి' సమ్మానోత్సవ విశేష సంచికను వెలువరించారు. పురస్కార సభ 10, ఏప్రిల్ 2021 నాడు రవీంద్రభారతి, హైదరాబాదులో జరిగింది.




ఉదయం జరిగిన సాహిత్య సదస్సులో అజో.విభొ. కందాళం ఫౌండేషన్ పురస్కారక ప్రదాత ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు భూమయ్యగారిని 'అరుదైన సత్కవి' అన్నారు.

సభాధ్యక్షులు శ్రీ సన్నిధానం మాట్లాడుతూ - పాండిత్యానికి సంబంధించిన వ్యుత్పత్తి, గ్రంథ రచనలకు చెందిన ఉత్పత్తి రెండూ స్వార్జితాలైన గొప్పకవి భూమయ్య అని వారి తేటగీతి నడకల్లో పద్యవాక్యాంత శబ్దాలు, అక్షరాలు రెండవ వాక్యాల ప్రారంభ శబ్దాలు, ప్రారంభ అక్షరాలు అయి చిన్న చిన్న పక్షిపిల్లల పదాలు లేత ఆకులపై ఆనడాన్ని మనోహరంగా తలపిస్తాయన్నారు.

సాహితీవేత్త, విదుషీమణి శ్రీమతి సి.హెచ్. సుశీల భౌమమార్గ విమర్శ అనేది అంతర్మథనం నుండి వెలువడిన అమృతతుల్య పద్ధతి అని, సామాన్య పాఠకునికి అర్థమయ్యే విమర్శనా పద్ధతి అని, ఆకాశం నుండి భూమికి దిగిన విమర్శనా పద్ధతి అని, భౌమ అంటే భూమికి సంబంధించినదీ, భూమయ్యకు సంబంధించినదని ఈ పద్ధతిలో ఆయన నుండి ఏడుగ్రంథాలు వచ్చాయని అన్నారు. పుస్తకాన్ని విశ్లేషించి వివరిస్తూ మాట్లాడారు.

తెలంగాణ విశ్వవిద్యాలయానికి చెందిన గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి భూమయ్యగారి నవలా విమర్శపై సాధికార ప్రసంగం చేశారు.

ఓరుగల్లుకు చెందిన సాహితీవేత్త గన్నమరాజు గిరిజామనోహర బాబు అనుమాండ్లవారి తాత్త్విక కవిత్వంపై విశేషాంశాలు గల ప్రసంగం చేశారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్.రఘు - భూమయ్య గేయకావ్యాలపై మాట్లాడుతూ స్వీయముద్ర ఏవిధంగా కలిగి వుంది, లయ, గీతి రీతి, కథాకథనం, గానయోగ్యత వంటి అంశాలపై మంచి వివరణలతో ప్రసంగించారు.

సాహితీవేత్త, భూమయ్య శిష్యురాలు శ్రీమతి కె.ప్రియదర్శిని ప్రసంగిస్తూ పాఠాలు చెప్పడంలో, పద్యాలు చదవడంలో, సందేహాలు తీర్చడంలో, జ్ఞాన విషయాసక్తి పెంచడంలో, ఆత్మీయతను వాత్సల్యాన్ని కలిగివుండడంలో భూమయ్య నభూతో నభవిష్యతి అనిపించారని వారి వద్ద విద్య నేర్వడం మహానుభూతిప్రదం అన్నారు.

తొలుత వివేక సొసైటీ (బాపట్ల) నిర్వాహకులు, రసజ్ఞులు అంబటి మురళీకృష్ణ ఆత్మీయ వచనాలతో స్వాగతం చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన పూర్వ ఉపకులపతి ఆచార్య సి.ఆర్.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భూమయ్యగారు లోచూపు కలిగిన విమర్శకుడని, సాహిత్య విమర్శలో భౌమ మార్గవిమర్శను ప్రవేశపెట్టాడని తెలిపారు.

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న డా.గంధ్ర లక్ష్మణరావుగారు భూమయ్యగారు పద్యపఠనం వల్ల హైస్కూల్‌లోనే 'పద్యాల భూమయ్య'గా పేరు పొందినారని అనంతర కాలంలో వేయినదుల వెలుగు మొదలైన పద్యకావ్యాలను రాశారన్నారు.

ఆ తరువాత అప్పాజోస్యుల సత్యనారాయణగారు అజో.విభొ కందాళం ఫౌండేషన్ వారి 'విశిష్ట సాహితీ మూర్తి జీవితకాల సాధన పురస్కారం' అనుమాండ్ల భూమయ్యగారికి అందజేశారు. ప్రశంసా పత్రాన్ని, యాభైవేలరూపాయలను, జ్ఞాపికను అందజేశారు. శాలువతో సత్కరించారు. ఆ తరువాత పురస్కార గ్రహీత డా.అనుమాండ్ల భూమయ్యగారు తమ స్పందన తెలియజేస్తూ, తన తల్లిదండ్రులను, గురువులను స్మరించారు. తెలుగు అధ్యాపక వృత్తిలో కొనసాగటం వల్లనే కవిత్వాన్ని, విమర్శను రాయగలిగినానన్నారు. ఈ పురస్కార సభకు అంబటి మురళీకృష్ణగారు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# మధుకర్ వైద్యుల బొగ్గుపూలు ఆవిష్కరించిన కల్వకుంట్ల కవిత



సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత మధుకర్ వైద్యుల రచించిన బొగ్గుపూలు కవితా సంపుటిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన నివాసంలో ఏప్రిల్ 16, 2021న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపడం కోసం కవులు, కళాకారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మధుకర్ వైద్యుల చిన్నతనం నుంచే కవితలు, కథలు రాస్తూ సాహిత్యానికి సేవ చేస్తున్నారని, గతంలోనూ ఆయన స్వతంత్రసుమాలు పేరుతో కవిత సంపుటి వేశారని గుర్తు చేశారు. ఆయన కవితలు సమాజాన్ని ప్రశ్నించడంతో పాటు, సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయని అన్నారు. ఈ ఆవిష్కరణ సమావేశంలో పుస్తక రచయిత మధుకర్ వైద్యుల, తెలంగాణ జాగృతి ప్రధానకార్యదర్శి నవీన్ ఆచారి, పీఏ శరత్‌చంద్రా, మధుకర్ కుటుంబసభ్యులు సుమలత, ఆశికారెడ్డి, అన్వేషికా రెడ్డి, ప్రదీప్, తిరుమల్, మధు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సబాల్టర్న్ పత్రిక ఆరో సంచిక ఆవిష్కరణ

సబాల్టర్న్ పత్రిక ఆరో సంచికను ఆవిష్కరిస్తున్న దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల అధికారి బొజ్జ అనిల్ కుమార్ (మధ్యలో). చిత్రములో ఓబీసీ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు ధీకొండ పద్మనాభం, ముదిరాజ్ సంక్షేమ సమితి అధ్యక్షులు ఏ.సురేష్, జగన్మోహన చారిలున్నారు.

# మెతుకు సీమలో వసంతోత్సవం...

మెతుకుసీమ సాహితీ సాంస్కృతిక సంస్థ- సంగారెడ్డి, జాతీయ సాహిత్యపరిషత్తు కరీంగనగర్ సంయుక్త నిర్వహణలో అంతర్జాల జూమ్ మాధ్యమంగా వసంతోత్సవ వేడుకలు ఏప్రిల్ 20, 2021న ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉగాది శ్రీరామనవమి కవిసమ్మేళనం మరియు సాహితీ సదస్సు నిర్వహించబడ్డాయి.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ రామాయణం గొప్ప సందేశాత్మక కావ్యమని, రామాయణంలోని ప్రతి పాత్ర ఆదర్శనీయమని తెలిపారు. శ్రీరామనవమి కవిసమ్మేళనం నిర్వహించుకోవడం ఔచితీవంతమని సంయోజకులు అవుసల భానుప్రకాశ్‌ను ప్రశంసించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సాహిత్యం సాంకేతికతతో సమ్మిళితమై వసంతోత్సవాలను నిర్వహించుకోవడం శుభ పరిణామమని తెలిపారు. కవులందరూ రామతత్వాన్ని కవితల్లో ప్రకటించడం ద్వారా సమాజాన్ని మంచి మార్గంలో మళ్ళించడం సాధ్యమౌతుందని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన ప్రముఖకవి సంగనభట్ల నరసయ్య వర్తమాన కవులకు దిశానిర్దేశం చేశారు. మరో ఆత్మీయ అతిథి గండ్ర లక్ష్మణ రావు గారు పద్య కవిత్వ నిర్మాణ మెళకువలందించారు. సాహిత్యం ద్వారానే సమాజగతి నిర్దేశింబడుతుందని దాస్యం సేనాధిపతి తెలిపారు. విశిష్ట అతిథి గా పాల్గొన్న సువర్ణ వినాయక్ పండుగలగూర్చి సంస్కృతి ఔన్నత్యాన్ని సందేశాత్మకంగా అందించారు.

ఐదున్నరగంటలపాటు నిరాఘాటంగా జరిగిన ఈ కవి సమ్మేళనంలో మెతుకుసీమ అధ్యక్ష కార్యదర్శులు పూసల లింగాగౌడ్, అవుసుల భానుప్రకాశ్, జాసాప అధ్యక్ష కార్యదర్శులు గాజుల రవీందర్, నందిశ్రీనివాస్ లు క్రియాశీలక పాత్ర వహించారు.

ప్రముఖ శతావధాని జియం రామశర్మ, అయాచితం నటేశ్వర శర్మ, కంది శంకరయ్య, దోరవేటి, అన్నవరం దేవేందర్, కలువకుంట రామకృష్ణ, పాకరాజమౌళి, వాసరచెట్ల జయంతి, సరస్వతీ రామశర్మ, బండకాడి అంజయ్య గౌడ్, దబ్బెట రాజారామ్మోహన శర్మ తదితర కవులు శ్రీరామ ప్రాశస్త్యాన్ని కవితలుగా వినిపించారు. సభను ఐదున్నర గంటలపాటు అవుసుల భానుప్రకాశ్ ఆద్యంతం సమయోచిత వ్యాఖ్యానంతో కొనసాగించారు.




## అడుగులు

డా॥ ఎం. దేవేంద్ర

**విశాల సాహిత్య అకాడమి**
హైదరాబాద్
వెల : రూ.120/-



## యుద్ధానికి అడుగులు వేద్దాం

ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నా రాణి

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
ఫోన్ : 040-27618261
వెల : రూ.100/-



## గుప్పిట్లో గోదారి

ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి

**నవచేతన పబ్లిషింగ్ హౌస్,**
**విశాలాంధ్ర, నవ తెలంగాణ**
సెల్ : 98494 64017
వెల : రూ. 120/-




## రాగతంత్రులు

డా॥ వి.ఆర్. మోహన్
సెల్ : 9848052486




## సగం సగం కలసి

కోడం పవన్ కుమార్

**లయా పబ్లికేషన్స్**
హైదరాబాద్
సెల్ : 98489 92825
వెల : రూ. 70/-




## తెలంగాణ కవితా కల్హారాలు

తెలంగాణ సారస్వత పరిషత్తు

ఫోన్ : 040-24753724
వెల : రూ. 170/-

# సైనికా!

**(స్వతంత్ర భారత అమృతోత్సవ వేళ సైనిక శక్తిని కీర్తిస్తూ)**



భారత దేశమన్నది శుభ స్వర భాస్వర సార పూరితోం
కారము, చిత్రకారమ వికారముదారము, దీనిపై నహం
కారము తోడ భీకరపు కత్తుల దూసెడు చిత్తమూని హుం
కారము జేయునట్టి అపకారులకున్ యమరూప సైనికా!

కసికసిగా విషమ్ములను గ్రక్కుచు నిక్కుచు వక్రగాములై
బుస బుస లాడు నాగులయి ముద్రిత సీమల దాటి వచ్చుచున్
రుస రుస లాడు దుర్మదుల ద్రుంచెడి గారుడ శక్తివీవు, నీ
మిస మిసలాడు మీసముల మిన్నులన్ విజయోస్తు సైనికా!

**- డా.జి.యం. రామశర్మ**

